ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 21 సెప్టెంబరు, 1977 సంచిక : 11
నిజశ్రావణ—భాద్రపద, 1899 శా. శ.

ప్రధాన సంపాదకులు .
శ్రీ రాజ్యం సిన్హా

సంపాదకులు .
కుందుర్తి ఆంజనేయులు

ముఖచిత్రం తెలుగు వెలుగు
రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి

రెండు, మూడు కవరు పేజీలు · వీరేశలింగం జీవిత చరిత్ర
(బుజ్జాయి బొమ్మల చిత్రాలు)

చివరి కవరు పేజీ : ఇంటి కన్నా గుడి పదిలం !
(ఫోటో: శ్రీ షేక్ అసదుల్లా అహమ్మద్, బి.ఏ., రాజమండ్రి)

వెల: 50 పైసలు

సాలుచందా : ఆరు రూపాయలు

రిజిస్టరు నెం : హెచ్. హెచ్. డి. 81

ఈ సంచికలో...

పేజీ

శ్రీ నీలం సంజీవరెడ్డి



శ్రీ నీలం సంజీవరెడ్డిగారి చేత జూలై 25న న్యూఢిల్లీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎం. హెచ్. బేగ్ పార్లమెంటు సెంట్రల్ హాలులో రాష్ట్రపతిగా ప్రమాణం స్వీకరింపచేశారు

"తనిసిరే వేల్పులుదధి రత్నములచేత. వెరచిరే ఘోరకాకోల విషము చేత.... నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు" అన్నది మన ప్రాచీన సుభాషితం. నూతన రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి నిశ్చయంగా నిపుణమతి. గడచిన ఏబది సంవత్సరాల తమ రాజకీయ జీవితమథనంలో రత్నాలు లభించగానే శ్రీ సంజీవరెడ్డి ఉప్పొంగి పోలేదు; ఘోర కాకోల విషం ఎదురయిన సందర్భాలలో ఆయన క్రుంగి పోలేదు. ప్రజాసేవ, దేశ సేవ జీవిత పరమ లక్ష్యంగా భావించి భారత రాజకీయ రంగంలో అచంచల స్థైర్యంతో నిలచి, గెలిచి, ఆశయసిద్ధి పొందిన వజ్ర సంకల్పుడు శ్రీ సంజీవరెడ్డి.

బహుముఖ ప్రజ్ఞ

ఇటీవలి లోకసభ ఎన్నికల తరువాత హైదరాబాదు నగరంలో జరిగిన ఒక సన్మాన సభలో శ్రీ సంజీవరెడ్డి తమకు తిరిగి లభించిన పార్లమెంటు స్పీకరు పదవిగురించి ప్రస్తావించారు—లోకసభ ఎన్నికల ఫలితాలు ప్రకటితం కాగానే ఆసుపత్రిలో ఉన్న శ్రీ జయప్రకాశ్‌ను చూడడానికి బొంబాయి వెళ్ళినప్పుడు అక్కడే ఉన్న జనతా పార్టీ అగ్రనాయకులందరు పార్లమెంట్ స్పీకరు పదవికి "ఆప్ హీ రహ్నా, ఆప్ హీ రహ్నా (మీరేఉండాలి, మీరే ఉండాలి)''అని ఒత్తిడి తెచ్చారని,ఆ నాయకులందరి కోరికను అంగీకరించక తప్పలేదని శ్రీ సంజీవరెడ్డి ప్రజల హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. రాష్ట్ర మంత్రి పదవి, ముఖ్యమంత్రి పదవి మొదలుకొని కేంద్ర మంత్రి పదవి వరకు గడచిన ఏబది సంవత్సరాల కాలంలో వివిధ పదవుల నిర్వాహణలో శ్రీ సంజీవరెడ్డి అసాధారణ స్థాయిలో ప్రదర్శించిన పరిపాలనా సామర్థ్యం, నాయకత్వదక్షత, ప్రజ్ఞాపాటవాలు, చిత్తశుద్ధి, ఉన్నత వ్యక్తిత్వం, ప్రతిభా ప్రాగల్భ్యం, అన్నిటికీ మించి అకుంఠితమైన ఆయన దేశభక్తి, ఆయనలోని ప్రజాసేవాను రక్తి మొన్నటి రాష్ట్రపతి ఎన్నిక సందర్భములో జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పక్షాలను ఆకర్షించాయి. తత్పరిణామమే అన్ని రాజకీయ పార్టీల వారు మరొక సారి, ఆప్ హీ రహ్నా అని శ్రీ సంజీవరెడ్డి గారిని అభ్యర్థించడం, ఆయన ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నిక కావడం.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

స్వతంత్ర భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఏకగ్రీ[illegible] ఎన్నిక వాస్తవంగా మహత్తరమైన ఒక అపూర్వ ఘట్టం. ముప్పయి సంవత్సరాల తరువాత ప్రప్రథమ పర్యాయంగా భారత రాజకీయ వ్యవస్థలో సంభవించిన అద్భుతమైన విప్లవకర పరిణామాలకు సజీ[illegible] సంకేతరిగా శ్రీ సంజీవరెడ్డి రాష్ట్రపతి పదవికి సకల జన ఆమోదంతో ఎన్నికయినారు. ఇది నూతన భారత రాజకీయాలలో అసాధార[illegible]మైన విషయం. స్వతంత్ర భారత దేశానికి వరుసగా ముగ్గురు ప్రధాన మంత్రులను ప్రసాదించగలిగిన గౌరవాన్ని, విశిష్టతను ఉత్తర ప్రదేశ్ పొందగలిగింది. ఆర్థికంగా ఉత్తరప్రదేశ్ వలె[illegible] ఆంధ్రప్రదేశ్ వెనుకబడ్డ ప్రాంతం. అయితే, ఈ రెండు రాష్ట్రా[illegible]లలోను రాజకీయ చైతన్యానికి కొదవలేదు. స్వతంత్ర భారతదేశాని[illegible] ఉత్తరప్రదేశ్ ఇప్పటివరకు ముగ్గురు ప్రధాన మంత్రులను ప్రసాదించినట్లే ఆంధ్రప్రదేశ్ ముగ్గురు రాష్ట్రపతులను ప్రసాదించగ[illegible]గింది. ఈ ముగ్గురిలో మొదటి ఇద్దరు తెలుగుసీమ మారుమూ[illegible] ప్రాంతాలకు చెందిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు[illegible] శ్రీ వరాహగిరి వేంకటగిరి, మూడవ వారు శ్రీ నీలం సంజీవరె[illegible] గారు కూడా ఆంధ్రదేశంలోని ఒక మారుమూల పేద ప్రాంతాని[illegible]

సాధారణ రైతు కుటుంబానికి చెందినవారే. ఆర్థికంగా పేద ప్రాంతమయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రసాదిస్తున్న రాష్ట్రపతులు అత్యున్నత వ్యక్తిత్వంతో భారతావనికి ఖండాంతర ఖ్యాతిని గడిస్తున్నారనడంలో సందేహం లేదు. ఇదే సంప్రదాయ ఫణితిలో రాష్ట్రపతి పదవిని అత్యంత ప్రతిభావంతంగా, నిరుపమానమైన రాజకీయ విజ్ఞతతో నిర్వహించి శ్రీ నీలం సంజీవరెడ్డి గారు ఇటు ప్రజాస్వామ్య వ్యవస్థకు నూతన శక్తినీ, అటు అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్నీ మరింత ఉన్నత శిఖరాలకు తీసుకవెళ్ళగలరని దృఢంగా విశ్వసించవచ్చు.

ఏబది సంవత్సరాల పాత్ర

త్యాగపూరితమైన శ్రీ సంజీవరెడ్డిగారి జీవితం ఆధునిక ఆంధ్రదేశపు రాజకీయ, జాతీయోద్యమాలకు అద్దం వంటిది. గడచిన ఏబది సంవత్సరాలలో, ఆంధ్రదేశంలో శ్రీ సంజీవరెడ్డిగారి చైతన్యవంతమయిన నాయకత్వ ప్రభావం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రస్ఫుటంగా ప్రసరించని రాజకీయోద్యమం లేదంటే అతిశయోక్తి కాదు. అవిభక్త మద్రాసు రాష్ట్ర కాంగ్రెసు రాజకీయాలలో గూడా శ్రీ సంజీవరెడ్డి ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఆధునిక ఆంధ్రదేశపు రాజకీయ చరిత్ర, శ్రీ సంజీవరెడ్డిగారి సేవాజీవితం అద్వైతం పొందినా యన్నది ఒక చారిత్రిక సత్యం. ఆధునికాంధ్ర రాజకీయ, జాతీయోద్యమ వైతాళికులైన టంగుటూరి ప్రకాశం పంతులు, కల్లూరు సుబ్బారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తి ప్రభృత నాయక మణులతోను, దక్షిణ భారతదేశంలోని రాజగోపాలాచారి, కామరాజ నాడార్ వంటి, అగ్రనాయకులతోను, జాతీయస్థాయిలో జవహర్లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, మొరార్జీదేశాయి తదితర మహానాయకులతోను శ్రీ సంజీవరెడ్డిగారి సన్నిహిత సంబంధాలకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉన్నది.

ప్రజాస్వామ్య వాది

మొదట ఆంధ్రరాష్ట్ర నిర్మాణంలో, అటు తర్వాత ఆంధ్రప్రదేశ్ అవతరణలో అగ్రగణ్యమైన కీలక పాత్ర నిర్వహించిన శ్రీ సంజీవరెడ్డిగారు మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యవాద భావాలకు, ప్రణాళికలకు అనుగుణంగా జవహర్లాల్ నెహ్రూ ఆశాజ్యోతులవంటి ఎన్నో దీపాలను వెలిగించడానికి, ఆధునిక దేవాలయాల శంకుస్థాపన కావించడానికి కారణభూతుడయినాడు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీశైల మల్లికార్జునస్వామి భక్తుడయిన శ్రీ సంజీవరెడ్డిగారు తమ కార్య దక్షతను ఆధునిక దేవాలయాల నిర్మాణానికి, సామాన్య ప్రజాకోటి కళ్యాణానికి అంకితం కావించడంలో ఆశ్చర్యం లేదు. దేశంలోని సంపదలన్నీ, జాతీయ వనరులన్నీ సామాన్య ప్రజల సంక్షేమానికి, శ్రేయస్సుకు దత్తం కావాలని ప్రగాఢంగా విశ్వసించే ప్రజాస్వామ్యవాది శ్రీ సంజీవరెడ్డిగారు.

మధురస్మృతులు

రాయలసీమ అనంతపురం జిల్లాలోని ఇల్లూరు గ్రామంలో 1913 వ సంవత్సరం మే నెల 13వ తేదీన ఒక రైతు కుటుంబంలో శ్రీమతి సుబ్బమ్మ, శ్రీ చిన్నపరెడ్డి దంపతుల పురాకృతజన్మఫలంగా శ్రీ సంజీవరెడ్డిగారు జన్మించారు. ప్రాథమిక విద్య ఇల్లూరులో, సెకండరీ విద్య అనంతపురంలో పూర్తి అయినవి. మద్రాసు నగరంలోని నేషనల్ థియొసాఫికల్ కాలేజీలో కళాశాల విద్య ప్రారంభమైంది. దేశభక్తులయిన శ్రీ సంజీవరెడ్డిగారు ఆ రోజులలో కళాశాల విద్యకు స్వస్తిచెప్పి, గాంధీజీ పిలుపుతో ఉత్తేజితులై భారత స్వాతంత్ర్యోద్యమంలో అడుగు పెట్టినారు. విద్యార్థిగానే జాతీయోద్యమానికి అంకితమయిన సంజీవరెడ్డిగారు 1930వ సంవత్సరంలో రాజగోపాలాచారిగారి నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అవిరళ ఉద్యమ తత్పరులయిన శ్రీ సంజీవరెడ్డిగారు 1938–40 సంవత్సరాల కాలంలో ఆంధ్ర కాంగ్రెస్ కార్యదర్శిత్వాన్ని నిర్వర్తించవలసి వచ్చింది. 1942 క్విట్ యిండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆయన కారాగార క్లేశం అనుభవించారు. 1946 వ సంవత్సరంలో శ్రీ సంజీవరెడ్డిగారు మద్రాసు శాసన సభ సభ్యులుగా ఎన్నికయి, 1949 నుంచి 1951 వరకు కుమారస్వామి రాజా మంత్రివర్గంలో అటవీ శాఖామాత్యులుగా వున్నారు. అదే కాలంలో భారత రాజ్యాంగ నిర్ణయ సభలోగూడ శ్రీ సంజీవరెడ్డిగారు సభ్యులు. ఆనాటి రాజ్యాంగ నిర్ణయ సభలోని అతిరథ మహారథులతో సన్నిహితంగా గడిపిన రోజుల అనుభవాలను శ్రీ సంజీవరెడ్డిగారు ఇప్పటికీ మధుర స్మృతులుగా తమ గంభీరోపన్యాసాలలో వివరిస్తుంటారు.

వివిధ పదవులలో...

జాతీయోద్యమంలో, స్వతంత్ర భారత రాజకీయ రంగంలో అనేక సమరాలందు ఆరితేరిన యోధుడు, సాహసికుడు, రాజకీయ వ్యూహ చతురుడు శ్రీ సంజీవరెడ్డిగారు. తీవ్రమైన పోటీలో గెలిచి 1951 వ సంవత్సరంలో ఆయన ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్ష పదవిని చేపట్టారు. 1952–53 సంవత్సరాల కాలంలో ఆయన రాజ్యసభ సభ్యులు. 1953 అక్టోబరు 1 వ తేదీన, అనేక త్యాగాల ఫలితంగా, ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారికి కుడిభుజంగా శ్రీ సంజీవరెడ్డిగారు ఉప ముఖ్యమంత్రి పదవిని నిర్వహించారు. ఆ తరువాత, 1955–56 సంవత్సరాల మధ్యకాలంలో మధ్యంతర శాసనసభ ఎన్నికల పర్యవసానంగా ఏర్పడ్డ ప్రభుత్వంలో, గోపాలరెడ్డిగారి ముఖ్యమంత్రిత్వంలో కూడా ఉప ముఖ్యమంత్రిగా ఉండి శ్రీ సంజీవరెడ్డిగారు ఉదార వైఖరితో విశాల దృక్పథంతో కాంగ్రెసు సంస్థ సమైక్యతకు దోహదపడ్డారు.

1956వ సంవత్సరం నవంబర్ 1వ తేదీన సముగ్రస్వరూపంతో అవతరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రప్రథమ ముఖ్యమంత్రి అయ్యారు శ్రీ సంజీవరెడ్డిగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపు తొలిదశలో గురుతరమైన ముఖ్యమంత్రి బాధ్యతలను నాలుగు సంవత్సరాలపాటు నిర్వహించి రాష్ట్ర ఆర్థిక, సామాజిక, వైజ్ఞానిక అభ్యుదయానికి ఆలంబనంగా బృహత్తర పథకాలకు శ్రీ సంజీవరెడ్డిగారు నాందీ ప్రస్తావన కావించారు.


రాష్ట్రపరిధిని దాటి 1960 వ సంవత్సరములో శ్రీ సంజీవరెడ్డిగారు జాతీయ స్థాయి రాజకీయాలలో ప్రవేశించవలసి వచ్చింది.

స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ అభిమతానికి అనుగుణంగా 1960 జనవరి నెలలో శ్రీ రెడ్డిగారు అఖిల భారత జాతీయ కాంగ్రెసు పదవీ బాధ్యతను స్వీకరించారు. 1962 వ సంవత్సరపు సాధారణ ఎన్నికల తరువాత ఆయన తిరిగి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. బస్సుల జాతీయకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించడం తమ నైతిక బాధ్యతగా భావించి 1964 వ సంవత్సరంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించి న్యాయ వ్యవస్థమీద తమకున్న గౌరవాన్ని ప్రకటించారు. పదవులు ఆయనకు తృణప్రాయం అని చెప్పడానికి ఇదొక తార్కాణం. 1964 వరకు లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గములో మంత్రిగా గనులు, ఉక్కు, పౌర విమానయానం వంటి ముఖ్యమైన శాఖలను శ్రీ సంజీవరెడ్డిగారు సమర్థవంతంగా, ప్రశంసనీయంగా నిర్వహించారు. 1967 నుంచి 1969 వరకు లోక్‌సభ స్పీకర్ పదవిని శ్రీ సంజీవరెడ్డిగారు అన్ని రాజకీయ పక్షాల ప్రశంసలకు, అభిమానానికి పాత్రంగా నిర్వహించి విశిష్టమైన పార్లమెంటరీ సంప్రదాయాలకు ఒరవడి పెట్టారు. 1969 వ సంవత్సరంలో లోక్‌సభ స్పీకర్ పదవికి రాజీనామాచేసి కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ సంజీవరెడ్డి గారు రాష్ట్రపతి పదవికి పోటీ చేశారు. ఈ ఎన్నిక సందర్భంలో తలయెత్తిన అసాధారణ రాజకీయ పరిస్థితుల కారణంగా ఆయన ఓటమి పొందవలసి వచ్చింది. ఆ నాడు ప్రారంభమైన రాజకీయ అసాధారణ పరిస్థితి ఈ నాడు, 1977 వ సంవత్సరం జూలై 25 వ తేదీన, మన దేశంలోని అన్ని రాజకీయ పక్షాల ఏకగ్రీవ అభ్యర్థిగా శ్రీ సంజీవరెడ్డి రాష్ట్రపతి పదవీ బాధ్యతలను స్వీకరించడంతో తిరిగి సాధారణ పరిస్థితికి వచ్చిందని చెప్పవచ్చు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని అత్యున్నత అధికార పీఠం రాష్ట్రపతి పదవి. ఈ అత్యున్నత పదవికి శ్రీ సంజీవరెడ్డిగారి ఏకగ్రీవ ఎన్నిక మహత్తర చారిత్రిక సంఘటన. తమకు సహజమైన ప్రతిభా సంపదలతో, రాజకీయ దురంధరత్వంతో, జాతీయ భావవిలసితమైన దేశభక్తితో శ్రీ సంజీవరెడ్డిగారు రాష్ట్రపతి పదవీ బాధ్యతలను సకల జన స్తవనీయంగా నిర్వహించగలరని ఆశించవచ్చు.

—శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థానకవి

డా. దాశరథి



సుప్రసిద్ధ అభ్యుదయ కవి డాక్టరు దాశరథిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్థానకవిగా నియమించింది.

డా. దాశరథి జగమెరిగిన బ్రాహ్మణుడు. కవిగా, దేశభక్తుడుగా, స్వాతంత్ర్యయోధుడుగా, బహుభాషావేత్తగా, పండితుడుగా, వక్తగా, వీటన్నిటినీ మించి గొప్ప మానవతావాదిగా డా. దాశరథి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చిరపరిచితులు. దాదాపు 30 సంవత్సరాలుగా సాహిత్య సేవ చేస్తూ ఆనాటి ఫ్యూడల్ వ్యవస్థకు చిహ్నంగా నిలచిన నిజాం ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన కవి యోధుడుగా డా. దాశరథిని ప్రజలు గౌరవిస్తారు.

డా. దాశరథి రచించిన 'గాలిబ్ గీతాల'కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ అనువాద బహుమతి 1967లో ప్రకటించింది. 'కవితా పుష్పకం'అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి 1976లో లభించింది. 1972లో డా. దాశరథికి కేంద్ర ప్రభుత్వం తామ్రపత్రం బహూకరించింది. 'తిమిరంలో సమరం' కావ్యానికి 1974లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం1975లో కళాప్రపూర్ణబిరుదుతో సత్కరించింది. 1976లో ఆగ్రా యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ లెటర్స్ అనే గౌరవ పట్టం ప్రసాదించింది.

డా. దాశరథి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యనిర్వాహక వర్గ సభ్యులు. కేంద్ర సాహిత్య అకాడమీ సలహాసంఘంలోనూ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘంలోనూ డా. దాశరథి సభ్యులు. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా డా. దాశరథి సన్మానం అందుకున్నారు. సినిమా రంగంలో ప్రతిభావంతమైన వేలాది పాటలు వ్రాసి ప్రజాహృదయాలను చూరగొన్న ప్రజాకవి డా. దాశరథి.

ఆంధ్రాంబిక

—డాక్టర్ దాశరథి

కనద్దివ్య గోదావరీ కంఠహారే !
లసద్భవ్య కృష్ణా నవౌఢ్యాణ హీరే !
మహాంధ్ర ప్రజామాతృమూర్తే ! జయస్తే !
విశాలావనీ వ్యాప్తి కీర్తే ! నమస్తే.

నీ యాస్థానకవిన్; భవత్ పదయుగీ నీరేజ సౌగంధ్యముల్
నాయందున్న అనంత భావవితతిన్ నర్తింపగా జేసె; తల్లీ !
యేనాడును నీదు పూజనమునన్ లీనమ్ము నా జన్మ; నీ
ఛాయన్ నిల్చిన నాకు సౌధముల వాంఛల్ లేవు, ఆంధ్రాంబికా !


మదమాతంగ తురంగముల్ వలదు, నీ మంజీర నాదంబుతో
ముదమందం గల నీ సుతుండ, నిను రేపున్ మాపు కొండాడుటే
కద నా జీవితమందు సార్థకత ! నిక్కంబొక్కటే తల్లీ ! నీ
పద చిహ్నమ్ముల దారిబోవుటయె నా భాగ్యమ్ము; ఆంధ్రాంబికా !

కవితా కేతనమున్ కరానగొని లోకంబందు నీ దీవనల్
జవసత్వంబులుగా చరించెదను ; సంధ్యా భాస్కర శ్రీకర
చ్ఛవితో తామస పుంజమున్ గెలిచి పూజ్యంబైన నా జాతి ప్రా
భవమున్ గోరి రచించెదన్ ప్రగతి కావ్య శ్రీలు, ఆంధ్రాంబికా !

శ్రామిక ప్రజ నా బంధుజాలమగును
సామ్యవాద ప్రజాస్వామ్య సాధనమ్మె
గమ్యమైయొప్ప ప్రగతి మార్గంబుపైన
నిర్భయమ్ముగ సాగిపోనిమ్ము ! తల్లి.

(ఆస్థానకవి నియామకం జరిగినప్పుడు)

ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమాభివృద్ధి



శ్రీ కూరాడ వెంకటేశ్వరరావు

ప్రకృతి ప్రసాదితమైన నీరు, ఖనిజ, ఆటవిక, సముద్ర సంపదలోను, వ్యవసాయక ఉత్పత్తులలోను "ఆంధ్రప్రదేశ్" అగ్రగామిగా వుంది. దక్షిణ భారతావనికి ధాన్యాగారమని పేరు గాంచింది. యావద్భారత దేశానికీ 'అన్న పూర్ణ' గా పరిగణిస్తారు మన రాష్ట్రాన్ని! వ్యవసాయక రంగంలోనూ, వ్యవసాయానికి సంబంధించిన ఇతర ప్రకృతి సంపదను ఉపయోగించు కోవడంలోను ఎంత పురోభివృద్ధి సాధించినా, నానాటికీ పెరిగి పోతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి మనం పరిశ్రమలను అభివృద్ధిచేయాలి. అందుకే ఇటీవల ప్రభుత్వ, ప్రయివేటు, జాయింటు రంగాలలో ఎన్నో పరిశ్రమలు స్థాపించి లాభసాటిగా నడుపుతున్నారు. 1956లో మన రాష్ట్రం ఏర్పడి నప్పుడు భారీవి, ఒక మోస్తరువి రూ. 45 కోట్లు పెట్టుబడితో కేవలం 45 పరిశ్రమలుండేవి. అవి గూడా వ్యవసాయానికీ, ఖనిజ అటవీ సంపదకు అనుబంధంగా నడిపే చక్కెర ఫ్యాక్టరీలు, కాగితపు మిల్లులు, సిమెంటు ఫ్యాక్టరీలూను. కాని ఇటీవల రూ. 400 కోట్ల పెట్టుబడితో 270 భారీవి, ఒక మోస్తరువి అనేక రకమైన పారిశ్రామిక సంస్థలను నడుపుతున్నారు. వీటిలో లక్షన్నర మందికి ఉపాధి లభిస్తోంది. మన రాష్ట్రం వస్తుతః వ్యవసాయకరాష్ట్ర మగుటచేతను, ఖనిజ సంపద అపారంగా ఉండుటచేతను ఇప్పటికీ ఆ రంగాలకు సంబంధించిన, అంటే, చెరకు, దూది, పొగాకు, జనపనార, ఆముదపు గింజలు, వేరు శెనగ, పండ్లు, కాయగూరలు మొదలగు ముడిసరుకులు ఉపయోగించే పరిశ్రమలే ఎక్కువగా స్థాపించగలుగుతున్నాము. మన రాష్ట్రపు మొత్తం భూమి వైశాల్యం 2,76,700 చ॥ కి. మీటర్లయితే, అందులో 64,546 చ॥ కి. మీటర్లు మాత్రమే అడవులు. అంటే 23.3 శాతం మాత్రం అడవులున్నాయి. ఈ కొద్ది అటవీ సంపదలో, రాజమండ్రి, సిర్‌పూరులలో పేపరు మిల్లులు, తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరంలో ప్లయివుడ్ కారానా, భద్రాచలంలో పేపర్ బోరు మిల్లు మొదలగునవి కొన్ని పరిశ్రమలు స్థాపించగలిగాం. ఈ చిన్న పరిశ్రమలేగాక మన కున్న అపార ఖనిజ సంపదతో భారీ పరిశ్రమలు కూడ స్థాపించ వచ్చును. బొగ్గు ప్రాతిపదికగా రూ. 150 కోట్ల పెట్టుబడితో రామగుండం దగ్గర ఒక ఎరువుల ఫ్యాక్టరీ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇది 1977వ సంవత్సరం మధ్యలో ఉత్పత్తి ప్రారంభించ వచ్చును. కాకినాడ సమీపంలో రూ. 230 కోట్ల పెట్టుబడితో మరొక పెద్ద ఎరువుల ఫ్యాక్టరీల సముదాయం తయారవుతోంది. రూ. 100 కోట్ల పెట్టుబడితో ఒక సోడా-యాష్ ప్లాంటు, 5 సిమెంటు ఫ్యాక్టరీలు, 2 పెద్ద రకం కాగితం మిల్లులు మన రాష్ట్రంలో నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనం పారిశ్రామికంగా పురోభివృద్ధి సాధిస్తున్నామనటానికిదే తార్కాణం.

ఖనిజ సంపద

మన రాష్ట్రంలో అపారమైన ఖనిజ సంపద వుంది. ఈ సంపదను భూగర్భం నుండి వెలికి దీసి, ఆయా ఖనిజాలు ఉపయోగించే పరిశ్రమలను స్థాపించడాని కెంతో అవకాశముంది. మనకు 4

మిలియను టన్నుల బొగ్గు వుంది. సింగరేణి, వాటి అనుబంధ గనులలో బొగ్గు త్రవ్వి తీస్తున్నారు. పైన చెప్పినట్లు రామ గుండం వద్ద బొగ్గు ప్రాతిపదికగా ఒక భారీ ఎరువుల ఫ్యాక్టరీ త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తుంది. 600 మిలియను టన్నుల ఇనుప ఖనిజము, 1.7 మిలియను టన్నుల బరాయిటిస్, 0.25 మిలియనుల టన్నుల అస్‌బెస్టాస్, 50 మిలియను టన్నుల బాక్సైట్, 1/2 మిలియను టన్నుల రాగి, 3 మొదలు 4 మిలియను టన్నుల మాంగనీసు వున్నాయి, మన రాష్ట్రంలో ఇవిగాక మైకా, సున్నపు రాయి, గ్రాఫైట్, మార్బుల్ రాయి, సయలైట్ మొదలగు ఖనిజాలెన్నో వున్నాయి. వీటిని ముడి సరుకులుగా తీసికొని అనేక పరిశ్రమలు స్థాపించడానికి వీలుంది.

పరిశ్రమల స్థాపనకు ముఖ్యాంశాలు

ఈ రోజులలో పరిశ్రమలు స్థాపించాలంటే పెట్టుబడి వుంటేనే చాలదు. ఏ పరిశ్రమ ఎక్కడ పెడితే లాభసాటిగా వుంటుంది, ముడిసరుకు, విద్యుచ్ఛక్తి, నీరు దగ్గరలో దొరుకుతాయా లేదా, ఆ పరిశ్రమకు కావలసిన సాంకేతిక నిపుణులు మన దేశములో వున్నారా, దానికి కావలసిన యంత్రాలు ఎక్కడ దొరుకుతాయి, అన్న విషయాల మీద ముందు నిర్ణయాలు తీసికోవాలి. ఆధునిక వైజ్ఞానిక, యంత్ర యుగంలో ఉత్పత్తి విధానాలు త్వర త్వరగా మారుతున్నాయి, ఇందువల్ల ఏ ఉత్పత్తి విధానం లాభసాటిగా వుంటుందనేది కూడా విచారించాలి. అట్లాంటి సాంకేతికమైన జటిల సమస్యలను పరిష్కరించి ఆయా పరిశ్రమలకు కావలసిన సాంకేతిక నిపుణులను, పారిశ్రామిక వేత్తలను ఎంచుకుని, వారికి ధనసహాయం ఇతర సహాయాలు చేస్తేనే స్థాపించిన పరిశ్రమలు నాలుగు కాలాలపాటు పనిచేసి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ సమస్యా పరిష్కారానికి ఉపయోగకరంగా వుంటాయి. లేకపోతే మఖలో పుట్టి, పుబ్బలో మాడిపోతాయి. ఇందుకే రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు కావలసిన పై ముఖ్యాంశాలమీద నిపుణుల సలహా నివ్వడానికి అనేక కార్పొరేషన్‌లను నెలకొల్పింది. వీటిలో మొట్టమొదటగా "పారిశ్రామిక ఇన్‌ఫ్రాస్ట్రక్చరు కార్పొరేషన్" కృషిచేయాలి. వీరు ఇంతవరకు రాష్ట్రమంతటా 130 పారిశ్రామిక వాడలను నెలకొల్పి పారిశ్రామికవేత్తలకు కావలసిన విద్యుచ్ఛక్తి, నీరు, రోడ్లు మొదలగు సౌకర్యాలన్నీ సమకూరుస్తున్నారు. హైదరాబాదు, దానికి చుట్టుపట్ల వున్న పటన్‌చెరువు, జీడిమెట్ల, కొత్తూరు మొదలగు పారిశ్రామిక వాడలకు వెళ్ళిచూడండి. యీ కార్పొరేషన్‌వారు చేసిన సౌకర్యాలు తెలుస్తాయి. హైదరాబాదు పట్టణంలోగల 'బాలానగర్' పారిశ్రామిక వాడలో స్వయం ఉపాధి పథకం క్రింద సాంకేతిక నిపుణులు పెట్టుకున్న సంస్థలే 110 దాకా వున్నాయి. ఈ కార్పొరేషనేకాక "పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్" "లఘుపారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్" "ఆంధ్రప్రదేశ్ ఆర్థికకార్పొరేషన్" "తోళ్ళపరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్" "ఖనిజ సంపద కార్పొరేషన్" మొదలగునవెన్నో కార్పొరేషన్‌లు స్థాపించి రాష్ట్రప్రభుత్వం ఆయా పారిశ్రామిక వేత్తలకు కావలసిన సాంకేతిక వివరాలను అందజేసి పారిశ్రామికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతూంది.

రాష్ట్రంలో ఇటీవలి పారిశ్రామికాభివృద్ధికి ముఖ్య కారణాలు

మనిషికి ఇంతకన్నా ఎక్కువ ఎకరాల భూమి వుండగూడదన్న చట్టం రాబోతుందని చాలామంది మోతుబరి రైతులు తమకున్న ఆస్తులను ముందుగా అమ్మో, అన్యాక్రాంతంచేసో డబ్బు చేసికొన్నారు. ఆ డబ్బు బ్యాంకులలో వేసినా ఎక్కువ రాబడి రావటంలేదని పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టారు. క్రిందటి ఫైనాన్సు కమీషన్ సిఫార్సుల ప్రకారం మన రాష్ట్రానికి పెట్టుబడి వసతులు ఎక్కువయినాయి. గత అయిదు సంవత్సరాలుగా రాజకీయ అలజడులు లేకుండా రాష్ట్రంలో శాంతి సుస్థిరతలు ఏర్పడ్డాయి. పై నుండి, క్రింది స్థాయి వరకు పరిశ్రమలను గురించి చురుకుగా నిర్ణయాలు తీసికొంటున్నారు. ఒక డిపార్టుమెంటుకు మరొక డిపార్టుమెంటుకు, ఒక కార్పొరేషన్‌కు మరొక కార్పొరేషన్‌కు మధ్య పొరపులు పోయి అన్యోన్యంగా పనిచేస్తున్నాయి. ఈ కారణాల వల్ల ఇటీవల రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరిగింది.

ఈ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1970లో 22,280 లఘు పరిశ్రమలుండగా, 1976 నాటికి 40,000కు పెరిగాయి. వీటిలో పెట్టుబడి రూ. 147 కోట్లు. 2లక్షలమంది వీటిలో పనిచేస్తున్నారు. ఇవిగాక మన రాష్ట్రంలో 1976 నాటికి 5 లక్షల లఘుపరిశ్రమ సంస్థలున్నాయి.వీటిలో పెట్టుబడి రూ. 1500 కోట్లు, సాలీనా యీ సంస్థలు రూ. 1100 కోట్లు విలువగల సామగ్రిని తయారు చేస్తున్నాయి. ఒక్కొక్క లఘుపరిశ్రమసంస్థలోను, యావద్భారత దేశంలో సగటు పెట్టుబడి రూ. 70,000 అయితే మన రాష్ట్రంలో రూ. 30,000. మనకున్న లఘు పరిశ్రమలో, లోహము,తత్సంబంధమైనవి 24.9, కొయ్యకు సంబంధించినవి 10.4 ఆహార పదార్థాలకు సంబంధించినవి 8.81, ఎలక్ట్రిసిటీ అక్కరలేని యంత్రాలు తయారుచేసేవి 8.5, రసాయనిక పదార్థాలు, ఎరువులు తయారు చేసేవి 7.8, తదితర చిన్న పరిశ్రమలు 39.6 శాతం ఉన్నాయి. లక్ష రూపాయల పెట్టుబడివున్న లఘుపరిశ్రమ సంస్థలో సగటున 21 మందికి ఉపాధి లభిస్తే అదే పెట్టుబడి గల భారీ పరిశ్రమలో సగటున 5 మందికి ఉపాధి లభిస్తుంది. కాబట్టి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో లఘు పరిశ్రమలకున్న ప్రాముఖ్యత స్పష్టమవుతుంది. ఇటీవల "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ఆంగ్ల దినపత్రిక (హైదరాబాదు ఎడిషన్) లో లఘుపరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టరయిన డాక్టర్ పి. సీతాపతి, ఐ. ఏ. ఎస్. అన్నట్లు మన రాష్ట్రంలో లఘు పరిశ్రమలలో పనిచేస్తున్న సాంకేతిక నిపుణులకు సంఘాలు (గిల్డు) స్థాపించి, వారి నిపుణతను పెంపొందింపజేయడానికి తగిన శిక్షణయిచ్చి కొత్త పనివారికి కూడా ఆయా నైపుణ్యం నేర్పి వారే స్వయముగా చిన్న పరిశ్రమ సంస్థలను స్థాపించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లు చేయగలిగింది కార్పొరేషన్, అది అద్భుత విజయమని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన "రీడర్స్‌డైజెస్టు"

(తరువాయి 9వ పేజీలో)

రాజ్యసభ-పూర్వాపరాలు

శ్రీ పండ్రంగి రాజేశ్వరరావు

ఇటీవలనే మన రాజ్యసభ రజతోత్సవం జరుపుకుంది. ఈ సందర్భంగా దీని పుట్టు పూర్వోత్తరాలను పరిశీలించటం వాంఛనీయం. తొలుత మన దేశానికంతకు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ అనే శాసనసభ వుండేది. దీనికి గవర్నరు జనరల్ అధ్యక్షుడుగా వుండేవారు. అహంభావ అహంకారాలకు ప్రతిరూపమైన కర్జన్ ప్రభువు అధ్యక్షస్థానంలో వుండగా ఏ సభ్యుడినైనా హద్దులో వుంచేందుకు గంటకొట్టడానికి బదులు ఎడంకాలు బూటుతో నేలనిరాచేవాడు. ఒక్క గోపాలకృష్ణ గోఖలేను మాత్రం గౌరవించేవాడు. మాంటేగుచెమ్సుఫర్డు సంస్కరణల క్రింద 1920 తొలుత కేంద్రమందు కౌన్సిల్ ఆఫ్ స్టేటు పేరుతో ఎగువ సభ వెలిసింది. ఇందులో చాలామంది నియమింపబడి కొద్దిమంది ఎన్నిక అయ్యేవారు. వీరిని ఎన్నుకునే వోటర్లు రాబడి పన్ను, భూమిశిస్తు హెచ్చుమొత్తంగా చెల్లించే శ్రీమంతులు. ఆనాడు సహాయనిరాకరణకు అంకితమైన కాంగ్రెస్‌వాదులు కూడా ఇందు పాల్గొనేవారు. అపుడు అందు కాంగ్రెసు వర్గమునకు శ్రీవేమవరపు రామదాసుపంతులు నాయకులు. దీనికి అధికారేతరులైన శ్రీ మేనక్‌జీ దాదాభాయి అధ్యక్షులుగా వుండేవారు. రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రికి యీ పదవి నివ్వబోగా తాము భారతీయ సేవాసంస్థ సభ్యులుగా ప్రభుత్వోద్యోగాన్ని స్వీకరించజాలమని తిరస్కరించారు.

ఎగువ సభ వాంచనీయమేనా ?

దేశానికి ఎగువ సభ వాంఛనీయమా కాదా అను విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రజానీకము నిరక్షరాస్యులుగా వున్నపుడు వయోజనవోటింగుక్రింద ప్రజాస్వామికమందు ఎగువసభ అనివార్యం. సాధారణంగా నిపుణులకు దిగువసభలో స్థానముండదు. ఎగువసభ అంతస్థును, సుస్థిరతను బాగుగా కాపాడును. తొందరపాటును అరికట్టును. స్కాండినేవియన్ దేశాలగు నార్వే, స్వీడను, డెన్మార్కు, టర్కీ, స్విట్జర్లండు, దక్షిణాఫ్రికాలందు తప్ప తదితర దేశములందంతటా ఎగువసభలు కలవు. జర్మనీ, ఐర్లండు మాత్రము ఎగువసభను రద్దుచేసినవి. దిగువసభలో పార్టీ భవిష్యత్తు మాత్రమే ప్రధాన ధ్యేయముగా గల రాజకీయవేత్తలుంటే ఎగువసభలో కాకలుతీరి దేశ భవిష్యత్తును ఆకాంక్షించే పెద్దలుంటారు. ఎన్నికల కోలాహలాన్ని తట్టుకునేందుకు తగు రూకబలం, మూకబలం లేనివారు ఎగువసభలో స్థానం సంపాదించవచ్చును. తత్రాపి పరిపాలన ఒడుదుడుకులు లేకుండా తాపీగా నడుస్తుంది.

ఎగువసభను వ్యతిరేకించేవారు యిందుకయ్యే ఖర్చు నిరుపయోగమని యిందువల్ల ప్రజానీకం పొందేది ఆర్థిక భారమే అంటారు. పరోక్షపు ఎన్నికసభ్యుల నియామకం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ప్రజాప్రాతినిధ్యం గల దిగువ సభ నిర్ణయాలని వమ్ముచేయటానికి లేక జాగుచేయటానికి మాత్రమే యీ సభ తయారుగా వుంటుంది. ఇది అనవసరమేకాక ప్రమాదభరితము. దీని వునికి ప్రజాభిప్రాయానికి అవమానకరము. దీని వుపయోగము ఎండమావిలో నీరు వంటిది.

స్వతంత్ర భారతంలో ఎగువసభకు వారసురాలు రాజ్యసభ. మొత్తం సభ్యులసంఖ్య 250. ఇందులో వివిధ వృత్తులందు, కళలందు, విద్యావిజ్ఞానములందు నిష్ణాతులైనవారిని మంత్రి మండలి సలహాపై రాష్ట్రపతి నియమిస్తారు. ఇది శాశ్వతమగు శాసనసభ. ప్రతి రెండు సంవత్సరాలకు మూడోవంతు సభ్యులు వైదొలుగుతూ వుంటారు. సభ్యత్వపరిమితి ఆరు సంవత్సరాలు. సభ్యులలో పదోవంతు హాజరుగావుంటే కార్యక్రమాన్ని నిర్వహింపవచ్చును. దీనికి ఉపరాష్ట్రపతి అధ్యక్షులుగా వుంటారు. ఉపాధ్యక్షుని సభ్యులు ఎన్నుకుంటారు.

పాశ్చాత్య దేశాల్లో ...

దీని హక్కులు, బాధ్యతలు బ్రిటన్‌లోని ప్రభులసభకు దీటుగా వుంటాయి. ప్రభులసభలో క్రైస్తవ పీఠాధిపతులైన ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ, యార్కు ఆర్చి బిషప్పు, న్యాయశాస్త్రకోవిదులైన ప్రభులలాంటివారుతప్ప మిగతావారి సభ్యత్వము వంశపారంపర్యంగా వుంటుంది. ఇంగ్లండులో ప్రభుల సభ సభ్యులు వేయి మందిదాకా వుంటారు. దీని అధ్యక్షులు లార్డు ఛాన్సలరు. ఆయన అత్యున్నత న్యాయాధికారేగాక మంత్రిమండలిలో సభ్యులు. ప్రభులసభ అత్యున్నత న్యాయస్థానంగా కూడా పనిచేస్తుంది. ఆర్థిక విషయాలలో తప్ప మిగతా విషయాలలో దిగువసభతో సమాన హోదాను చలాయిస్తుంది. దీనిని రద్దుచేయాలని ప్రతిపాదనలు వస్తూవున్నా త్రోసివేయబడుతూ వచ్చాయి.

ఫ్రాన్సులో ఎగువసభకు పరోక్షపు ఎన్నికలుంటాయి. రష్యాలో సహితం జాతులసభ అనే ఎగువసభ వుంది. కెనడా ఎగువసభలో 104 వరకు సభ్యులుండవచ్చును. వారంతా గవర్నరు జనరలుచే నియమింపబడి జీవితాంతము సభ్యులుగా వుంటారు. వీటికి చాలా పరిమితమగు అధికారాలు మాత్రమే వుంటాయి. కాని అమెరికా సంయుక్త రాష్ట్రములందు, ఆస్ట్రేలియాలోను ఎగువసభకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి. దిగువసభతో సమానమైన ప్రతిపత్తి కల్గియుండుటలో ఆశ్చర్యములేదు. అమెరికా సంయుక్త రాష్ట్రములలో రాష్ట్రముయొక్క విస్తీర్ణము, జనాభాతో నిమిత్తము లేకుండా ప్రతి రాష్ట్రంనుంచీ యిరువురు ఎన్నుకోబడతారు.

మన రాజ్యసభ చక్కని వాతావరణంలో అవతరించింది. దీని తొలి అధ్యక్షులు ఆనాడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికై తదుపరి రాష్ట్రపతి అయ్యారు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ. ఈయన తత్వవేత్తగా, విద్యావేత్తగా మానవ స్వభావాన్ని పూర్తిగా ఎరిగిన వ్యక్తి. కార్యక్రమాలను హుందాగా ఎట్టి పొరపొచ్చాలు లేకుండా నిర్వహించి అందరి మన్ననలు పొందారు. అందు కేటో, బ్రూటస్, ఛాటామ్, బోర్రిహమ్ సభ్యులా అనిపించేది. రాష్ట్రపతి, సర్వశ్రీ అల్లాడి కృష్ణస్వామి, మోతిలాల్, చిమన్‌లాల్, సెతల్‌వాడులాంటి రాజ్యతంత్ర ప్రవీణులను, మహామహోపాధ్యాయ కానేలాంటి పండితప్రకాండులను, శ్రీమతి రుక్మిణీ అరండేలులాంటి కళాకోవిదులను, సత్యేన్‌బోసు లాంటి విజ్ఞానవేత్తలను, మైథిలీచరణ్‌గుప్తాలాంటి కవిపుంగవులను సభ్యులుగా నియమించుటద్వారా ఆ సభకు నూతన శోభ వచ్చింది.

రాజ్యసభకూడ లోక్‌సభలా ఐదేళ్లు పనిచేసి తిరిగి క్రొత్తగా నిర్మాణం కావాలని, లేనిచో బెంగళూరులో కాంగ్రెసు చీలిక దరిమిలా సంస్థానాధీశుల భరణాల రద్దు బిల్లు వీగిన పరిస్థితి తిరిగి అనుభవంలోనికి రావచ్చునంటారు కొందరు విజ్ఞులు. రాజ్యసభ, లోక్‌సభతో పోటీ పడక సహకరించేటట్లు మసలాలి. సర్వశ్రీ జాకీర్‌హుస్సేను, పాఠక్, గిరి, జట్టి, రాధాకృష్ణ వరవడిని సాధ్యమైనంత వరకు అనుసరించారు. గతం గర్వకారణంకాగా భవిష్యత్ ఆశాజనకంగా వుంది.

*

ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమాభివృద్ధి

(7 వ పేజీ నుండి)

అనే ఆంగ్ల మాస పత్రికలో ఒక చక్కటి వ్యాసం ప్రచురించారంటే దాని విశిష్టత విదితమవుతుంది. యావద్భారత దేశంలోను ఇట్టి సంఘాలు (గిల్డు) స్థాపించి సాంకేతిక నిపుణులను ప్రోత్సహించి వారిచే స్వయం ఉపాధి పథకాలను పెట్టించడం అన్న ప్రప్రథమ ఖ్యాతి మన రాష్ట్రానికి దక్కింది. మరొక విశేషమేమంటే జటిల సాంకేతిక పరిజ్ఞానంతోకూడిన టెలివిజన్ సెట్లు, రసాయనాలు, రంగులు, ఆహార సంబంధమైన పరిశ్రమలు, మొదలగు పారిశ్రామిక సంస్థలకు యీ కార్పొరేషన్ వారు నూటికి 50 వంతులనుండి, 75 వంతుల వరకు వాటాధనాన్ని సమకూర్చడమేగాక, వారికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం అందజేయడం. ఇందులో కూడా మన రాష్ట్రం యావద్భారత దేశంలో ముందంజ వేసింది. క్రొత్తగా లఘు పరిశ్రమలు పెట్టుకునే వారికి మొదటి మూడేళ్ళలోను 25% విద్యుచ్ఛక్తికయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. గిరిజనులుండే ప్రదేశాలలో పరిశ్రమలు పెడితే పెట్టుబడిలో 20%, ఆర్థికంగా వెనుకబడిన ప్రదేశాలలో పెడితే 15% పెట్టుబడి ప్రభుత్వం పెట్టుతుంది. ఈ లఘు పరిశ్రమలలో తయారయిన సామగ్రిని ప్రభుత్వశాఖలన్నీ ఎక్కువ ధరయినా కొనాలని ఉత్తర్వులు జారీ అయినాయి. ఈ విధంగా ప్రభుత్వం లఘు పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. "లఘు పరిశ్రమల కార్పొరేషన్" వారు స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించడం వారి ముఖ్య విధిగా పెట్టుకున్నారు. ఇంతవరకు రూ. 3.1 కోట్ల పెట్టుబడితో పెట్టిన ఇట్టి 1000 సంస్థలకు ఈ కార్పొరేషన్ వారు సహాయం చేశారు. 1977–78లో ఇంకా కోటి రూపాయలవరకు ఇట్లాంటి పథకాలకు ఆర్థిక సహాయం అందజేయడానికి సిద్ధంగా వుంది. "ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక కార్పొరేషన్" వారు రూ. 70 కోట్లు లఘు పరిశ్రమలకు అప్పుగా యిచ్చారింతవరకు. లఘు పరిశ్రమలు స్థాపించిన తరువాత కొంతకాలానికి అవి మూసివేయడమో లేక మందకొడిగా నడవడమో జరుగుతోంది. ఇందుకు కారణాలను అన్వేషిస్తే వాటికి తగినంత పెట్టుబడి స్తోమత లేక రోజువారీ ఖర్చులకు కావలసిన ఆర్థికవసతులు చాలక యిట్లా జరుగుతోందని తేలింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం సానుభూతితో యీ సంస్థలకు తక్కువ వడ్డీకి బ్యాంకులలో పరపతి సౌకర్యాలు కల్పించాలి. ఒక సంస్థకున్న పూర్తి ఉత్పత్తి స్తోమతను ఉపయోగించుకోలేక నూటికి 30 మొదలు 40 వరకు ఉత్పత్తిస్తోమత వృథాఅయిపోతోంది. భారత ప్రభుత్వపు భారీ పరిశ్రమలు, రాష్ట్ర లఘు పరిశ్రమలలో తయారయ్యే పరికరాలను, ఇతర సామగ్రిని, వాటికి ఉపయోగపడే వరకు కొనేటట్లు భారత ప్రభుత్వం సానుభూతిలో పరిశీలించి ఉత్తర్వులు జారీచేయాలి.

మనం పారిశ్రామికంగా పురోగమిస్తున్నాం

"భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు" నుండి మన రాష్ట్రం ఇంతవరకు రూ. 87 కోట్లు, అప్పుగా తీసికొంది. అన్ని రాష్ట్రాల కన్న అగ్రశ్రేణిలోవుంది, ఇదికాక ఇంతవరకు భారత ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి యిచ్చిన రూ. 4.5 కోట్ల సబ్సిడీ పూర్తిగా వినియోగించుకున్నాం. "ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక కార్పొరేషన్" గత 21 సంవత్సరాలలోను, 3923 లఘు పరిశ్రమ సంస్థలకు రూ. 6368 లక్షలు అప్పుగా యిచ్చింది. అంటే ఒక్కొక్క సంస్థకు సగటున రూ. 1.6 లక్షలు ప్రతిరోజు సగటున నాలుగు సంస్థల కన్నా అప్పులివ్వాలని 1977లో యీ కార్పొరేషన్ వారు నిర్ణయించారు. అంతేకాక ఆర్థికంగా వెనుకబడిన పల్లెటూళ్ళలో పరిశ్రమలు నెలకొల్పేవారికి, ఒక్కొక్క సంస్థకు రూ. 10,000వంటి చిన్న మొత్తాలు కూడా అప్పులివ్వాలని యీ కార్పొరేషన్‌వారు తమ కర్తవ్యంగా పెట్టుకున్నారు. అట్టి చిన్న సంస్థలు 690కి ఇంతవరకు అప్పులిచ్చారు. ఈ విధంగా ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అవిరళ కృషిచేస్తోంది. ఈ సౌకర్యాలను ఉపయోగించుకుని పారిశ్రామిక వేత్తలు ముందుకువచ్చి, ఇంకాఎక్కువగా పరిశ్రమలు నెలకొల్పాలి.

స్వయం పోషక పథకాలను ఎక్కువగా ఉపయోగించుకోవాలి. అప్పుడే మనం నిరుద్యోగ సమస్యను పరిష్కరించగలుగుతాం.


స్వయం కృషి సఫలమైంది

మానవుడు స్వాతంత్ర్య ప్రియుడు. ప్రగతి పథ పురోగామి. మానవ జీవితానికీ పనికీ విడివడని బంధం ఉంది. పనికి మరొక పేరే సామాన్య మానవుని జీవితం. అందరూ ఏదో ఒక పనిలో నిమగ్నులై కృషి చేస్తున్నప్పుడు ఎంతటి వాడైనా సోమరిగా ఉండలేడు. కష్టపడి పనిచేస్తాడు, చేయాలి కూడా. అనాడే అతనికి సమాజంలో గౌరవం, మర్యాద లభిస్తుంది. పని మనిషికి నిజమైన విద్య. పనిచేయటంవల్ల రకరకాల మనుషులతో సంబంధాలు ఏర్పడుతాయి. మహోన్నత కీర్తి శిఖరాలనందుకొన్న ఏ మహా పురుషుల జీవితాలు చూసినా వారు జీవితాల్లో ఎంతో కష్టపడి పనిచేసిన వారై ఉంటారు. ప్రతి మనిషీ జీవితాన్ని ఆనంద మయం చేసుకొనటానికి విధిగా పనిచేయాలి. పని ద్వారానే సంపద పెరుగుతుంది. దానితో ఆ సంఘం సంపన్నమవుతుంది.


విద్య నభ్యసించిన తర్వాత కొంతమంది ప్రభుత్వం లోనో ప్రయివేటు సంస్థల్లోనో ఉద్యోగాలు చేస్తుంటారు. కాని ఈ రోజులలో ఎంత ఉన్నత విద్య చదువుకున్నా, ఉద్యోగాలు లేక నిరుద్యో

శ్రీ సిద్దాని నాగభూషణం

గులుగా ఉండిపోవలసి వస్తుంది. సాధారణంగా విద్యనభ్యసించినవారు కాని, లేదా సాంకేతిక విద్య చదువుకున్న సాంకేతిక నిపుణులుకానీ ఎంత విజ్ఞానవంతులయినప్పటికీ, విజ్ఞానానికి తగ్గ ఉద్యోగాలు దొరక్క అసంతృప్తిగానే జీవితాన్ని వెళ్ళబుచ్చేవారు లేకపోలేదు. ఉద్యోగాలు చేస్తూన్నా తమ ఆలోచనలకు తగిన ప్రోత్సాహం లేక నిరుత్సాహపడేవారు ఉన్నారు. స్వతంత్రంగా పనిచేయాలనే ఆకాంక్ష, పది మంది పని కల్పించాలనే ఆశ మనిషిని వెన్నాడుతున్నప్పుడు ఏదో వ్యాపకాన్ని చేపట్టవలసి ఉంటుంది. ఏ వ్యాపకానీ చేపట్టాలన్నా దానికి ఎంతో డబ్బు కావాలి. దానితోపాటు కొన్ని సౌకర్యాలు ఉండాలి. మేధావి వర్గానికి చెందిన సాంకేతిక నిపుణులు స్వతంత్రంగా జీవించటానికి వీలు కల్పించే ఒక పథకాన్ని కేంద్రప్రభుత్వం 1970-71 సంవత్సరంలో రూపొందించింది. ఈ



"ఇన్ వల్యూట్స్ ఇండియా" తయారుచేసిన గేర్లు, గేర్ బాక్సులు



మైక్రో ప్రెసిషన్ ఇంజనీర్స్ పారిశ్రామిక విభాగంలో తయారయిన యంత్రాలు


పథకంక్రింద ఇంజనీర్లకు ఇతర సాంకేతిక నిపుణులకు ఉపయోగపడే ఏ పరిశ్రమనైనా సాంకేతిక నిపుణులు ప్రారంభించటానికి అవకాశాలు కల్పించింది. ఈ సాంకేతిక నిపుణుల పథకంక్రింద ఆర్థిక సహాయ సంస్థలు నూటికి నూరుపాళ్లు ఆర్థిక సహాయాన్ని అందజేయాలని సహాయ సంస్థలను ప్రభుత్వం కోరింది. ఈ సంస్థలు పెట్టుబడులకు, వ్యాపార పెట్టుబడులకు అప్పులను అందజేస్తాయి. ఆర్థిక సహాయకసంస్థలు ఈ అప్పులను అందజేసేటప్పుడు హామీ తీసుకొనవలసిన పనిలేదు-వ్యక్తిగత హామీ ఉంటే చాలు.

అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

ఈ సాంకేతిక నిపుణుల పథకాన్ని దేశం మొత్తం మీద ప్రప్రథమంగా అమలుపరచిన ఖ్యాతి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థద్వారా సాంకేతిక నిపుణుల పారిశ్రామిక వాడ స్థాపనకు దోహదం చేసింది. ఈ పారిశ్రామిక వాడలో పరిశ్రమలు నడుపుకొనటానికి కావలసిన కనీస వసతులు ఏర్పరచింది. భవనాలు, నీటి సదుపాయాలు, విద్యుచ్ఛక్తి సదుపాయాలు కల్పించింది. మొదట్లో 50 చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి కావలసిన 50 విభాగాలను ఏర్పాటుచేసింది. తర్వాత 1974 సంవత్సరంలో మరొక 50 షెడ్లను నెలకొల్పింది. ఈ షెడులు రెండు రకాలవి. వీటిని సాంకేతిక నిపుణులకు వాయిదా పద్ధతిపై డబ్బు చెల్లించే షరతుపై అడ్వాన్సులు తీసుకొనకుండా వారికి దత్తంచేసింది.

హైదరాబాదు బాలానగర్‌లో ఏర్పాటుచేసిన ఈ సాంకేతిక నిపుణుల పారిశ్రామిక వాడలో ఈనాడు 1000 మందికి ఉపాధి లభిస్తున్నది. 250 మంది సాంకేతిక నిపుణులు స్వతంత్రంగా జీవన యాత్ర సాగిస్తున్నారు. మూడుకోట్ల రూపాయలు పెట్టుబడితో

పరిశ్రమలు నడుపబడుతున్నాయి. ఈ వాడలో రసాయనికాలు, భారీ ఇంజనీరింగ్ పరికరాలు, ప్లాస్టిక్ సామానులు విద్యుత్ పరికరాలు, అణుశక్తి రక్షణసామగ్రి ఉత్పత్తికి పరిశ్రమల్లో ఉపయోగించే యంత్రాల విడిభాగాలు. తేలికపాటి ఇంజనీరింగ్ పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. కొన్ని పరిశ్రమలు అప్పుడే తమ ఉత్పత్తులను ఎగుమతిచేసి విదేశీమారక ద్రవ్యాన్ని ఆదా చేయడానికి ప్రభుత్వంతో సహకరిస్తుంటే, కొన్ని విదేశీ మారక ద్రవ్యాన్ని సము



"పాట్రన్ ఇండియా" రూపొందించిన నమూనా

పార్జిస్తున్నాయి. ఈ పారిశ్రామిక వాడలోని కొంతమంది సాంకేతికులను నేను కలిసి అడిగినప్పుడు వారు ఏవిధంగా తమ జీవితాలని ప్రారంభించినదీ. ఈనాడు వారెలా జీవనయాత్ర సాగిస్తున్నదీ, ప్రభుత్వం ఏవిధంగా సహకరించినదీ వివరించారు—వారు చేపట్టిన ఈ సాహసోపేతమైన స్వతంత్ర జీవితం ఇతర సాంకేతిక నిపుణులకు, నిరుద్యోగులకు ఎంతో ఆదర్శప్రాయమయింది.

గేర్లు, గేరుబాక్సుల ఉత్పత్తి


మెసర్స్ "ఇన్‌వల్యూట్స్ ఇండియా" అనే పారిశ్రామిక విభాగపు అధిపతులైన శ్రీ ముక్కామల సుబ్బారావుగారు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులైన శ్రీ వి. రమణగారు మధ్య తరగతికి చెందినవారు. శ్రీ ముక్కామల సుబ్బారావుగారు ఇంటర్మీడియట్ వరకు చదివి రైల్వేలలో అప్రంటిస్‌గా చేరి జీవితాన్ని ప్రారంభించుకున్నారు. ప్రయివేటుగా చదివి ఇంజనీరింగ్‌లో పట్టభద్రులైయారు. 1964 సంవత్సరంలో హిందుస్తాన్ మెషిన్ టూల్స్ నిర్వహణ ఇంజనీరుగా పని చేస్తుండేవారు. అయితే సాంకేతిక నిపుణులైన ఆయనలో స్వతంత్రంగా బ్రతకాలనే ఆకాంక్ష ఉండేది. పరిస్థితుల ప్రభావంవల్ల ఉద్యోగం చేయవలసి వచ్చింది. 1970–71 సంవత్సరంలో ప్రభుత్వ సాంకేతిక నిపుణుల సహాయ పథకం విషయం వారికి తెలిసింది. ఏదో పరిశ్రమను ప్రారంభించి నిర్వహించాలని అనుకొని ఈ విషయాన్ని సాంకేతిక నిపుణులు, మిత్రులైన శ్రీ ఐ.ఆర్. రాజు, శ్రీ ఎస్. తాలూక్‌దార్‌తో సంప్రదించారు. ఒక నిర్ణయానికి వచ్చి తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

ఎస్టిమేట్ సిస్టమ్ స్టాండర్డ్స్ రూపొందించడంలో, యంత్ర పరికరాల విడిభాగాలు పద్ధతిపై ప్రణాళిక (Lay out) తయారు చేయటంలో సిద్ధహస్తుడై, అమెరికాలో ప్రత్యేక శిక్షణ పొందిన శ్రీరమణతో కలిసి పరిశ్రమను నెలకొల్పాలని నిర్ణయించుకున్నారు. సాంకేతిక నిపుణుల పారిశ్రామిక వాడలో ఒక షెడ్‌ను చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిసంస నుంచి వాయిదాలలో డబ్బుచెల్లించే పద్ధతిపై తీసుకొని పరిశ్రమలకు సంబంధించిన యంత్ర విభాగాల గేర్లను, గేర్ బాక్సులను, ఇతర యంత్ర విభాగాలను తయారుచేసే చిన్నతరహా పరిశ్రమను 1971 సంవత్సరంలో ప్రారంభించుకొన్నారు. ఈ విడిభాగాలు ఎక్కువగా ఎరువులు, కాగితం, వస్త్రాలు విద్యుత్తు పరికరాలు, గనుల పరిశ్రమలకు సంబంధించిన యంత్రాలకు ఉపయోగపడతాయి.

1972 సంవత్సరంలో ఈ విభాగం ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ పరిశ్రమ ఏటా 2.5 లక్షల రూపాయల విలువగల గేర్లను, గేర్‌బాక్సులను తయారుచేస్తున్నది. ఉత్పత్తిని ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 17 లక్షల 40 వేల రూపాయల విలువగల యంత్రపరికరాలను ఉత్పత్తిచేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఒక కంపెనీ ద్వారా విదేశాలకు కూడా ఈ విడిభాగాలు అమర్చిన యంత్రాలు ఎగుమతి అయ్యాయి. ఈ పారిశ్రామిక విభాగం 18 మందికి ఉపాధి కల్పిస్తున్నది.

యంత్రాల విడిభాగాలు


భారీ పరిశ్రమలు వివిధ యంత్రాలు తయారుచేస్తుంటాయి. యంత్రాల వాడకం బాగా పెరుగుతున్న కారణంగా వాటి ఉత్పత్తి కూడా ఎక్కువ కావాలి. యంత్రాలకు కావలసిన కొన్ని విడిభాగాలను ఉత్పత్తిచేయడానికి ఎక్కువకాలం పట్టి [illegible] ఉత్పత్తి



సిలికాన్ కాస్టిగ్స్

స్థాయిని భారీపరిశ్రమలు పెంపొందించుకోలేక పోతున్నాయి. ఈ విడిభాగాలు తయారుచేసే శక్తిని పెంపొందించాలి. లేదా వాటిని వేరే యంత్రాల సహాయంతోనైనా తయారుచేయాలి. అప్పుడు భారీ పరిశ్రమలకు ఉత్పత్తిశక్తి పెరుగుతుంది. విడిభాగాలను తయారుచేసి ప్రత్యేకమైన ప్రయోజనాన్ని ఉద్దేశించిన యంత్రాలను రూపొందించే ఒక పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని ఆలోచన హెచ్. ఎమ్. టి. పరిశ్రమలో పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడైన శ్రీ ఐ. ఆర్. రాజుగారికి కలిగింది. బెంగాల్ వాస్తవ్యులైన శ్రీ ఎస్. ఎస్. తాలూక్‌దార్ అదే పరిశ్రమలో పనిచేస్తుండేవారు. శ్రీ రాజుగారు శ్రీ తాలూక్‌దార్‌తో ఆలోచించారు ఈ పథకంగురించి. అయితేవాళ్లు మధ్య తరగతికి చెందినవారు కావటంవల్ల ఈ ఆలోచనను కార్యరూపంలో పెట్టగలమా అని అనుమానం ఉండేది. ఇది సహజంకూడా. వారిద్దరి సాంకేతిక పరిజ్ఞానం కేవలం ఉద్యోగ నిర్వహణకు పరిమితమయిపోతుందేమో అని బాధ ఉండేది వారికి.

ప్రభుత్వం తలపెటిన సాంకేతిక నిపుణుల పథకం వారి ఆశకు ఊపిరిపోసింది. వారు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఒక చిన్న పరిశ్రమను ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిసంస్థ నెలకొల్పిన సాంకేతిక నిపుణుల పారిశ్రామిక వాడలో ఒక విభాగాన్ని వాయిదాలలో సొమ్ము ను



భాగ్య నగర్ లాబొరేటరీస్‌లో థెర్మిస్టర్స్ తయారీలో నిమగ్నులైన మహిళలు

చెల్లించే పద్ధతిపై తీసుకున్నారు. అందులో మైక్రో ప్రెసిషన్ ఇంజినీర్స్ అనే సంస్థను నెలకొల్పారు. పరిశ్రమకు సంబంధించిన యంత్రాల కొనుగోలుకు పెట్టుబడిగా హైదరాబాద్ స్టేట్ బ్యాంకు 2.45 లక్షల రూపాయల అప్పు అందజేసింది.

వారు 1972 సంవత్సరంలో నెలకొల్పిన పరిశ్రమ 1973–74 సంవత్సరంలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ చిన్నతరహా పారిశ్రామిక యూనిట్ ప్రత్యేక ప్రయోజనానికి ఉద్దేశించిన యంత్రాలను, యంత్ర పరికరాలను తయారుచేస్తుంది. గత నాలుగేళ్లలో దాదాపు ఏడు లక్షల రూపాయలమేరకు యంత్రాలను తయారుచేసి తిరుపతిలో మోపెడ్ కంపెనీకి, పంజాబ్ ఎస్కార్ట్స్, ఫియట్ కంపెనీలకు చండీఘర్, నాగపూర్ ట్రాక్టర్ల కంపెనీలకు, కాకినాడలోని రామదాసు ట్రాన్స్‌పోర్టు వారికి అందజేసింది. ఈ పారిశ్రామిక విభాగం 15 మందికి ఉపాధి కల్పిస్తున్నది.

పెద్దపెద్ద పరిశ్రమలకు ఉపయోగపడే యంత్రాలను తయారుచేసే ఈ చిన్న పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల గురించి శ్రీ ఐ.ఆర్. రాజు వివరిస్తూ—ఒక యంత్రం తయారుచేయటానికి ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు పడుతుంది. వ్యాపారం పెట్టుబడి ఆ యంత్రం తయారీలో ఉండిపోవడంవల్ల వ్యాపారాన్ని విస్తృతపరచడానికి అతికంగా ఇబ్బందిగా ఉంటున్నది. ఆర్థిక వనరుల కోసం ఇంకా తక్కువ వ్యవధిలో తయారయే పారిశ్రామిక ఉత్పత్తులను చేపట్టాలని యోచిస్తున్నామని తెలియజేశారు. ఆర్థిక సహాయక సంస్థలు అందజేస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ చిన్నతరహా ఇంజనీరింగ్ సరుకుల ఉత్పత్తి బ్యాంకులు ఉదారంగా ఆర్థిక సహాయం చేయాలని అన్నారు.

యంత్రభాగాల నమూనాలు

ఈ సాంకేతిక నిపుణుల పారిశ్రామికవాడలోనే 'పాటరన్స్ ఇండియా' అనే నమూనాలను తయారుచేసే చిన్న పరిశ్రమ కూడా నడుపబడుతోంది. ఈ పాటరన్స్ ఇండియాలో ఫౌండరీలకు కావలసిన నమూనాలను తయారుచేస్తారు. ఈ నమూనాలు కలపతోనైనా, అల్యూమినియంతో నయినా తయారవుతవి.

ప్రతీఏడూ 1.50 లక్షల రూపాయల విలువగ[illegible]లను తయారుచేసి యిస్తున్న ఈ పాటరన్స్ ఇండియా సంస్థ ఎనిమిది మందికి పని కల్పిస్తున్నది. జంటనగరాలలో ఉన్న అన్ని ఫౌండరీలకు, భారత హెవీ ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ మొదలైన పారిశ్రామిక సంస్థలలో ఉన్న యంత్రవిభాగాలకు కావలసిన నమూనాలను తయారుచేస్తున్నది. ఈ సంస్థ అధిపతి అయిన శ్రీ అన్నే ఆర్. శేషగిరిరావుగారు బి.ఎస్.సి., బి.ఇ. చదివాక కొన్నాళ్లు కె. సి. పి లో ఐదేళ్లపాటు ఆస్‌బెస్టాస్ సంస్థలో పనిచేసి విశేషమైన అనుభవం సంపాదించారు. ఈ పరిశ్రమను స్థాపించటానికి 60 వేల రూపాయల టరమ్ అప్పును, 20 వేల రూపాయల వ్యాపారపు పెట్టుబడి అప్పును సంపాదించారు. చిన్న పరిశ్రమను ప్రారంభించి స్వతంత్రంగా జీవనయాత్ర సాగిస్తున్నారు.

సిలికాన్ కాస్టింగ్స్

దక్షిణ భారతదేశంలో ఉన్న రక్షణ రసాయనిక కర్మాగారాలకు, ఎరువుల కర్మాగారాలకు, దేశంలో ఉన్న రక్షణ సామగ్రి కర్మాగారాలకు చేరువగా వున్న హైదరాబాద్‌లో సాంకేతిక నిపుణుల పారిశ్రామికవాడలో ఒక యూనిట్‌ను అద్దెకొనుగోలు పద్ధతిపై తీసుకొన్నారు శ్రీ కె. సుబ్బరామయ్యగారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రప్రథమంగా సిలికాన్ ఫెర్రో అల్లాయ్ కాస్టింగ్స్‌ను(ఉక్కుపోతలు) ఉత్పత్తిచేసే చిన్నపరిశ్రమను ప్రారంభించుకుని చరిత్రను సృష్టించుకున్నారు. ఇదివరలో ఈ ఉక్కుపోతలను విదేశాలనుంచి దిగుమతి చేసుకొనవలసివచ్చేది. ఇప్పుడు మన ప్రభుత్వానికి దిగుమతి చేసుకొనే ఇబ్బంది తగ్గిపోతుంది. ప్రతీ ఏడూ రెండు లక్షల రూపాయలు విలువచేసే ఉక్కుపోతలను ఉత్పత్తిచేసే ఈ విభా

గపు అధిపతి శ్రీసుబ్బరామయ్యగారుఒకకంపెనిలో ఉన్నతోద్యోగి. ఆ ఉద్యోగానికి రాజీనామాచేసి ఈ పరిశ్రమను స్థాపించుకున్నారు. బ్యాంకు కూడా రెండు లక్షల రూపాయల సహాయము చేసినది. ఈ యూనిట్‌లో తయారు అయే కాస్టింగ్స్ సహాయంతో రసాయనాలు కరిగించవచ్చు. రసాయనికాలు కరిగించటానికి స్టెయిన్‌లెస్‌స్టీల్ పోతలు కూడా విఫలమయిన వాటికి ఈ సిలికాన్ ఫెర్రోఅల్లాయ్ కాస్టింగ్స్ ఉపయోగపడతాయి. భారత దేశంలోనే మూడవది ఈ యూనిట్.

విదేశీ మారకద్రవ్యాన్ని ఆదాచేస్తున్న భాగ్యనగర్ లాబొరేటరీలు

విమానాశ్రయాలు ఉన్న చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఆకాశంలోని వాతావరణం మార్పులను తెలుసుకొనటానికి బెలూనులను వదులుతుంటారు. విమానాశ్రయం అధికారులు, వాతావరణం తెలుసుకొనటానికి ఆ బెలూనులో ఒక యంత్రాన్ని అమర్చుతారు. ఆ యంత్రములో అమర్చిన 'థెర్మిస్టర్' అనే పరికరంవల్ల వాతావరణ మార్పులు తెలుస్తాయి. ఈ థెర్మిస్టరు చాలా సున్నితమైన పరికరం. దేశంలో ఉన్న 28 విమానాశ్రయాలు ఈ పరికరాన్ని అమర్చి బెలూన్లను వదులుతుంటాయి. ఈ థెర్మిస్టర్లను దాదాపు 50, 60 వేల డాలర్లు ఖర్చుచేసి అమెరికాలో ఉత్పత్తిచేసే ఏకైక సంస్థ నుంచి తెప్పించుకొనేవారు.

రసాయనిక శాస్త్రం విషయాన్ని తీసుకొని ఎమ్.ఎస్.సి లో యూనివర్సిటీకి ప్రథమురాలుగా ఉత్తీర్ణురాలై, పూనా యూనివర్సిటీలో డాక్టరేట్ పొందిన డాక్టర్ సోమరాజు సుశీలగారి దృష్టికి ఈ విషయం వచ్చింది. వీరు జాతీయ రసాయనిక పరిశోధనాలయంలో జూనియర్ రీసెర్చి ఫెలోగా పని చేశారు కూడా. ఏ ఉద్యోగం చేసినా శ్రీమతి సుశీలగారికి సంతృప్తి లేదు. స్వతంత్ర జీవనం వెళ్లబుచ్చాలని నిర్ణయించుకొన్నారు. 1974 సంవత్సరంలో ఉద్యోగానికి రాజీనామా చేసి భాగ్యనగర్ లాబొరేటరీస్ పరిశ్రమను ప్రారంభించారు. ఈ పథకానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 1,50,000 రూపాయల అప్పును సమకూర్చింది. తన దృష్టికి వచ్చిన ఈ సమస్య పరిష్కారానికిగాను లాబొరేటరీని వినియోగించుకున్నారు డాక్టర్ సుశీలగారు.

ఈ లాబొరేటరీలో థెర్మిస్టర్లు తయారుచేశారు. 1975 సంవత్సరంలో ఉత్పత్తిని ప్రారంభించింది ఈ లాబొరేటరీ.


4 లక్షలు రూపాయలు విలువజేసే 25,000 థెర్మిస్టర్లను ఢిల్లీలో భారత వాతావరణ పరిశోధనశాలకు ప్రతీఏడూ అందజేస్తున్నది ఈ సంస్థ, అని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎస్. పి. రంగారావుగారు తెలియజేశారు.

ఈ సంస్థలో 300 నుంచి 600 వరకు వేతనాన్ని పొందేవారు 28 మంది పని చేస్తున్నారు.

ఈ సంస్థ జరిపిన సాహసంవల్ల విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించి తెప్పించు కొనవలసిన యిబ్బంది ఈనాడు ప్రభుత్వానికి తొలగిపోయింది. ఆవిధంగా విదేశీమారకద్రవ్యం ఆదా చేసే విషయంలో ఈ సంస్థ ఉడతాభక్తిగా సహకరించిందని వేరే చెప్పాలా? ఈ విషయంలో డాక్టర్ సోమరాజు సుశీలగారి ప్రశంసనీయమైనది.

విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న 'బాక్టోకెమ్' లాబొరేటరీలు

విదేశీ మారక ద్రవ్యం పొదుపు చేయటానికి 'భాగ్యనగర్ లాబొరేటరీలు దోహదంచేస్తుంటే, దీనికి కొంచెం దూరంలో ఉన్న బాక్టోకెమ్ 'లాబొరేటరీలు' విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నవని తెలిసి నాకు ఆశ్చర్యం వేసింది. ఈ లాబరేటరీ అధిపతి అయిన శ్రీ ఎమ్. శేషగిరిరావుగారు ఇంటర్‌మీడియట్ చదువు పూర్తిచేశాక ఒకమందులఫ్యాక్టరీలో ఉద్యోగం చేశారు. ఉద్యోగం చేస్తూ రాత్రి



బాలానగర్ పారిశ్రామికవాడలోని బాక్టోకెమ్ లాబొరేటరీలో ఒక ప్రధాన యంత్రం.

కళాశాలలో బి.ఎస్.సి చదివి పరీక్ష ప్యాసై కెమిస్టుగా నమోదయ్యారు. తాను సంపాదించిన విజ్ఞానాన్ని అనుభవాన్ని క్రోడీకరించి ఒక పరిశ్రమను ప్రారంభించటానికి నిర్ణయించుకొన్నారు. బాక్టోకెమ్ లాబరేటరీని ప్రారంభించారు. ఈ లాబరేటరీ స్థాపనకు 2.2. లక్షల రూపాయల మూలధనం పెట్టుబడిని 80 వేల రూపాయల వ్యాపారపు పెట్టుబడిని బ్యాంకు అందజేసింది.

ఈ లాబొరేటరీలో ఔషధాలు తయారు అవుతున్నాయి. జంతువుల మాంసాన్ని వినియోగించి మొక్కలు, చెట్ల వేళ్లు ఉపయోగించి మందులను తయారు చేస్తారు. ముఖ్యంగా విషముష్టి గింజలు, అతిమధురం, శొంఠి నుంచి మిశ్రమాలు తయారవుతున్నాయి. ఈ మిశ్రమాలను బి. కాంప్లెక్స్ తయారీలో టానిక్‌లు, టింక్చర్లు, దగ్గుబిళ్ళలు, విస్కీ, బ్రాందీ తయారీల్లో కూడ ఉపయోగిస్తారు. ఈ బాక్టోకెమ్ లాబొరేటరీలో తయారైన 'స్ట్రిక్‌నైన్' మందు అమెరికాకు ఎగుమతి అవుతున్నది. ఈ మందు పొలాల్లో ఎలుకలను నిర్మూలించటానికి అమెరికాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఎద్దు మాంసాన్ని ఉపయోగించి బి. కాంప్లెక్స్ ప్రోటీన్ తయారు చేయటానికి ఉపయోగించే

పేస్టును కూడా తయారు చేస్తున్నారు. పశువుల రోగ చికిత్సకు బాక్టీరియా వాక్సిన్స్ తయారుచేయటానికి ఉపయోగపడే మందులను కూడా తయారు చేస్తుందీ లాబరేటరీ.

ఈ సాంకేతిక నిపుణులు 18 మందికి పనికల్పించారు. వీరే కాక ఇద్దరు కెమిస్టులు, ఒక మేనేజరు, ఒక గుమస్తా కూడా పని చేస్తున్నారు ఈ లాబొరేటరీలో 1975 సంవత్సరం నుంచి 4.7లక్షల రూపాయల వ్యాపారం చేసింది. అందు 1.50 లక్షల రూపాయలకు సమానమైన 18,357 డాలర్ల విదేశీమారక ద్రవ్యం లభించింది. ఇంకా 25,000 డాలర్లు విలువగల ఆర్డర్లు వస్తున్నాయి. తన యూనిట్ కార్యకలాపాలను విస్తృత పరచాలనే ఉద్దేశంతోనే తన యూనిట్‌కు ఎదురుగా ఉన్న 1.2 ఎకరం స్థలాన్ని 15000 రూపాయలకు పరిశ్రమల శాఖ నుంచి కొన్నానని వివరించారు శ్రీ శేషగిరిరావు. ఈనాడు నాకు ఒక చిన్నకారు ఉంది–ఇంతగా సుఖ జీవనం చేస్తున్నానంటే అది ప్రభుత్వం నాకందచేసిన సహకారం. ఆర్థిక సహాయమే. లేకపోతే చాలీ చాలని జీతంతో మధ్యతరగతి వానిగా జీవితం సాగించవలసిందేకదా. దానికి ప్రభుత్వానికి నేనెంతో కృతజ్ఞుడను అని వినమ్రంగా అన్నాడు శ్రీ శేషగిరిరావుగారు.

విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తూ ప్రతిష్టను ఇనుమడింప జేస్తున్న బాక్టోకెమ్.లాబొరేటరీ అధిపతి శ్రీ శేషగిరిరావుచిన్నతరహా యువపారిశ్రామిక వేత్తలకు ఆదర్శప్రాయులు.

సాంకేతిక నిపుణుల సంఘం

ఈ పారిశ్రామిక వాడలో సాంకేతిక నిపుణులు నిర్వహించే పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి గాను ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. 1975 సంవత్సరంలో ఈ సంఘం శ్రీముక్కామల సుబ్బారావుగారి అధ్యక్షతన ఈ పారిశ్రామిక వాడలో ఉన్న యూనిట్ల తాలూకు వాయిదాల సొమ్ము పరిమితిని తగ్గించేటట్లు ప్రభుత్వాన్ని ఒప్పించ గలిగింది.

ఈ పారిశ్రామిక వాడలో ఉన్నకొన్ని సంస్థలు సక్రమంగా పనిచేయటం లేదు. అయితే చిన్నతరహా పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యలలో ప్రధానమైనవి మార్కెటింగ్ సమస్యలు ఆర్థిక పరమైనవి అని ప్రస్తుత అధ్యక్షులు శ్రీ మొహిలీ అన్నారు. సాంకేతిక నిపుణుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇటీవలనే ఒక కమిటీ వేసింది. సాంకేతిక నిపుణులు నిర్వహించుకొనే ఈ పారిశ్రామిక వాడ నిజంగా దేశం మొత్తం మీద ఆదర్శ ప్రాయమై, నిరుద్యోగ సమస్యా పరిష్కారానికీ ప్రగతికీ పారిశ్రామికీకరణ ఎంత అవసరమో తెలియ జెప్పుతుంది– ఇది దేశంలో సాంకేతిక నిపుణులకు మార్గదర్శకమైన పారిశ్రామిక వాడ.

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

దాశరథి, 13 సి, ఫిల్మ్ డైరెక్టర్స్ కాలనీ, మద్రాసు–24.

సిద్ధాని నాగభూషణం, ఎ.పి. ఆర్. ఓ, సమాచార, పౌరసబంధశాఖ, హైదరాబాద్

కూరాడ వెంకటేశ్వరరావు, 'నీలాద్రి' 3–5–1091/10, శ్రీ వెంకటశ్వరా కాలనీ, నారాయణగూద, హైదరాబాద్–29

పంద్రంగి రాజేశ్వరరావు, ఎడ్వకేట్,ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

కె. ఆర్. కె. మోహన్, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్, జూబిలీ హెచ్.పి.ఓ. హైదారాబాద్–2

"ఎల్లోరా"సబ్–ఎడిటర్, ఆంధ్రప్రభ,దోమలగూడా,హైదరాబాద్–29

శ్రీమతి కె. రామలక్ష్మి, 1, శివ ప్రకాశ మొదలి వీధి, టి.నగర్, మద్రాస్–17

శ్రీమతి సి. ఆనందారామం, ఎస్.టి 26, మారేడ్ పల్లి, సికిందరాబాద్

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాద్

సి.జి.కె. మూర్తి, ఫీల్డ్‌పబ్లిసిటీ అధికారి, కర్నూలు,

వెలగా వెంకటప్పయ్య, లైబ్రరియన్, జిల్లా కేంద్ర గ్రంథాలయం, కడప–51600

"సుమనశ్రీ"ఎం. నిజాముద్దీన్, ఆంధ్ర జ్యోతి కరస్పాండెంట్, కరీంనగర్.

కానాధి భొట్ల వెంకటసుబ్బారావు, జిల్లా పరిషద్ ఉన్నతపాఠశాల, వేంసూరు, ఖమ్మం జిల్లా–507164

ఉన్నవ మదన మోహనరావు, 6–3–354/2, హిందీనగర్ కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్.

రావి నూతల శ్రీరాములు, యు.డి.సి., ఐ. జి ఆఫ్‌రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయం, హైదరాబాదు–1

పులిచెర్ల సాంబశివరావు, 17 వలె ను, అరండల్ పేట గుంటూరు.

మహమ్మద్ నవాజ్ అలీఖాన్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొగిలి చర్ల, వయా దేశాయిపేట, వరంగల్ 506106


కె.రామమోహనరాయ్. 4–5–51, కల్యాణి వీధి, చంద్రమౌళినగర్, గుంటూరు–2

రెండుచింతల లక్ష్మీనరశింహశాస్త్రి, 2–88, మల్కాజ్‌గిరి, హైదరాబాద్–47

ఎం.సూర్యారావు, టి.పి. ఆర్ ఓ, గణపవరం, పశ్చిమ గోదావరిజిల్లా

శ్రీమతి. జి. లక్ష్మి, నాగుల్‌బజార్, హనుమకొండ–506011

శ్రీనివాస్, 3–5–143/3 రంగ్ కోఠి, న్యూసైన్సు కళాశాల వద్ద, నారాయణగూడా, హైదరాబాద్



బత్తిన మొగలయ్య

అది 1944 వ సంవత్సరం.

ఓరుగల్లు కోటలోని శంభునాధ దేవాలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా కిటకిటలాడి పోతోంది. ఆ జనాన్ని చూస్తుంటే ఓరుగల్లు కోటలోని శిథిలాలకి జీవంవచ్చి. పూర్వపు టౌన్నత్యం సిద్ధించిందా అని అనిపిస్తుంది.

అక్కడ సమావేశమైన జనసమూహాన్ని ఉద్దేశించి, ఒకనడి వయస్కుడు మేఘ గంభీరస్వరంతో ఉపన్యసిస్తున్నాడు. ఖద్దరు వేష ధారియై తెలుగు జాతీయతకు ప్రతిబింబంగా పంచెను, అంగీని ధరించిన వ్యక్తిని చూస్తూంటే ఎట్టివారికైనా గౌరవంకలుగుతూంది. అందుకు తోడు ఆతని ముఖంలో ప్రస్ఫుటంగా గోచరిస్తున్న ప్రశాంతత, స్వచ్ఛత, అమాయకత్వం కార్యదీక్ష చూపరులకు ఆతని పై గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. ఆతని ఉపన్యాసంలో త్యాగనిరతి, సేవాతత్పరత, దృఢ సంకల్పం ప్రస్ఫుటిస్తున్నాయి.

ఆ మహనీయుని ఉపన్యాసం గంగా ప్రవాహంలాగా సాగిపోతూంది "సోదర సోదరీమణులారా! మనం నివసిస్తున్న ఈ ఓరుగల్లు పోతుగడ్డ. ఇది వీర భూమి. ఢిల్లీసుల్తానులను సైతం గజ గజ లాడించి ప్రపంచ ప్రశంసలందుకున్న కాకతీయాంధ్రులు ఏలి నట్టి పుణ్యభూమి. రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు వంటి మహావీరులు పాలించిన పవిత్ర భూమి, శివదేవయ్య, యుగంధరుడు వంటి మహా మంత్రులు, విద్యానాథుని వంటి మహాపండితుల పాదస్పర్శతో పునీతమైనట్టి పసిడిభూమి. భారత దేశానికి నడిబొడ్డునఉండి హృదయ తుల్యమైనట్టి ఈ గడ ఈ నాడు నిజాం ప్రభువుల నిరంకుశ పాలనలో నలిగిపోతూ, సోదర భారతీయులతో సంబంధం లేనిదిగా ఉండింది. అటు యావద్భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని పారద్రోలే స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతూంది. అచ్చటివారి వీరగాథలను వింటుంటే ఎట్టివారికైనా ఒడలు పులకించక మానదు అచిరకాలంలోనే భారతదేశంలోని బ్రిటిష్ పాలన అంతరించి, స్వాతంత్ర్యం సిద్ధించక మానదు. మరిమనమో! నిజాం ప్రభువు నికృష్ట పాలనలో మనవ్యక్తిత్వాన్నే మరచి నీచాతి నీచమైన జీవనం గడుపుతున్నాం. మనకి కూడా ఈ నిజాం పాలన నుంచి విముక్తి కలిగి, సోదర భారతీయులతో పాటు స్వతంత్రాన్ని పొందగలిగిన నాడే, మనుష్యులుగా జీవించగలం ఈ నిజాం పరిపాలన అంతరించిననాడే భారతస్వాతంత్ర్యం సమగ్రం కాగలదు. అంతవరకు మనకి ముక్తిలేదు. ఈలక్ష్య సిద్ధికై మనమంతా నడుములు బిగించి కార్యరంగంలోకి దూకాలి. అశేష త్యాగాలు చేసి నిజాం పరిపాలనను ఎదుర్కొని అంత మొందించాలి. ఈ మహా యజ్ఞంలో అనేక మంది తమ అమూల్యమైన అసువులను అర్పించ వలసి ఉంటుంది. అయినా మనం అకుంఠిత దీక్షతో మనలక్ష్య సాధనకై పోరాడాలి. నిజాంపాలనకు చరమగీతం పాడాలి."

శ్రీ కె. ఆర్. కె. మోహన్

"వీర్ మొగలయ్య జిందాబాద్"

ఇసక వేస్తే రాలనంతటిజనం సూదిపడ్తే శబ్దం వినిపించేటంతటి నిశ్శబ్దంలో ఆ మహనీయుని మహా ఉపన్యాసం వింటున్నారు. వింటున్న కొదీ, వారిలో ఆవేశం ఉరకలు వేయసాగింది. అది పెల్లుబికి "వీర్ మొగలయ్య జిందాబాద్" అనే నినాదాలతో బయటకు రాసాగింది. ఉప్పెనలుగా వస్తున్న ఆ నినాదాలు భూన భోంతరాళాలను ఛేదిస్తున్నాయి. నాటి ప్రతాపరుద్రుడే తిరిగి అవతరించి అక్కడ సాక్షాత్కరించినట్లుగా అనిపించ సాగింది వారికి.

జనం ఇస్తున్ననినాదాలు ఆగాయి. మొగలయ్య తిరిగి తన గంభీరోపన్యాసం కొనసాగించబోతున్నాడు. అంతలో దూరాన్నుంచి కలకలంవినిపించ సాగింది. ఆశబ్దం వింటుండగానే జనంలో తీవ్రమైన సంచలనం, కలవరపాటు. కలగ సాగాయి. మరు నిముషంలో వందల కొద్దీ గుర్రాలమీద రజాకార్లు అక్కడికి వచ్చారు. వస్తూనే నిరాయుధులైన జనంమీద అన్ని వైపుల నుంచీ, నిర్విరామంగా తుపాకి కాల్పులు సాగించసాగారు. జనంలో అల్లకల్లోలం బయలు దేరింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఎటు పత్తే అటు జనం పరుగెత్త సాగారు. పరుగెత్తే వాళ్ళ కాళ్ళ క్రింద ఎందరో స్త్రీలు, బాలురు, వృద్ధులూ పడిపోతున్నారు. నిమిషంలో ఆకోట ప్రాంగణం యుద్ధరంగంగా మారి ఢిల్లీసైన్యానికీ కాకతీయులకూ గతంలో జరిగిన యుద్ధాలను తిరిగి ప్రదర్శిస్తున్నట్లుగా తలపించింది. మెరుపులా వచ్చి రజాకారులు సభను విచ్ఛిన్నంచేసి మెరుపులాగానే మాయమయ్యారు.

క్షత గాత్రులకు సాయం

జనం అంతా ఎవరికి వారు చెల్లా చెదరైపోయారు. క్షత గాత్రులు, మృత దేహాలు మాత్రం అక్కడ మిగిలారు. మొగలయ్య, అతని అనుయాయులు, క్షతగాత్రులకు సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇంతలో నిజాం సర్కార్ వ్యాన్‌లు వచ్చి, వారిని తరిమివేసి, మృతదేహాలను క్షతగాత్రులను అందులో వేసుకుని వెళ్ళిపోయారు. ఆ తర్వాత వారి గతి ఏమైందో దేవుడికే తెలియాలి. అపర జలియన్‌వాలాబాగ్‌గా మారిన ఆ ప్రదేశం నుంచి ఖిన్న మనస్కులై వెళ్ళిపోయారు మొగలయ్య, అతని అనుచరులూ.

ఆనాడు రజాకార్లు కావించిన దారుణ హింసా కాండకి, ఓరుగల్లు ప్రజలమనస్సులు అవమానంతోనూ, ఆక్రోశంతోనూ అట్టుడికి వారిలో స్వాతంత్రేచ్ఛ ప్రబలింది. మొగలయ్య నాయకత్వంలో వారు రహస్య స్థావరాలలో సమావేశాలు జరుపుతూ, రజాకార్లను అంతమొందించి, నిజాం పరిపాలనను తుదముట్టించే ఉద్యమాన్ని, ద్విగుణీకృతోత్సాహంతో నడుపసాగారు. ఆ మహోద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆ వీరాగ్రేసరుని పూర్తి పేరు బత్తిని మొగలయ్య. ఆయన 1912 లో ఓరుగల్లులో జన్మించారు. ప్రాథమిక విద్యను మాత్రమే బడసినా, ఆంతరంగికంగా ఎంతో జ్ఞాని, సంస్కార హృదయుడు. పిన్న వయస్సులోనే జాతీయ భావాలతో ఉత్తేజితుడై, కాంగ్రెసు వాలంటీర్‌గా పనిచేశాడు. భారత స్వాతంత్ర్యోద్యమ తీరుతెన్నులు పరిశీలించి నిజాం విముక్తోద్యమానికి నడుం కట్టాడు.

భారత రాజకీయాల్లో వేర్పాటు ధోరణులు తారస్థాయిని అందుకున్నాయి. భారత దేశం హిందూస్థాన్, పాకిస్థాన్‌లుగా విడిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ముస్లింలీగ్ నాయకులు 1946 వ సంవత్సరం ఆగస్టు 11 వ తేదీన అఖిల భారత పాకిస్థాన్ దినంగా పరిగణించాలని ప్రకటించారు. ఆనాడు జరుపవలసిన కార్యక్రమాన్ని గురించి వారి అనుయాయ సంస్థలకి, రహస్యంగా ఆజ్ఞలను జారీ చేశారు. హైదరాబాద్‌లో ఉన్నట్టి అంజుమన్ ఇత్తేహాదుల్ ముస్లమీన్ వారు ముస్లింలీగ్‌కి ప్రథమ భక్తులు. వారు ముస్లింలీగ్ ఎడల తమకుగల భక్తి ప్రపత్తులను ప్రకటించే ఉద్దేశంతో, ఆనాడు దారుణమైన హింసాకాండను, నిజాం రాష్ట్రం అంతటా జరుపడానికి పథకాలు వేసుకున్నారు.

పతాకావిష్కరణ

ముస్లింలీగ్ యొక్క ఆదేశం మొగలయ్య వంటి దేశ భక్తుని హృదయంలో అగ్ని జ్వాలలు రేపింది. హైదరాబాద్ లీగ్ వారు తలపెట్టిన కార్యక్రమాన్ని చూచాయగా తెలుసుకున్న మీదట అతని, అతని అనుయాయుల రక్తం ఉడికించి వేసింది. అందుకు ప్రతీకారంగా ఆనాడు ఓరుగల్లు కోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేయ సంకల్పించాడు మొగలయ్య.

రజాకార్ల నాయకుడు ఖాసింషెరీఫ్. అతను కూడా మొగలయ్య కార్యక్రమాన్ని రహస్యంగా తెలుసుకున్నాడు. మొగలయ్య ప్రయత్నాన్ని భగ్నం చేయాలని నిశ్చయించుకున్నాడు అతడు. అందుకుగాను నాలుగు రోజులు ముందుగానే వరంగల్ కోటలో విశేషంగా మందు సామాగ్రిని, ఆయుధాలను రహస్యంగా భద్రపరిచాడు.

ఆగస్టు 11 రానేవచ్చింది. ఆనాడు మొగలయ్య, అతని అనుయాయులు, వీరగంధం ధరించి ప్రకటించిన వేళకి ముందుగానే కోటలో ప్రవేశించి, కోటపై జాతీయ పతాకాన్ని ఎగుర వేశాడు.

ఆకాశంలో రెపరెప లాడుతూ, దేదీప్యమానంగా ఎగురుతున్న జాతీయ పతాకాన్ని చూసే సరికి రజాకార్లకు గంగవెర్రులెత్తాయి. రోషంతో పళ్ళు పటపటా కొరికాడు ఖాసింషెరీఫ్. వెంటనే తన మూకతో మారణాయుధాల్ని ధరించి, హుటాహుటిని కోటలో ప్రవేశించి మొగలయ్య బృందాన్ని చుట్టు ముట్టాడు. సంఖ్యాబలం అధికంగా ఉన్న ... లకు, వారు లొంగిపోక తప్పలేదు.

రజాకార్లు పతాక స్థంభాన్ని ధ్వంసం చేయబోయారు. అందుకు వద్దని నివారించాడు ఖాసింషెరీఫ్. అందరూ ఆశ్చర్యంతో అటు చూస్తూ ఉండిపోయారు.

మొగలయ్య పెడరెక్కలు విరిచి కట్టి ఆ స్థంభం దగ్గరకి తెప్పించాడు ఖాసింషెరీఫ్. " మొగలయ్యా, నీ చేతులతోనే పతాకాన్ని నేల కూల్చు. " అని హుంకరించాడు. మొగలయ్య వంటి దేశ భక్తునికి అంతకు మించిన అవమానం ఉండదని భావించాడు ఆ మూర్ఖుడు.


సింహం, ప్రాణాలైనా కోల్పోతుంది కాని గడ్డి కరుస్తుందా? మొగలయ్య వంటి ధీరుడా అందుకు లొంగేది !

" ఖాసింషరీఫ్, ఏ పతాకాన్నయితే నీవు అవమానించ దలుచుకున్నావో, ఆ పతాకానికే, నీవు, నీ అనుయాయులూ వందనం చేసే రోజు దగ్గర్లోనే ఉంది. " అని గంభీరంగా బదులిచ్చాడు.


ఇది పని కాదనుకున్నాడు ఖాసింషరీఫ్. మొగలయ్యని చిత్రహింసలు పెట్టూ పతాకాన్ని నేల దించమని బలవంత పెట్ట సాగాడు. ఎంత చిత్రవధ చేసినా మొగలయ్య మాత్రం లొంగలేదు. ఖాసింషరీఫ్ వక్రబుద్ధికి ఆలోచన వచ్చింది. మొగలయ్య తల్లిని, అక్కడికి పట్టి తెప్పించాడు. ఆమె కళ్ళ ఎదుట మొగలయ్యని

(తరువాయి 33వ పేజీలో)

నగరంలో వార్తా చిత్రాలు



జూలై 11న హిమాయత్‌నగర్‌లో గవర్నరు శ్రీమతి శారదాముఖర్జీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ సలహా మండలిని, సంక్షేమ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కోస్తా, ఆంధ్ర ప్రజానీక అభివృద్ధి సంఘం అధ్యక్షులు శ్రీమతి భవనం జయప్రద అధ్యక్షత వహించారు.



జూలై 9న గడ్డి అన్నారంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని పునరావాస గృహం సందర్శించారు.




జూలై 19న ముషీరాబాద్ ప్రాంతం నివాసితుల జీవన పరిస్థితులు గవర్నరు పర్యవేక్షించారు.



జూలై 8వ లయన్స్‌నగర్ (తూర్పు) వద్ద స్టేటుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహాయంతో నిర్మితమైన హేబిటేట్ హైదరాబాదు ప్రాజెక్టుకు గవర్నరు శంకుస్థాపన చేశారు. రెవిన్యూ మంత్రి శ్రీ పి. నరసారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నగరంలో వార్తా చిత్రాలు




గవర్నరు శ్రీమతి శారదాముఖర్జీ ఆగస్టు 18వ జూబిలీహాలులో జిల్లా విద్యాశాఖాధికారుల సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.



ఆగస్టు 20న భారతీయ రెడ్ క్రాస్ సర్వసభ్యసంఘం వార్షికసమావేశం సందర్భంగా రాజ్ భవన్ లో బహుమతులను అందజేశారు.


మహిళా కళాశాల వద్ద ఆగస్టు 19న జనతా అన్నంపొట్లాల అమ్మకం కేంద్రానికి గవర్నరు ప్రారంభోత్సవం చేశారు.






సెప్టెంబరు 2న గవర్నరు విద్యావారోత్సవాలను ప్రారంభిస్తున్నదృశ్యం. విద్యాశాఖ మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు అధ్యక్షత వహించారు.

ఆగస్టు 27న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రజతోత్సవాలను ప్రారంభించి, గవర్నరు ఉపన్యసించారు. కార్మిక శాఖ మంత్రి శ్రీ టి. అంజయ్య మన రాష్ట్రంలోని ప్రముఖ జర్నలిస్టులను సన్మానించారు.




నగరంలో వార్తా చిత్రాలు




ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ఆగస్టు 29న ఆంధ్రప్రదేశ్ చక్కెర మిల్లుల సంఘ భవన సముదాయానికి శంకు స్థాపన చేశారు.




ఆగస్టు 16న ముఖ్యమంత్రి నిలోఫర్ ఆసుపత్రిలో 700 ఎం.ఎ. ఎక్స్‌రే ప్లాంటుకు ప్రారంభోత్సవం చేశారు.





సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి పారిశ్రామికాభివృద్ధి మహా సభకు ప్రారంభోత్సవం చేశారు.

సెప్టెంబరు 1న సచివాలయంలో కార్మిక, ఉద్యోగ ఉపాధి కల్పన శాఖామంత్రి శ్రీ టి. అంజయ్య ఉపాధి కల్పనాధికారుల సమావేశాన్నుద్దేశించి ప్రసంగించారు.



<— సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి రామనగర్‌లో పార్సీగుట్ట ఇండ్ల నిర్మాణ పథకానికి ప్రారంభోత్సవం చేశారు. మున్సిపల్ పరిపాలన శాఖామంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడుగారు అధ్యక్షత వహించారు. కార్మికశాఖమంత్రి శ్రీ టి. అంజయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజధాని విశేషాలు

భారతీయ సంస్కృతీ వైశిష్ట్యం

ఉన్నతోన్నతమైన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించి వాటిని ముందు తరాల వారికి అనుగుణమైనవిగా ఉండే విధంగా తీర్చి దిద్దడం అవసరమని రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి ప్రబోధించారు.

''సంఘము—సంస్కృతి—భాష'' అనే—అంశంపై మూడు రోజులపాటు జరిగిన గోష్ఠి కార్యక్రమాలకు హైదరాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

''సంఘము, సంస్కృతి, భాష''ల మధ్య అవినాభావ సంబంధం ఉందనీ, వివిధ భాషా ప్రాంతాలలో అవి సమగ్రవికాసం చెందుతూ, భారతీయ సంస్కృతీ వైశిష్ట్యాన్ని ఆవిష్కరించడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయనీ డాక్టర్ గోపాలరెడ్డి వివరించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు ప్రసంగిస్తూ సంస్కృతి మానవత్వ విలువతో ముడిపడి ఉన్నదన్నారు. వివిధ ప్రాంతాల సంస్కృతుల మధ్య సమన్వయానికి కృషి జరగవలసి ఉందన్నారు.

అంతర్జాతీయ తెలుగు సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్.ఆర్. అప్పారావు స్వాగతం పలికారు.

''సమాజం సంస్కృతి, భాష''లకు సంబంధించిన సుమారు 40 అంశాలపై ఈ గోష్ఠి కార్యక్రమాలలో చర్చించారు. ప్రముఖులు అనేక మంది ప్రసంగ వ్యాసాలు చదివారు.

డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. శివరామమూర్తి వందన సమర్పణ చేశారు.

తెలుగు తియ్యందనాలు

తెలుగు జాతి చరిత్ర ఆ జాతివారి భాష, సంస్కృతుల గురించిన సదస్సు ఇటీవల హైదరాబాదులో జరిగింది. అంతర్జాతీయ తెలుగు సంస్థ ఏర్పాటు చేసిన ఈ సదస్సులో అనేక గోష్ఠులు నిర్వహించబడినవి. ఆయా శాఖలలో కృషి చేసిన వారెందరో ఈ సదస్సులో కనిపించక పోయినా ఉన్నంతలో కార్యక్రమాలు బాగానే జరిగాయి.

ఈ సదస్సుకు మంత్రి శ్రీ మండలి కృష్ణారావు అధ్యక్షత వహించారు.

హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు ముగింపు ఉపన్యాసం ఇస్తూ తెలుగుభాష ఆధునికీకరణలో జాప్యం జరగడం బాధగా ఉందన్నారు. శ్రీ మోటూరి సత్యనారాయణ, శ్రీ ఎస్. వి. సుబ్రహ్మణ్యం మొదలయిన వారు ప్రసంగించారు.

ప్రారంభంలో సంస్థ డైరెక్టర్ శ్రీ పి.ఎస్.ఆర్. అప్పారావు స్వాగతం పలికారు. డిప్యూటీ డైరెక్టర్ వందన సమర్పణ చేశారు.

సందేశాత్మక చిత్రాలు

''దేశ ప్రగతికీ, సమాజపురోగతికీ చలనచిత్రాలు ఉత్తమ సాధనాలు. అటువంటి సందేశాత్మక చలనచిత్రాలకు పన్ను మినహాయించాలి, సబ్సిడీలూ ఇవ్వాలి. అటువంటి ప్రోత్సాహం ప్రభుత్వం నుంచికావాలి'' అని ఇటీవల జంటనగరాల ఫిలింసొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ''ఓమనిషీ తిరిగిచూడు'' చిత్ర నిర్మాణబృందం సత్కారసభలో పలువురు ప్రముఖులు సూచించారు.

పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి శ్రీ ఎల్. లక్ష్మణదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిత్రానికి సంబంధించిన నటీనటులు, దర్శకుడు, నిర్మాత ప్రభృతులు అందరూ పాల్గొన్నారు.

ప్రధాన అతిథిగా శాసన సభాపతి శ్రీ రేబాల దశరథరామిరెడ్డి విచ్చేశారు. మంత్రి శ్రీ కె.బి. నరసప్ప సభ ప్రారంభం చేశారు.

మంత్రి శ్రీ శేషావతారం చిత్రంలోని ఉన్నత ప్రమాణాలను కన్నులకు కట్టినట్లు వివరించారు. శ్రీమతి సరోజినీ పుల్లా రెడ్డి కళా కారులను సన్మానించారు.

హైదరాబాదులోని ప్రభాత్ టాకీస్‌లో జరిగిన ఈ సభ శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి ప్రార్థనతో ప్రారంభం అయింది. శ్రీ రమణమూర్తి స్వాగతం పలికారు.

''వెట్టిచాకిరీ'' ప్రధాన ఇతి వృత్తంగా నిర్మించిన ఈ చిత్రంలో దర్శకుడు శ్రీ దాసరి ప్రతిభ గోచరిస్తుందనీ, ఇటువంటి మార్గ దర్శక చిత్ర నిర్మాణానికి ముందుకు వచ్చిన నిర్మాత అభినందనీయుడనీ అంటూ ఇటువంటి సందేశాత్మక చిత్ర నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందుకురావాలని, ప్రజల ఆదరణ లభించాలని వక్తలు డాక్టర్ సి. నారాయణరెడ్డి ప్రభృతులు సూచించారు.

భాగ్యనగర్‌లో హిందీభాష సదస్సు

ఇప్పటికీ జాతీయభాషస్థాయిని హిందీ పుంజుకోక పోవడం దైనందిన వ్యవహారాలలో ఇంగ్లీషు ప్రాధాన్యం పెరిగిపోతూ ఉండడం పట్ల హైదరాబాదులో ఇటీవల మూడు రోజులపాటు జరిగిన హిందీ సమ్మేళనం ఆందోళనను వ్యక్తం చేసింది.

హైదరాబాదులో హిందీ విశ్వవిద్యాలయం నెలకొల్పాలని సూచన చేశారు. అన్ని రాష్ట్రాలలోనూ హిందీ అకాడమీలు నెలకొల్పాలని మరో సూచన చేశారు.

ఇలాగే హిందీ భాషాభివృద్ధికి, సాహిత్య ప్రచారాన్ని మరింత తీవ్రంగా చేయాలనడంతోపాటు అనేక తీర్మానాలు ఆమోదించబడినవి.

తాత్కాలిక రాష్ట్రపతి శ్రీ బి.డి జెట్టి సభలను ప్రారంభించారు. ఈ సందర్భంలో గోష్ఠులు, కవి సమ్మేళనాలు, సభలు జరిగినవి.

—''ఎల్లోరా''

నారీలోకం

శ్రీమతి. కె. రామలక్ష్మి

బలహీనతనే బలాన్ని చేసుకున్న కమలా నెహ్రూ

గాలిలో పెట్టిన దీపకళికను గుర్తుకు తెస్తుంది కమలానెహ్రూ. వింత వెల్గు విరజిమ్ముతూ వెలిగే ఆ దీపకళిక గాలికి కదలాడు తుంది. స్తబ్దతలో నిశ్చలంగా నిలచి వెల్గుతుంది. ఒక క్షణం శక్తివంతంగా, మరు క్షణం బలహీనంగా కదలాడిపోతూ వుంటుంది. ప్రమిదెలోని నూనెను పీల్చుకుంటూ, తక్షణమే దాన్ని ఖర్చు చేసేస్తూ కాలక్షేపం చేస్తూ వుంటుందా అనిపిస్తుంది. నూనె దీపానికి ఎలక్ట్రిక్ లైటుకి వుండే మెరుపు లుండవు. అలా అని హరికేన్ లాంతరులాగా పేలవముగా అతి సామాన్యంగానూ వుండదు. నిజానికి దీపకళిక ఏ బంధాలూలేని స్వేచ్ఛా జీవి. వెల్గినంత కాలం దాన్ని చూసి ఆనందించకుండా ఎవరూ వుండలేరు. కాని ప్రమిదెలో నూనె అయిపోతే, వత్తికి పీల్చుకునే శక్తి నశించిపోతే—అది రెపరెపలాడి కళ్లు మూయక తప్పదు కదా! దీపం ఆరిపోయాక అది ప్రపంచంలో తన జ్ఞాపకాల చిహ్నంగా విడిచేదేమిటి? సంతోషం గాని, ఏ యితరమైన సుందర భావంగాని మిగలని—ముసురు రాత్రి లాంటి ఒక భావాన్ని మాత్రమే మిగులుస్తుందా అనిపిస్తుంది.

నిజానికి కమలా నెహ్రూ జీవితం ఒక దీపకళిక జీవితాన్నే జ్ఞప్తికి తెస్తుంది. తొలినుంచీ అనారోగ్యం మనిషి కాక పోయినా వివాహమైన కొన్నాళ్ళకే కమల చాలా అనారోగ్యం మనిషి అయింది. కాస్త ఓపిక, ఆరోగ్యం వున్నప్పుడు శక్తినంతా కూడ కట్టుకుని శక్తికి మించిన పనులు తలపెట్టి చేసేది. ఆ క్షణంలో మూర్తీభవించిన శక్తి లాగా కమల పనిచేయ కల్గేది. తిరిగి అనా రోగ్యంలోకి దిగ జారిపోతూ వుండేది. ఇలాగే చీకటి వెలుగుల్లాగా వెంట తరిమిన ఆరోగ్య అనారోగ్యాల మధ్య ఊగిసలాడుతూ నవంబరు 1935లో శాశ్వతంగా కనుమూసింది కమల.

ఇంతటి అబల చరిత్ర మననం చేసుకోవడంలో అర్థమేమిటి అని అనుకోవచ్చును. కాని ఇంతటి దుర్బల స్థితిలో వుంటూ కూడా కమల తన సాటిస్త్రీలకెలా ఒక ఆదర్శంగా నిలబడ కల్గిందో చెప్పడానికే—యీ జీవిత చరిత్ర. చేయాలన్న కుతూ హలం, పట్టుదల వున్నప్పుడు—శరీరం ఎంతటి బలహీనమైనదైనా— ఎంత అనారోగ్య పూరితం అయినదైనా—లెక్కలేదని చాటుతుంది కమలా నెహ్రూ జీవితం.

కమలా నెహ్రూ జీవితం గురించి వివరంగానూ, విస్తారం గానూ చెప్పడం కష్టం. కారణం ఒక్కటే. ఆమె బ్రతికిన




కాలంలో ముప్పాతిక వంతులు అనారోగ్యంతోనూ, సంపూర్ణా యుర్దాయములో సగభాగమేనా జీవించకపోడంతోనూ ఆమెను గురించి ఎక్కువగా గ్రంథస్థం కాలేదు. నెహ్రూ జీవిత భాగ స్వామిగా, ఇందిరా ప్రియదర్శిని తల్లిగా మనం గుర్తించే కమల వారి జీవితాలలో మధుర క్షణాలను చూపించి మాయమైంది. మూగ పోయిన కంఠాలు దుఃఖాన్ని, సంతోషాన్ని కూడా చాటలేనట్టు యీ ఇద్దరు ఆత్మీయులు తమ బాధను గుండెల్లో దాచుకున్నారేగాని— బహిరంగ పరచలేదు—ఎక్కువగా. ఇంతేకాదు, కమలా నెహ్రూను

27—11





ఆగస్టు 26న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల 18వ ప్లీనరీ సెషన్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు. కేంద్రపరిశ్రమలశాఖమంత్రి శ్రీ జార్జి ఫెర్నాండెజ్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి శ్రీ పి. రంగారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆగస్టు 29న జూబిలీహాలులో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణచేసిన జస్టిస్ బి.జె. దివాన్ మొమెంటోను అందజేశారు. జస్టిస్ శ్రీ ఎస్. ఓబుల్‌రెడ్డి చిత్రంలో వున్నారు.

గవర్నరు శ్రీమతి శారదా ముఖర్జీ ఆగస్టు 19న ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శ్రీ ఎస్. ఓబుల్‌రెడ్డిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.






ఆగస్టు 22న గవర్నరు రాజ్‌భవన్‌లో ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ శ్రీ బి. జె. దివాన్‌కు ఒక మొమెంటోను అందజేశారు.

నగరంలో…

ఆగస్టు 30న పరిశ్రమ భవనంలో భారత ప్రభుత్వ వాణిజ్యశాఖ ఎడిషనల్ సెక్రటరీ శ్రీ పి. కె. కౌల్ అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో "ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కార్గోకాంప్లెక్స్" నెలకొల్పేందుకు చర్చ జరిగింది.



ణంలో లేని సాన్నిహిత్యం వారిమధ్య యీ కాలంలో ఏర్పడ్డది. ఒకరి నొకరు అర్థం చేసుకుని జీవించడం ప్రారంభించారు. తన అనారోగ్యం తోటే కాదు, పనిలోని ఏకాగ్రతతోటికూడా నెహ్రూకి కమల అమూల్యమైన వ్యక్తిగా రూపాంతరం చెందింది. తన జీవిత లక్ష్యం విషయంలో ఎంత అదృష్టవంతుడో నెహ్రూ తన భార్యవిషయంలో అంత దురదృష్టవంతుడయ్యాడు. గడచిపోయిన వృథా జీవితాన్ని భర్తీ చేసుకునే అవకాశాన్ని యివ్వలేదు కమల.

ఆరోగ్యం బాగా దెబ్బతిని శానిటోరియంలో ఉన్నప్పుడు నెహ్రూ జైలులో వున్నాడు. కలిసివుండే అవకాశాలు కూడా చాల తక్కువ. ఏమాత్రం అవకాశం చిక్కినా ఒకచోట వుండాలని ప్రయత్నించారు. ఈ చిన్న అవకాశాలు ఎడారిలో ఒయాసిస్సుల్లాగా, గాఢాంధకారంలో వెల్గుచుక్కలలాగ వారి జీవితాలని కాంతితో తృప్తితో నింపేవి. ఒకరినుండి ఒకరు శక్తిని ధైర్యాన్ని అందుకునే వారు. 1920 లో ఒకసారి చాలా రోజులు కలసి వుండే అవకాశం చిక్కింది వారికి. వైద్యుల సలహాప్రకారం విశ్రాంతి తీసుకుంటున్న కమల స్విట్జర్లండులో ఎక్కువ కాలం గడిపినా ప్యారిస్, బెర్లిన్, మాస్కోలు కూడా తిరిగి చూశారు. 1929 లో కమల మాతృదేశానికి తిరిగి వచ్చేనాటికి చాలావరకు కోలుకొంటున్నది.

నెహ్రూకి యింటా బయిటా కూడా ఆరాధకులకి లోటులేదు: తల్లి, తండ్రి, అప్ప చెల్లెళ్లు, స్నేహితులు అంతా ఆరాధించే వారే. కాని కమల అతగాడినలా గుడ్డిగా ఆరాధించేది కాదు. అతన్ని చూసి గర్వపడేది. నెహ్రూ ఎంతటి ఘన కార్యం చేసినా అదామెకు చాలా సహజంగా కన్పించేది. నెహ్రూ అంతకంటే మామూలుగా ఎలా చేస్తాడు అని అనేది. సన్మాన పత్రాలలో అతన్ని పొగుడుతూ 'భారతావనికే ఆభరణం' అనీ 'త్యాగనిధి' అని అంటూంటే అవే మాటలతో యింటి దగ్గర కమల అతన్ని వేళాకోళం చేసేదట.

కమల చాలా విషయాలలో ఫెమినిస్టు. స్త్రీకి వ్యక్తిత్వంలేదు, ఆమె సంపూర్ణకాదు, అసహాయని, అని ఎవరేనా అంటే ఒప్పుకొనేదికాదు. కాని కమల తత్వంలో విరుద్ధ భావాల మేళవింపు కన్పిస్తుంది. 1931లో ఆమెను జైలుకి పంపిస్తుంటే భర్త అడుగు జాడలలో నడవ కల్గుతున్నందులకు నాకు సంతోషంగా వున్నది, అందట. ఈ మాటలు విని "పీటి పూర్తి భావం ముందుగా గోచరిస్తే కమల ఫెమినిస్టు తత్వం అలా అననిచ్చేది కాదు" అన్నాడట పండిట్ నెహ్రూ. ఇంకొక సందర్భంలో భర్తతోపాటు హైదరాబాదు వచ్చి పరదాస్త్రీల సమావేశంలో ప్రసంగించిందట. వారి నీమె ఉపన్యాసం ఎంతగా ఉత్తేజ పరచినదీ చెప్పలేంగాని కమలా నెహ్రూతో మాట్లాడిన తమ భార్యల దృక్పథం చాలా మారిపోతోందని చాలా మంది భర్తలు ఫిర్యాదులు చేశారట.

కమలలో స్వాతంత్రేచ్ఛ ఎక్కువ. శారీరకమైన దౌర్బల్యాన్నీ, అశక్తతనీ మానసిక శక్తితో గెలుస్తూ కాలం గడిపింది. శరీరం ముందడుగు వేయనంటున్నా,ఆత్మబలం ముందుకు నెట్టేది. ఇదే మళ్ళీ ఆమె ఆరోగ్యం చెడిపోవడానికి దారితీసింది. తాను పాల్గొన్నందుకు, తనభర్త పాల్గొన్నందుకు ఉద్యమాలను చూసి గర్వపడేది. తనలో శక్తి వున్నంతవరకు అతని సరసన నిల్వగల్గినందుకు గర్వపడేదామె.

ఆమెఆరోగ్యంఅందరినీ కలవరపరుస్తున్నప్పుడు, నెహ్రూను పెరోల్ మీద విడుదల చేయాలన్న యోచనలు సాగుతున్నప్పుడు—నెహ్రూని జైలు అధికారులు తీసుకువచ్చారు కమల నొకసారి చూడంకోసం జ్వరభారంతో కంది ఎర్రబడిన తన ముఖాన్ని పైకెత్తి, కృశించిన తన చేతిలోకి అతని చేయి తీసుకుంటూ "మీరు పెరోల్ మీద రావడం ఏమిటి? అలా చేయకండి" అందట. ఆమె స్వాభిమానం అలాంటిది. ఒక ఆదర్శం కోసం తన సుఖాన్నీ, కోరికలనీ చిరునవ్వు నవ్వుతూ బలిపెట్ట గల్గిన శక్తి వుండేది కమలకి.

కమల ప్రసక్తి వచ్చినప్పుడు ఇందిర ప్రసక్తి రాక మానదు. ఎందరి నడుమవున్నా ఇందిర జీవితం ఏకాంతంగానే గడిచిందని చెప్పాలి. తలిదండ్రులకి దూరంగా కాలంగడిపినా వారే ఆమెకు సన్నిహితులు. 1931లో నెహ్రూ జైలు నుంచి కుమార్తెకు ఉత్తరం రాస్తూ 'ఒంటరిగా నీకేం తోచడంలేదు కదూ, పదిహేను రోజుల కొకసారి అమ్మనూ, నన్నూ నువ్వు చూడవచ్చు. మా మాటలు ఒకరివి ఒకరికి చెప్పవచ్చు' అని రాశారు. ఇంకొకసారి రాస్తూ 'మలక్కాగోల్‌లో అమ్మా, నైనిటాల్ జైల్లో నేనూ, ఆనంద్ భవన్‌లో నువ్వూ—ముగ్గురం ముగ్గురినీ పోగొట్టుకున్నట్టు వుంది. అవునా!' అంటారు.

1934లో కమల పరిస్థితి యింకా విషమించింది. నెహ్రూని తాత్కాలికంగా విడుదల చేశారు. పదకొండు రోజులుండి జైలుకి తిరిగి వెళ్లిపోయాడు. కమల, కూతురు ఇందిరతో వైద్యం కోసం యూరప్ వెళ్లింది.కాని ఆమె ఆరోగ్యము బాగుపడలేదు. కమల పోడానికి కొద్దిమాసాల ముందు నెహ్రూను విడుదలచేశారు. కమలా నెహ్రూ ఇద్దరు ఏకాంత జీవులని శాశ్వతంగా వదలి వెళ్లిపోయింది.

కమల జీవితాన్ని గురించి ఏమాత్రమైనా తెలుసుకోవాలంటే నెహ్రూరచనలే ఆధారం. వాటిలోగూడ ఎక్కువగా వ్యక్తిగత విశేషాలు దొరకవు. దానికి కారణం ఇద్దరూ వ్యక్తిత్వాలకి కాక దేశం కోసం జీవితాలు వెచ్చించిన వారే కావడం. కాని అతని కట్టడికి లొంగని మనోభావాలు కొన్నిసందర్భాలలో బయట పడతాయి. ఆ సందర్భాలలో ఒకటి అతని జీవిత చరిత్ర అంకితం యివ్వడం. జీవిత చరిత్రని అంకితంయిస్తూ టు కమల హూయీజ్ నో మోర్, అంటాడు. ఆ ఒక్క వాక్యం చాలు ఆమె ఎడల అతనికున్న ప్రేమ,వాత్సల్యం విశదం కావడానికీ ఆమె అతనినెంతగా ఉత్తేజితుని చేసిందో తెలుసుకోడానికీ.

కమల జీవితం పెనుగాలిలో నిలచిన ప్రమిదె దీపాన్ని జ్ఞప్తికి తెచ్చినా, దానిలోని మొండి శక్తినీ తెగింపునీ చెప్పక చెప్తుంది. ఈ శరీరానికి ఆరోగ్యం లేకపోతే ఏం? ఆత్మబలం వుంటే ఏమైనా చేయవచ్చు నన్నది కమలానెహ్రూ నిరూపించి చూపించింది.

అదే ఆత్మ విశ్వాసాన్ని అందరు మహిళలు అలవరచు కోవాలన్న వాదం చెప్పక చెప్తుంది కమలా నెహ్రూ జీవితం. బలహీనత నుంచి బలాన్ని, ఆశయం నుంచి శక్తిని పిండుకొని ఉద్యమాలలో వూపిరి తీసుకొని—వెలిగినంత కాలం అందరికీ వెల్గుపంచిన ధైర్యశాలి కమల. పిరికితనం క్రుంగతీస్తుంది. ధైర్యం ముందంజ వేయిస్తుందన్న దానికి నిదర్శనే కమల జీవితం.

సీరియల్ :

మహాభారతము

తెలుగంటుల లక్ష్మణశాస్త్రి

విరాట పర్వం

—109—

"జనమేజయా! ద్రౌపది మొర చెవిలో పడగనే భీముడు తన పరుపునుండి లేచి పరుగెత్తుచు, 'సైరంధ్రీ! నీ మాట నేను విన్నాను. కనుక ఉప కీచకులవలన భయము నీకు లేదు.' అని భీముడు ఒడలు పెంచుకొని, వేషము మార్చుకొని, ద్వారముగుండా పోయినచో జాగు కావచ్చునని గోడ దుమికి ఉప కీచకులను వధించు నిచ్ఛతో పోయెను. అతడు ప్రహరీ గోడనుండి వృక్షముపైకి ఎక్కి ఉపకీచకులు పోవుపైపు చూచి శ్మశానముపైపు ఉపకీచకులను నెరుమున ఉరికెను. శ్మశాన సమీపమునందు తాటిచెట్టువలె పొడవుగాను, పెద్ద కొమ్మలుగల అగ్ర భాగము ఎండినదిగాను నున్న ఒక చెట్టును పెరికి, ఏనుగువలె దానిని రెండు చేతులతో ఎత్తి భుజముపైన పెట్టుకొనెను. ఆ చెట్టు పది బారల పొడవుండెను. దండహస్తుడయిన యమునివలె ఆవృక్షమును భుజముపైన పెట్టికొని వారిని తరిమెను. అతడు పరుగెత్తునపుడు అతని తొడల వేగముచేత దారిలోని చిన్నచిన్న చెట్లు నేలవ్రాలెను.

ఉప కీచకుల వధ

"సింహమువలె వచ్చుచున్న ఆ గంధర్వునిచూచి కీచకులు భయముచే వణకుచుండిరి. 'సైరంధ్రి వలననే మనకీ ప్రాణభయము కలిగినది. ఈమెను విడువుడు' అని ఆమెను విడిచిపెట్టి పరుగెత్తిరి. అప్పుడు భీముడు ఆ వృక్షముతోనే ఆ నూట అయిదు మంది ఉపకీచకులను, ఇంద్రుడు రాక్షసులను వలె సంహరించెను. తరువాత ద్రౌపది బంధములను విడిచి భీముడు ఆమెను ఓదార్చుచు "దేవీ! నిరపరాధయైన నిన్ను బాధపెట్టినవారికి ఈ గతియే పట్టును. ఇక నీవు నిర్భయముగా నగరమునకు పొమ్ము. నేను ఇతర మార్గముగుండా పాకశాలకు పోయెదను" అని చెప్పి వెడలిపోయెను.

"జనమేజయా! నరకబడిన చెట్లక్రింద పడినట్లు నూట అయిదు మంది ఉపకీచకుల శవములు శ్మశానమందు పడియుండెను. రాజా! కీచకునితోపాటు నూట ఆరుగురు కీచకులును ఈ విధముగా భీమునిచేత చంపబడిరి. ఆ దృశ్యమును చూచి పౌర స్త్రీ పురుషులు మహాశ్చర్యమును పొంది ఏమియు మాటాడకుండ నుండిరి" అని చెప్పి వైశంపాయనుడు తరువాతి కథ, ఇట్లు చెప్పదొడగెను :—

ద్రౌపది బృహన్నలా, సుదేష్ణలతో మాట్లాడుట

"జనమేజయా! పౌరులప్పుడు విరాటరాజుకడకు పోయి "గంధర్వులు ఉప కీచకులను సంహరించిరి. వజ్రాయుధముచేత ఛేదించబడిన పర్వత శిఖరములవలె వారి తలలు నేలపై వ్రాలి పడియున్నవి. సైరంధ్రి విడిపింపబడి తిరిగి నగరములోకి వచ్చుచున్నది. రాజా! ఆమె యిచట నుండుటచేత నీ నగర జీవనమంతయు సంకటావస్థలో పడియున్నది. సైరంధ్రియో, అతిలోక సౌందర్యవతి. ఆమెను కాపాడుచున్న గంధర్వులో, మహాబలవంతులు. ఆమెను చూచిన ప్రతి పురుషునికో తప్పక కామేచ్ఛ కలుగును. రాజా! సైరంధ్రి దోషముచేత ఈ పట్టణము వినాశము చెందకుండు విధానమును త్వరగా అనుసరించుము" అని చెప్పిరి—ఆమాటలువిని విరాటరాజు "ఈ సూత పుత్రశవములకు అంత్యేష్టి (దహనసంస్కారములు) చేయబడుగాక. ఒక చోటనే అంటించబడిన అగ్నిలో శరీరములన్నియు చందన కాష్ఠముల చేతను రత్నముల చేతను ఇతర సుగంధ ద్రవ్యముల చేతను దహింపబడునుగాక." అని చెప్పి సుదేష్ణనుచూచి విరాటరాజు "దేవీ! నీకడకు సైరంధ్రి వచ్చినచో నామాటగా నామెతో 'సైరంధ్రీ! నీయిచ్చవచ్చినచోటికి పొమ్ము. గంధర్వుల వలన రాజు భయపడుచున్నాడు. నీవు గంధర్వుల చేత రక్షింపబడు చున్నావు. నేను పురుషుడను కనుక స్వయముగా నీతో ఏమాటగూడ చెప్పజాలకున్నాను. గాబట్టి స్త్రీ ద్వారా నీకు చెప్పించుటలో ఏదోషము ఉండదని, నా పత్నిద్వారా నేనే నీతో ఈమాట చెప్పుచున్నాను.' అని చెప్పుము" అని యనెను."

"జనమేజయా! భీముని చేత విడిపింపబడిన తరువాత సైరంధ్రి, స్నానము చేసి బట్టలు ఉతుకుకొని పరిశుభ్రయై విరాట నగరమునకు పోయెను. ఆమెనుచూచి పురుషులందరు నలుదిక్కులకు పారిపోయిరి. గంధర్వుల భయముచేత కొందరు ఆమెను చూడగనే కన్నులు మూసికొనిరి. పాకశాల ద్వారమునందు మదపుటేనుగువలె నిలిచియున్న భీమసేనుని ద్రౌపదిచూచి విస్మయ పూర్వకముగా 'నన్ను విడిపించిన గంధర్వ రాజునకు నమస్కా-

రము' అని యనెను. ఆమాటవిని భీముడు 'దేవీ! పూర్వమునుండి యిక్కడ ఉన్న గంధర్వులు తమ ప్రతిజ్ఞా ఋణము నుండి విముక్తులై, నీ యాజ్ఞకు వశులై నేటినుండి యిచ్ఛాను సారముగా సంచరింతురుగాక.' అని ద్రౌపదితోననెను.

"తరువాత ద్రౌపది, నర్తనశాల యందు విరాట కన్యలకు నాట్యమునేర్పుచున్న అర్జునుని చూచెను. అప్పుడు అర్జునుడు, ఆ కన్యకలు నర్తనశాల నుండి బయటకు వచ్చి, ఏ యపరాధము చేయకయే క్లేశములనుభవించి వచ్చుచున్న ద్రౌపదిని చూచి "సైరంధ్రీ! నిరపరాధురాలైన నిన్ను బాధించిన కీచకులు నీ భాగ్యవశమున వధించబడిరి. నీవు విడిపింపబడితివి." అని ద్రౌపదితో ననిరి. తరువాత సైరంధ్రీ బృహన్నలలకు ఇట్లు సంవాదము జరిగెను.—

బృహ :—"సైరంధ్రీ ! ఆ పాపిషులు ఎట్లు చంపబడిరి? నీ వెట్లు విడిపింపబడితివి? జరిగిన వాస్తవమును వినగోరుచున్నాను."

సైరంధ్రీ:—బృహన్నలా ! సుఖముగా కన్యకాంతఃపురము నందు సర్వదా వసించుచున్న నీకిప్పుడు సైరంధ్రీ విషయముతో నేమివని? సైరంధ్రీకి గలిగిన దుఃఖమును పోగొట్టు దానవు కావుగదా? నాకుగలిగిన దుఃఖానుభవము నీకెక్కడిది? కేవలము నన్ను పరిహసించుటకు ఇట్టి ప్రశ్నములు చేయుచున్నావా?'

బృహ :—"కల్యాణీ ! పశువుల వంటి నీచజాతి (నపుంసకుడుగా) లోపడియున్న బృహన్నలగూడ గొప్ప దుఃఖమునను భవించుచున్నది. నీవు అమాయకురాలవు గనుక బృహన్నలను గూర్చి తెలియజాలకున్నావు. నీతోనేను కలిసియున్నాను. నీవుగూడ మా అందరితో కలిసియున్నావు ఇట్లుండగా, నీకు కష్టముకలిగి నప్పుడెవరికి దుఃఖము ఉండదు? నిశ్చయముగా, ఒక వ్యక్తి యితరుల మనస్సును తెలిసికొన జాలడు కనుక నీవు నన్ను తెలిసికొనలేకున్నావు."

"జనమే జయా! అట్లునర్మ గర్భితముగా మాట్లాడిన తరువాత ద్రౌపది, తోడి కన్యకలతోపాటు రాజగృహము నందు ప్రవేశించి సుదేష్ణవద్దకు పోయెను. సుదేష్ణ సైరంధ్రితో విరాటరాజు మాటగా నిట్లనెను:—"సైరంధ్రీ ! నీ యిష్టము వచ్చిన చోటికి పొమ్ము. నీ పతులు గంధర్వులనుండి రాజు భయపడుచున్నాడు. నీవు ఈ భూమండలము నందు అసమాన సౌందర్యవతివి. పురుషులకు విషయోపభోగము ఇష్టముగా నుండుట సహజము. నీ పతులు గంధర్వులో అతి కోపిషులు" ఆ మాటలు విని సైరంధ్రి యిట్లనెను :—

"భామినీ ! ఇక పదమూడుదినముల వరకు మాత్రము మహారాజు నన్ను క్షమించుగాక, అప్పటికి గంధర్వుల అభీష్ట కార్యము పరిపూర్ణమై వారు కృతకృత్యులయ్యెదరు. ఆ తరువాత వారు నన్ను తోడ్కొని పోయెదరు. మీకుగూడ ప్రియము కలిగించెదరు. గంధర్వులు ప్రసన్నులగుటచేత విరాటరాజు గూడ అవశ్యముగా తన సోదర-బాంధవులతో అనేక శ్రేయస్సులు అనుభవించగలడు. విరాటరాజు చేత అపకారము పొందిన గంధర్వులు సర్వదా అతనికి కృతజ్ఞులుగా నుండెదరు. గంధర్వులు అతి సాధువులు, బలవంతులు, తాము పొందిన ఉపకారమునకు ప్రత్యుపకారము చేయదలచెదరు. నిన్ను ప్రార్థించుచు అడుగుచున్నాను. నీ మనస్సులో ఏమైనను అనుకొనుము. నా ప్రార్థనను నీకు నివేదించినాను. ఇక కొద్ది దినములు మాత్రము నన్ను భరించుము. దీనిచేత నీకు శుభము కలుగును.''

"జనమేజయా ! సైరంధ్రి మాటలువిని సుదేష్ణ తన సోదరుల మరణముచేత పరితపించుచు, దుఃఖించుచు, ఏమియు తోచక ఆర్తురాలై ద్రౌపదితో "భద్రే ! నీ ఇచ్ఛ ఉన్నంతవరకు ఇక్కడ ఉండుము. కాని, నా పతిని, పుత్రులను విశేషముగా రక్షించుము. దీనికై నీ శరణుజొచ్చితిని" అని యనెను. ఇట్లు చెప్పి వైశంపాయనుడు జనమేజయునకు తరువాత వృత్తాంతమునిట్లు చెప్పెను:

గూఢచారులు కీచకవధనుగూర్చి దుర్యోధనునకు చెప్పుట

"జనమేజయా ! కీచకుడు చంపబడిన తరువాత విరాటరాజు సపరివారముగా మిక్కిలి దుఃఖించెను. జనులుగూడ 'అంతటి బలశాలురు కీచకుడు, అతని తమ్ములే వధింపబడిరి. మన గతియేమి?' అని భయపడజొచ్చిరి. మహా బలవంతుడైన కీచకుడు విరాటునకు ప్రియుడుగానుండెను. ఆ నగరమునందును, దేశమునందును ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ముచ్చటింపజొచ్చిరి. 'అతడు శత్రుసంహారకుడేగాని, పరస్త్రీ లోలుడు, దుర్మార్గుడు. కాబట్టియే గంధర్వులచేత చంపబడెను.' అని దేశప్రజలు అనుకొనుచుండిరి.

దుర్యోధనునిచే పంపబడిన గూఢచారులు, అనేక రాష్ట్రములను, గ్రామములను తిరిగి పాండవులను వెదకుచుండిరి. అంతటను తిరిగి వారు హస్తినాపురమునకు పోయిరి. అక్కడ సభలో భీష్మ ద్రోణ కర్ణ శకుని దుశ్శాసనాదులతో కూర్చునియున్న దుర్యోధనునితో గూఢచారులిట్లనిరి:—


"రాజా ! అతి దుర్గమమైన అడవులన్నియు మేము అతి ప్రయత్నముతో వెదకితిమి. పర్వత శిఖరములందును, అనేక దేశములందును, పట్టణములందును వెదకితిమి కాని యెక్కడగూడ వారిజాడ కానరాలేదు. ఒకవేళ పాండవులు నశించి పోయినారేమో యని అనుమానము కలుగుచున్నది. లేకున్న మా యన్వేషణమునందు వారు తప్పక మాకు కనపడియుందురు. వారు ఎక్కడ నివసించుచున్నదీకూడా తెలియలేదు. రాజా ! కొంతకాలము మేము వారి సారథులవెంట వెడలితిమి. ఇంద్రసేనాది పాండవ సారథులు పాండవులు లేకయే ద్వారకాపురికి చేరిరి. కనుక పాండవులు, ద్రౌపది నశించియేయుందురని మా నిశ్చయము. పాండవుల సమాచారముగాని, వారు చేయుచున్న పనిగాని తెలియకున్నది. ఇకపైన మాకు ఆజ్ఞయేమి ? పాండవులను వెదకుటకు ఇంకను నేమిచేయుమనెదరో సెలవీయవలెను. (సశేషము)

సహకార పట్టణం ఎమ్మిగనూరు

—శ్రీ సి. జి. కె. మూర్తి

మన దేశ సాంఘిక ఆర్థికాభివృద్ధిలో గ్రామాల పాత్ర చాలా ప్రధానమైనది. గ్రామాభ్యుదయ ధ్యేయంతోనే సహకార రంగాన్ని గ్రామ స్థాయి వరకు విస్తృతపరుస్తున్నారు. సహకార రంగంలో సాధించిన విజయాలను, మననం చేసుకుంటున్నపుడు మన రాష్ట్రంలో ఎమ్మిగనూరు పట్టణానికి అగ్రతాంబూలం ఇవ్వవలసి వుంటుంది. నిజానికి ఈ పట్టణాన్ని " సహకార పట్టణం " అంటే సమంజసంగా ఉంటుందేమో! ఈ పట్టణంలో వెనుక బడిన వర్గాలకు, బలహీన వర్గాలకు ఉద్దేశించిన చర్మకారుల సహకార కుటీర పరిశ్రమ సంఘం అనేక విజయాలు సాధించింది. భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార శాఖ కర్నూలు తరపున ఎమ్మిగనూరు సబ్-తాలూకాలోని ఈ సంస్థ గురించి వివరాలను సేకరించడానికి మా బృందం జూన్ 23 వ తేదీన ఎమ్మిగనూరు చేరింది. 24 వ తేదీ ఉదయం ఈ సంస్థ అధ్యక్షులైన యువకులు శ్రీ గంగన్న గారిని కలుసుకున్నాము. సంస్థ సెక్రటరీ శ్రీ సిద్ధయ్యగారితో మమ్మల్ని పరిచయం చేసి మమ్మల్నందరినీ వారి ఉత్పత్తి కేంద్రానికి తీసికొనిపోయి, అక్కడ జరుగుతున్న పనుల్ని గురించి మాకు వివరంగా తెలియజేశారు.

అనేక మంది గ్రామీణ పని వారకు జీవనోపాధి కల్పిస్తున్న చర్మకారుల పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి సంస్థ దీనిని ప్రోత్సహించుచున్నది. గ్రామాలలో మోటబావుల నీరు తోడడానికి, చిన్న చిన్న సదులు దాటడానికీ ఉపయోగించే దొన్నెల నుండి నిత్యం మనము ధరించే, పాదరక్షల వరకు రక రకాల తోలు వస్తువులను యిక్కడ చేస్తారు. గ్రామాలలో నివసించే చర్మకారులు చాలా మంది విడి విడిగా పని





చేసుకుంటూ ఉంటారు. ఎమ్మిగనూరు సబ్-తాలుకాలోని వీరందరినీ దగ్గరకు తీసుకొనివచ్చి వీరికి జీవనోపాధి కల్పించటానికి ఎమ్మిగనూరు చర్మకారుల సహకార కుటీరపరిశ్రమ సంఘం స్థాపించబడింది.

సొసైటీ స్థాపన

పూర్వం కూడా ఎమ్మిగనూరు పట్టణానికి తోలు వస్తువుల తయారీలో ప్రాముఖ్యత వుండేది. కాని పరిశ్రమలో సరియైన వ్యవస్థీకరణ, పనివాళ్ళలో ఐక్యత లోపించడం వలన పట్టణంలోని ఈ కుటీర పరిశ్రమ దెబ్బతిన్నది. ఇటువంటి పరిస్థితిలో 1959లో కుటీర చర్మ పరిశ్రమను పైకి తీసుకొని రావటానికీ, గ్రామాలలోని చర్మకారులకు ఉపాధి కల్పించడానికి ఎమ్మిగనూరు చర్మకారుల సహకార కుటీర పరిశ్రమ సొసైటీ స్థాపించ బడింది. శ్రీ యం. సోమప్పగారు ఈ సొసైటీ స్థాపించారు.

మొదట్లో చాలా కొద్ది పెట్టుబడితోనే, ఈ సొసైటీ ప్రారంభమైంది. 1959 లో కేవలం 22 సభ్యులతోను, రూ. 2600/-లు షేర్ కాపిటల్‌తోను ప్రారంభమై అదే సంవత్సరంలో రూ. 10,225.00లు విలువగల వస్తువులు ఉత్పత్తి చేయబడినవి. తదుపరి ప్రతియేటా రూ. 10,000.00 ల నుంచి రూ. 40,000.00 ల చొప్పున ఉత్పత్తులు పెరుగుతూ వచ్చినవి. అలాగే సభ్యుల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. 1975-76 నాటికి సొసైటీ సభ్యుల సంఖ్య 107 కు పెరిగింది. ఈ నాడు ఈ సొసైటీ ఆధరైజుడు షేర్ క్యాపిటల్ రూ. 10,000/- లు. ఒక్కొక్క సభ్యునకు రు. 5/- లు విలువ జేసే షేర్లు 20 వరకు ఉన్నవి. 1975-76 లో ఈ సొసైటీ ఉత్పత్తి చేసినవస్తువుల విలువ రూ. 2,63,368/-లు, ఈ 17 సంవత్సరములలోను సొసైటీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఈ నాడు 3 లక్షల రూపాయలు విలువ జేసే వస్తువులను ఉత్పత్తి చేస్తున్నది ఈ సొసైటీకీ రాష్ట్ర ఖాదీబోర్డు గుర్తింపు, ఆర్థిక సహాయం కూడా లభించిది. ఇంతవరకు ఖాదీబోర్డు నుండి రూ 1,29,200/- లు ఋణం అందింది.

ఈ సొసైటీలో రెండు ప్రధాన భాగములున్నవి. (1) చర్మ పరిశుభ్ర విభాగము (2) పాదరక్షలు తయారుచేసే విభాగము.

చిట్టి చిట్టి పాపల చిరునవ్వుల నిధి

బొమ్మల ప్రభావం చిన్నారి పాపలపై, ముఖ్యంగా జబ్బుతో ఉన్నవారిపై అమితంగా ఉంటుంది. దీనిని గురించిన ఒక ప్రయోగం మొదటగా డెన్మార్క్‌లో ప్రారంభమయింది. నార్వేలో కొనసాగుతోంది. అదే ప్రయోగం ఇప్పుడు విజయవాడలో ఋజువయింది.



అమ్మ తర్వాత బొమ్మే !

డెన్మార్క్ దేశంలో మున్సిపల్ కాన్సర్ ఆసుపత్రి ఒకటుంది. 1936 వ సంవత్సరంలో ప్రొఫెసర్ క్రెబ్స్ అనే ఆయన అక్కడ ఒక డాక్టర్‌గా ఉండేవారు. ఆ ఆసుపత్రికి ఒక రోజున ఒక ప్రముఖ శాఖాధిపతి వద్దనుంచి సుమారు వెయ్యి రూపాయల విరాళం వచ్చింది. ఆ సొమ్ము పంపుతూ ఆయన ఇలా వ్రాశారు. "ఈ మొత్తాన్ని కాన్సర్ వ్యాధిగ్రస్తుల సౌఖ్యంకోసం మీ ఇష్టం వచ్చినట్లుగా ఖర్చుపెట్టండి. కాన్సర్ వ్యాధితో మరణించిన మా బంధువుల జ్ఞాపకార్థం ఇది పంపుతున్నాను." డాక్టర్ క్రెబ్స్ ఈ మొత్తం తీసుకున్నాడు. ఎలా వినియోగిద్దామా ! అనే ఆలోచనలో పడాడు. సరే ! మామూలు పద్ధతిలో రోగుల్ని చూస్తున్నాడు. ఒక చోట కాన్సర్ వ్యాధిగ్రస్తురాలైన ఒక అమ్మాయి చేతిలో ఒక చక్కటి బొమ్మ ఉంది. దాంతో ఆడుతోంది అమ్మాయి. ప్రక్క మంచంమీద ఉన్న మరో అమ్మాయి ఆ బొమ్మవంక వెర్రిగా చూస్తోంది. ఆ దృశ్యం చూశాడు క్రెబ్స్. ఆ చూపుల్లోకల దీనత్వం అతణ్ణి కలచివేసింది. వెంటనే బజారుకి వెళ్ళి ఒక బొమ్మని కొని తెచ్చాడు. ఆ బిడ్డ సంతోషానికి మేర లేదు. డాక్టర్ పొందిన తృప్తికి అంతులేదు. అప్పుడు నిశ్చయించుకున్నాడు క్రెబ్స్. తన వద్దకు వచ్చిన విరాళాలన్నీ కలిపి బహుమతులకోసం వినియోగించాలని. కొంత సొమ్ము తనుకూడా కలిపి "ఫండ్ ఫర్ స్మాల్ ప్లెజర్స్" అనే నిధిని ప్రారంభించి ఒక బ్యాంకులో వేశాడు. "బొమ్మల సాన్నిధ్యంలో బాలలు తమ బాధలను మరచిపోయి త్వరగా కోలుకుంటారు" అని కొన్ని రోజుల వ్యవధిలోనే క్రెబ్స్ తెలుసుకున్నాడు. ఆయన ప్రారంభించిన ఈ 'నిధి' తర్వాత నార్వేలో కూడ ప్రారంభమయింది.



డెన్మార్క్‌లోని ఈ సంస్థగురించి 'రీడర్స్ డైజస్ట్' లో 1967 ప్రాంతంలో ఒక వ్యాసం ప్రచురితమయింది. విజయవాడ వాస్తవ్యుడు శ్రీ చంద్రమౌళీశ్వరరావు అనే రైల్వే ఉద్యోగిని ఈ వ్యాసం ఆకర్షించింది, వెంటనే ఆయన క్రెబ్సుకి తన ఉద్దేశం తెలియపరిచాడు, 1971 ఏప్రియల్‌లో పసిపాపల చిరునవ్వులు మూటకట్టుకోవాలనే ఆసక్తి, శ్రీ చంద్రమౌళీశ్వర రావు, ఆయన



చిరునవ్వుల నిధి !

స్నేహితులకి కలిగి మనదేశంలో మొట్టమొదటిసారిగా విజయవాడ రైల్వే ఆసుపత్రిలో ఆ సంస్థను ప్రారంభించారు.

పసివారికి 'అమ్మ తర్వాత బొమ్మే' అనే శాస్త్రం ఉంది. బొమ్మల ప్రపంచంలో తమ్ము తామే మరచిపోతారు బాలలు. బొమ్మరిళ్ళు కట్టుకొని భవిష్యత్తుకు బాటలువేసుకుంటూ ఊహల ఉయ్యాల్లో ఊగిపోతుంటారు. హాస్పిటల్ వాతావరణంలో జబ్బుతో ఉండే అటువంటి బాలలు బొమ్మలను చూడగానే చిరునవ్వులు చిందిస్తారు. ఆ నవ్వులు వెలలేనివి, బొమ్మలు అందించినవారిని పులకితం చేసాయి. ముఖ్యంగా రుగ్మతలో ఉన్నవారికి ఆనందం కల్పించడంలో ఎంతో సంతృప్తి, శాంతి ఉన్నాయి. ఈ అనిర్వచనీయ అనుభూతిని "ఫండ్ ఫర్ స్మాల్ ప్లెజర్స్" సంస్థ సభ్యులు పొందగలుగుతున్నారు


ఈ సంస్థ ప్రధాన వ్యక్తి, కార్యదర్శి అయిన శ్రీ చంద్రమౌళీశ్వరరావు ప్రతిరోజు ఉదయం రైల్వే ఆసుపత్రికి వెళతారు. అస్వస్థులుగా ఉన్న బాలబాలికల పడకలవద్ద చిన్నచిన్న ఆట వస్తువులు పెడతారు. వాటిని తిరిగి తీసికోరు. ఆ పాపలందరికి చిన్న చిన్న ఆటబొమ్మలు, వారి వారి అభిరుచులనుకూడా సాధ్యమైనంతవరకు గుర్తుంచుకొని పంచిపెడుతుంటారు.

ఇది రైల్వే ఆసుపత్రి వారి ఖర్చుకాదు. సంస్థ సభ్యుల వద్దనుండి వసూలు చేసిన విరాళాలనుంచి బొమ్మలు కొంటుంటారు. ప్రతి నెలా ఈ ప్రణాళికకు 80 రూపాయలు ఖర్చవుతుంది. దీనికున్న నిధులు చిన్నవేగాని బ్యాంకులో వేసి వాటిని కాపాడటం, వడ్డీద్వారా పెంచేడం చేస్తూ ఉంటాము. అని చంద్రమౌళీశ్వరరావు గారు చెప్పారు. ఆసుపత్రిలోనే ఒక బీరువా నిండా బొమ్మలు, ఆనాడున్న బాలరోగుల జాబితా ఏర్పాట్లు అన్నీ ఉన్నాయి. పిల్లల వార్డులో బొమ్మల పుస్తకాల గ్రంథాలయాన్ని కూడ ఏర్పాటు చేశారు. డెన్మార్క్ నుంచి క్రెట్స్ పంపిన కొన్ని ఆట వస్తువులు కూడ అక్కడ ఉన్నాయి.


వ్యాధినుండి ఏరోగైనా నివారణ పొందాలంటే అతనికి కేవలం మందులు ఇచ్చినంత మాత్రాన చాలదు. వ్యాధి నయంచేయడానికి చిరునవ్వుతో ఎల్లప్పుడూ రోగికి ధైర్యం చెబుతూ మంచి మనస్సుతో సేవ చేసే డాక్టర్లూ, నర్సులూ అవసరం. అందువల్లనే ఇటీవలి కాలంలో మందులు ఇవ్వడం కంటే ఎక్కువగా మనస్సును ఆహ్లాదపరిచే వైద్యం చేయాలని డాక్టర్లు అభిలాష పడుతున్నారు. పిల్లల వార్డులో ఒక డాక్టర్ చెప్పినట్లుగా జబ్బుతో ఉన్న బాలలపై బొమ్మల ప్రభావం అమితంగా ఉంటుంది. వాటి సాన్నిధ్యంలో బాలలు తమ బాధను మరచిపోవటమే కాకుండా త్వరగా ఆరోగ్యంతో కోలుకోటానికి కూడ వీలవుతుంది. ఆసుపత్రిలో చికిత్సకు చేరిన బాలబాలికలకి ఈ సంస్థ ఇచ్చే బొమ్మలు సంతోషం, వినోదం చేకూర్చడమే కాకుండా పిల్లల తల్లి తండ్రులకు కూడ ఆనందదాయకంగా ఉంటోంది. పైగా పిల్లలకి ఇంజక్షన్లు ఇచ్చేటప్పుడు, కట్లు కట్టేటప్పుడు డాక్టర్ల ప్రయాస కొంతవరకు తగ్గుతున్నదట. అన్నిటికి మించి, డాక్టర్లు ఇచ్చే మందు బాగా పనిచేస్తుందట. ఈ సంస్థ కార్యకలాపాలను ఇటీవల విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడ ప్రవేశపెట్టారు.

జడివాన రోజు కావచ్చు—మండు వేసవి కావచ్చు—ఎముకలు కొరికే చలికావచ్చు—ఏరోజయినా సరే "ఫండ్ ఫర్ స్మాల్ ప్లెజర్" (చిట్టి చిట్టి పాపల చిరునవ్వుల నిధి) రైల్వే హాస్పిటల్‌లో ఉన్న పిల్లల వార్డులో బొమ్మలు పంచుతూనే ఉంటారు. ఆ బొమ్మలతో ఆడుకుంటున్న పాపల ముఖంలో ఆనందాన్ని చూస్తే, ఈ పథకం ఇతర ప్రాంతాలలో కూడ అనుసరణీయమని అనిపిస్తుంది.


—సూరి



జిల్లాల్లో



నెల్లూరు జిల్లా గుమ్మలదిబ్బ గ్రామంలో ఆగస్టు 16వ గవర్నరు శ్రీమతి శారదాముఖర్జీ బలహీన వర్గాల వారికిరుణాలు పంపిణీ చేశారు.



సెప్టెంబరు 1వ తేదీన కర్నూలు సమీపంలోని దిన్నెదేవర పాడులో కాల్షియం కార్బయిడు ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు శంకుస్థాపన చేశారు.


సెప్టెంబరు 1వ ముఖ్యమంత్రి గాజుల దిన్నె ప్రాజెక్టుకు సేద్యపునీటిని విడుదల చేసినదృశ్యం.






ఆగస్టు 16వ గవర్నరు గారు నెల్లూరులో మహిళా సూపర్ బజార్‌కు ప్రారంభోత్సవం చేశారు.

చీరాల వద్ద ఆగస్టు 7న సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. ఆర్. శంకరన్ వెనుకబడిన తరగతుల విద్యార్థుల ప్రభుత్వ వసతిగృహానికి శంకుస్థాపన చేశారు.





శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య సేవానిరతి

—శ్రీ వెలగా వెంకటప్పయ్య

భారత జాతి పిత మహాత్మాగాంధీని గురించి ప్రపంచప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ యిలా అన్నాడు. "ఇటువంటి మహా వ్యక్తి కేవలం మానవుడుగా యీ భూమిమీద జీవించాడంటే భవిష్యత్‌లో ప్రజలు నమ్మడం కష్టం". ఈ మాటలలో వాస్తవం లేకపోలేదు. అలాగే అయ్యంకి వెంకట రమణయ్య వంటి ప్రజాసేవకుడు తెలుగు దేశంలో పుట్టి—తెలుగువారి యీర్ష్యా ద్వేషాగ్నులకు తట్టుకొని ఏడు దశాబ్దాలపాటు ప్రజాసేవ చేయగలగాడంటే ముందు తరాల ప్రజానీకం — యిదొక కల్పనగా, కలగా భావించవచ్చు.

1907 లో ప్రజారంగంలో కాలూని గ్రంథాలయోద్యమం కేంద్రంగా తీసుకొని బాలభటోద్యమం, సహకారోద్యమం, ప్రకృతి జీవనం, దివ్యజ్ఞానం, వయోజనవిద్య, మొదలయిన రంగాలలో అపారమైన కృషి సల్పిన గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకట రమణయ్య పంతులుగారు యిప్పటికీ మన మధ్య ఉల్లాసంగా మెలగడం మన అదృష్టం.

మహాప్రస్థానం

88 వ పడిలో పడుతున్న అయ్యంకివారిని వయస్సు అడిగితే సరి — వెంటనే చెప్పేస్తారు, "పాతికేళ్ళ పడుచువాడినని"! అంటే షష్ఠిపూర్తి పిదప మరొక జన్మ ప్రారంభమైనదని వారి అభిప్రాయం పండిన వయస్సులో ఉన్నా ఆలోచనలలో, ఆచరణలో ఎంతో ఉత్సాహంగా కనిపిస్తారు. ఇలా నిత్యోల్లాసముతో వారి జీవయాత్ర మహాప్రస్థానంగా సాగిపోతూవుంది

వెంకట రమణయ్యగారు తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రపురం తాలూకా కొంకుదురు గ్రామంలో 1890 జులై 24 వ తేదీన జన్మించారు. తండ్రి వెంకటరత్నం పంతులుగారు, తల్లి వెంగమాంబ. వంశ పారంపర్యంగా వస్తున్న సుక్షేత్రం, తండ్రిగారి ప్రభుత్వోద్యోగం, బాల్యంలో వారికి ఏ లోటు లేకుండా జరిగింది. ప్రాథమిక విద్యాభ్యాసం పశ్చిమ గోదావరిజిల్లా అత్తిలి, గణపవరం గ్రామాల్లోనూ, 1906 లో నాలుగోఫారం వరకు నరసాపురం టైలర్ హైస్కూలులో పూర్తిచేశారు. సాటివారంతా దుస్తులకు, వస్తువులకు, వినోదాలకు డబ్బు ఖర్చుపెడుతూ ఉంటే వెంకట రమణయ్యగారు తండ్రిగారు స్వంత ఖర్చులకు యిచ్చిన సొమ్ముతో నాడు ప్రచారంలోగల దేశోపకారి, సత్యవాదిని, ఆర్యమతబోధిని, కల్పలత, బాలసరస్వతి, ప్రబుద్ధ భారతి — మొదలయిన పత్రికలు తెప్పించి తాను ఆసాంతం చదివి యితర్లచేత చదివించేవారు, ఇతర్లకు చదివి వినిపించేవారు. దీనితోబాటు కొత్తకొత్త పత్రికలు రంగురంగుల పుస్తకాలు ఎన్నో సేకరించేవారు. ఇలా సాయిలా పాయిలాగా సాగిన వారికి చదువు సంధ్యలు పెద్దగా అబ్బలేదు. కాని ఏదో చేద్దాం — ఏదో సాధిద్దాం అనే జిగీష, తెలుసుకోవాలనే జిజ్ఞాస వారిలో పెరుగుతూ వచ్చింది.

ప్రజారంగ ప్రవేశం

భారత దేశంలో రాజకీయ చైతన్యానికి 1905 లో జరిగిన బెంగాలు విభజన మూల కారణమని చరిత్రకారుల అభిప్రాయం. ఇదే సమయంలో బిపిన్ చంద్రపాల్ జాతీయోద్యమాన్ని విస్తృతంగా ప్రచారంచేసే ఉద్దేశంతో "యంగ్ యిండియా" పత్రికను స్థాపించారు. ఈ పత్రిక ప్రచార నిమిత్తం, ప్రజల మనోభావాలను తెలుసుకొనే నిమిత్తం దేశమంతటా సంచారంచేస్తూ, తూర్పుకోస్తా నగరాలను పర్యటించే సందర్భంలో 1907 లో రాజమండ్రి వచ్చి ఉత్తేజకరమైన ఉపన్యాస చేశారు. తన పెద తల్లిగారి కుమార్తె వివాహానికి రాజమండ్రి వెళ్ళిన వెంకట రమణయ్యగారు ఆ ఉపన్యాసం విన్న

మీదట దేశసేవకే జీవితాన్ని అంకితం చేయ నిశ్చయించారు. పవిత్రమైన గోదావరి నదిలో స్నానంచేసి జీవితాంతం వరకు ప్రజాసేవలో ఉండగలనని ''రక్షాబంధన్'' అను కంకణం ధరించారు. అది వారి అకుంఠిత దీక్షకు, త్యాగనిరతికి తొలిసంజ.

దేశ పరిస్థితులు

ఆంధ్రులలో సహజంగా ఉండే ఉత్సాహం, త్యాగం, ఆవేశం అనేక ఉద్యమాలకు తెలుగుదేశం పెట్టని కోటగా చేశాయి. దీనికి తోడు బెంగాల్ విభజన ఉద్యమం రాజకీయ చైతన్యాన్ని పాదుకొల్పింది 1907 నాటికి ఉవ్వెత్తుగా స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. నాడు స్వదేశీ ఉద్యమానికి మచిలీపట్నం, రాజమహేంద్రవరం – రెండు ప్రధాన కేంద్రాలు. సత్యవోలు గున్నేశ్వరరావు గారు యీ ఉద్యమానికి నాయకులు. వీరు రాజమహేంద్రవరంలో తాలింఖానాలద్వారా, నాటకాలద్వారా, లలిత కళలద్వారా, యువకులను ఉత్తేజపరిచారు.

వెంకట రమణయ్యగారు అచట శిక్షణ పొందారు. దాదాభాయి నౌరోజీ రచన "పావర్టీ అండ్ బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా''– అనే గ్రంథం చదివి దేశ పరిస్థితులను కూలంకషంగా తెలుసుకున్నారు. ఆ తర్వాత 1908లో కాలినడకన మచిలీ పట్నం వెళ్ళి స్వదేశీ ఉద్యమనాయకులైన కోపల్లె హనుమంతరావు, ముట్నూరి కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య గార్ల ఆశీస్సులను పొందారు. 1910లో మహారాష్ట్ర నుంచి డాక్టరు ఎస్. వి. కేట్కర్, పంజాబ్ నుంచి ఆర్య సమాజానికి చెందిన భాయి పరమానంద ఆంధ్రదేశ పర్యటనకు వచ్చినప్పుడు వెంకట రమణయ్యగారు వారితో సంచారం చేసి రాష్ట్ర పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. రాష్ట్రం సాంఘికంగా, ఆర్థికంగా, వెనకబడి ఉండడానికి కారణం ప్రజలలో అధిక భాగం అవిద్యావంతులుగా ఉండడమేనని తెలుసుకున్నారు. ఈలోటును తీర్చడానికి కొన్ని ఉద్యమాలవసరమని భావించారు. ముందుగా గ్రంథాలయోద్యమాన్ని చేపటారు, ఇతర ఉద్యమాలకు చేయూతనిచ్చారు.

ఉద్యమస్ఫూర్తి


తెలుగునాట గ్రంథాలయోద్యమం స్వయంభువుగా బయలు దేరినదని పెద్దలు చెప్పుతున్నా దీనికి బరోడా ఉద్యమం స్ఫూర్తినిచ్చింది. బరోడా మహారాజు షాయజీరావు గయక్వాడ్ ఆఫ్ బరోడా అమెరికా దేశం పర్యటించి అచటి పౌర గ్రంథాలయాలవల్ల ప్రజానీకం పొందుతున్న ప్రయోజనాలు కళ్ళారా చూచి ఎంతో ఆనందించారు. ఆ నమూనాలో బరోడాలో పౌర గ్రంథాలయ విధానానికి రూపురేఖలు కల్పించేందుకు అమెరికానుంచి బోర్డన్ అను నిపుణుని రప్పించి రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామస్థాయిల్లో గ్రంథాలయ వ్యవస్థను నెలకొల్పారు. కార్యకర్తల కోసం "లైబ్రరియన్ లెనీ'' పత్రికను స్థాపించారు. బరోడా సంస్థానంలోని గ్రంథాలయోద్యమ ప్రభావం భారత దేశమంతా కనిపించింది. వివిధ ప్రాంతాలలో గ్రంథాలయాలు ప్రారంభించబడ్డాయి. అదే సమయంలో ఆంధ్ర దేశానికి నడి బొడయిన విజయవాడ పట్టణంలో 1903లో స్థాపించబడి, జీర్ణావస్థలో ఉన్న ఆస్తిక పుస్తక భాండాగారాన్ని అయ్యంకి వెంకట రమణయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, గోపరాజు బ్రహ్మానందం, పాటిబండ సుబ్రహ్మణ్యం మొదలైన యువకులు రామమోహన పుస్తక భాండాగారంగా 1911లో మార్చారు. తిరువూరు రాజా, మునగాల రాజా గార్ల సహకారంతో దీనికి తర్వాత బందరు రోడ్‌లో చక్కని భవనం సమకూరింది. దీని పెరుగుదల ప్రతిదశలోనూ అయ్యంకి వారి పాత్ర ఉంది. అప్పటి వరకు బరోడా ఉద్యమాన్ని గురించి వినడమేగాని ఎవ్వరూ చూడలేదు. వెంకట రమణయ్యగారు స్వంత ఖర్చుల మీద బరోడా వెళ్ళి, మహారాజా వారిని దర్శించి ఉద్యమాన్ని స్వయంగా పరిశీలించారు. అచటగల వర్గీకరణ, సూచీకరణ విధానాలను కూలంకషంగా అవగాహన చేసుకున్నారు. బోర్డన్ అమెరికన్ గ్రంథకర్తల పేర్లను అనుసరించి సిద్ధం చేసిన వర్గీకరణ, సి. డి. దలాల్‌గారు గుజరాతీ పుస్తకాలకు చేసిన వర్గీకరణ దృష్టిలో ఉంచుకుని అయ్యంకి వారు తెలుగు పుస్తకాలకు నూతన వర్గీ కరణ విధానాన్ని రూపొందించారు. దీన్ని రామమోహన గ్రంథాలయంలో మరి కొన్ని గ్రంథాలయాలలో అమలు పరచి శాస్త్రీయ విధానంలో గ్రంథాలయాలు నిర్వహించడానికి పునాదులు వేశారు. ఒక కొత్త వాతావరణాన్ని సృష్టించారు.


గ్రంథాలయ సంఘం

రామమోహన గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న ఉత్సాహవంతులైన కార్యకర్తలకు ఒక చక్కని ఆలోచన తట్టింది. తెలుగు దేశంలోని నలు చెరగులా గల గ్రంథాలయ కార్యకర్తలను సమావేశపరచి–గ్రంథాలయాల నిర్వహణలో ఎదురౌతున్న సమస్యలను చర్చించి, పరిష్కరించిన ఉద్యమం ముందుకు పోగలదని, వారు ఊహించారు. తదనుగుణంగా అయ్యంకి వెంకటరమణయ్య, సూరి వెంకట నరసింహంగారు 1914 జనవరి "ఆంధ్ర పత్రిక"లో యీ దిగువ ఉదహరించిన లేఖను ప్రకటించారు.

''మనదేశమందిపుడు రాజకీయ విషయములందేమి, సంస్కరణ విషయముల యందేమి, ప్రాయిక విషయములందేమి ఇంక దేశాభివృద్ధి కర విషయముల యందేమి, దేశ ప్రముఖులనేకులప్పుడప్పుడు పలువిధముల ప్రయత్నములు సల్పుచున్నారు...పఠన మందిరములు స్థాపన చేయుచున్నారు... కావున యీ ప్రతినిధుల మహాసభ నొకదానిని గావించి భాండా గారముల యొక్క నిర్మాణమును చర్చించి, ప్రస్తుతమున్నవి నశింప కుండుటకును, నూతనములైన వాని నేర్పాటు చేయుటకు బ్రయత్నించుట యత్యావశ్యకంబని తోచుచున్నది..." ఈ లేఖను చదివిన కార్యకర్తలు సభను ఏర్పాటు చేయడానికి ప్రోత్సహించారు.

కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి అధ్యక్షతన ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల సభ అయ్యంకి వారి కార్యదీక్షతో 1914 ఏప్రిల్ 10వ తేదీన విజయవాడలో జరిగింది. సర్కారు, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలనుంచి, గంజాం, బళ్ళారి జిల్లాలనుంచి 60 గ్రంథాలయాలకు చెందిన 200 మంది ప్రతినిధులు యీ సభలకు హాజరయ్యారు. దేశం నలుమూలలా గల



అఖిల భారత మహాసభలు

లాహోర్‌లో 1918లో అఖిల భారత గ్రంథాలయ మహాసభ జరిగింది. అప్పటికే గ్రంథాలయ రంగంలో గణనీయమైన కృషి చేసిన వెంకటరమణయ్యగారిని ఆహ్వానించలేదు. పైగా ఆ మహాసభ ఉద్యోగులకే పరిమిత మని తెలియజేయ బడింది. గ్రంథాలయోద్యమం ప్రజా ఉద్యమ మని నిరూపించేందుకు, ఉద్యమాల నిర్వహణలో తెలుగు వారి శక్తి సామర్థ్యాలు చవి చూపేందుకు వెంకటరమణయ్యగారు 1919 నవంబరు 19వ తేదీన అఖిల భారత పౌర గ్రంథాలయ మహాసభను ఏర్పాటుచేసి పలు రాష్ట్రాల నుంచి దాదాపు 250 మంది ప్రతినిధులు వచ్చేట్లు చేశారు. ఈ మహాసభకు మధోల్కార్ అధ్యక్షత వహించారు. సభానంతరం జాతీయ స్థాయిలో గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి వెంకటరమణయ్యగారు కార్యదర్శిగా అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘం స్థాపించ బడింది. ఈ సంఘం తరపున "ఇండియన్ లైబ్రరీ జర్నల్" త్రైమాస పత్రిక 1924లో ప్రారంభించబడి 13 సంవత్సరాలు అయ్యంకి వారి ఆధ్వర్యంలో దివ్యంగా నడిచింది. జాతీయ స్థాయిలో స్థాపించబడిన యీ సంఘం—దాదాపు మూడు దశాబ్దాలు విస్తృతంగా కృషిచేసి అనేక రాష్ట్రాలలో గ్రంథాలయోద్యమ వ్యాప్తికి తోడ్పడింది. జాతీయ స్థాయిలో ప్రసిద్ధులైన యం. ఆర్. జయకర్, రవీంద్రనాధ్ ఠాగూరు, సి. ఆర్. దాస్, ప్రఫుల్ల చంద్రరాయ్, డాక్టర్ ప్రమోధనాధ చటర్జీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, కుమార్ మునీంద్ర దేవ్‌రాయ్ ప్రభృతులను గ్రంథాలయోద్యమంతో సన్నిహితం చేసింది. దీని వెనుక అయ్యంకి వారి కృషి ఎంతో ఉంది.

సేవక సంఘ మహాసభలు

"మానవునిలో దాగి వున్న దైవదత్తమైన శక్త్యుత్తులనూ, చైతన్యాన్ని ప్రేరేపించి, వెలికితెచ్చి మానవుని మాధవునిగా చెయ్యడం ఆంధ్రదేశ గ్రంథాలయ పరమలక్ష్యం" అని వెంకటరమణయ్యగారు చెబుతారు. 1939 వరకు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘంలో అంతర్భాగంగానూ, ఆ తర్వాత నేటి వరకు వేరుగానున్న ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక సంఘం రాష్ట్ర స్థాయిలో 1934–1976 మధ్యకాలంలో 13 మహా సభలను అయ్యంకి వారి ఆధ్వర్యంలో ఆంధ్రదేశం నలుమూలలా నిర్వహించింది. ఈ మహాసభల సందర్భంగా పుస్తక ప్రదర్శనలు, మ్యాజిక్‌లాంప్ ప్రదర్శనలు జరిగినప్పుడు వందలాది తిలకించే వారు. విశాఖపట్నంలో 1936లో జరిగిన ప్రదర్శనలో గ్రంథాలయాల పరంగా తయారైన చేతి పనులు వస్తువులను ప్రదర్శించి పలువురిని ఆకర్షించి–విశేషంగా ప్రశంసలనందుకున్నారు. వెంకటరమణయ్యగారి సమక్షంలో ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమ వజ్రోత్సవం, సేవక సంఘ విద్రుమోత్సవం 1975 లో రాజమండ్రి గౌతమ గ్రంథాలయంలో వైభవోపేతంగా జరిగాయి. "స్వయం తీర్ణః పరస్తారయతి" తానుబాగుపడి తోటి వారిని బాగుచెయ్యాలనే పవిత్ర సంకల్పం గల గ్రంథాలయ సేవా వ్రతులకు రాజమండ్రి సభలు ఎంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని యిచ్చాయి.

(సశేషం)

బత్తిన మొగలయ్య

(16 వ పేజీ నుండి)


చిత్ర హింసలు పెడ్తూ, మొగలయ్య చేత పతాకాన్ని నేల కూల్చ జేయమని ఆమెను బలవంత పెట్టసాగాడు. కాని ఆమె వీరమాత ! "నాయనా....అశాశ్వతమైన ఈ దేహంకోసం నీ కర్తవ్యాన్నుంచి తప్పించే ఆజ్ఞ ఏదీ నేను ఇయ్యను." అంది ఆ మహాతల్లి గంభీరంగా.


"అమ్మా: నీవు అట్లా అంటావని నాకు తెలుసు. నేను నీ పుత్రుడినైనందుకు గర్విస్తున్నానమ్మా", అన్నాడు మొగలయ్య ఆనందాతిరేకంతో. తల్లీకొడుకులతీరు చూసేసరికి, ఖాసింషెరీఫ్‌కి గంగ వెర్రులెత్తింది. కన్నతల్లి ఎదుటే మొగలయ్యని ఏ అంగానికి ఆ అంగం ఖండించసాగాడు. అయినా మొగలయ్య చలించలేదు. చిరునవ్వుతో ఆ బాధను భరించి అసువులు బాసి వీర స్వర్గ మలంకరించాడు. కళ్ళెదుట జరుగుతున్న దారుణాన్ని శివుడు గరళాన్ని భరించినట్లుగా భరించింది ఆ ధీరోదాత్తమాత కర్తవ్య పాలనలో కుమారుడు బలి కావడానికే అంగీకరించింది ఆ మహాసాధ్వి.


మొగలయ్యను దారుణంగా వధించిన ఖాసింషెరీఫ్, తానొక వీరుడిలాగా ఒక ఘనకార్యం చేసినట్లుగా భావించుకొని, మెళ్లో పూల మాలలు ధరించి తన పరివారంతో ఊరంతా ఊరేగాడు.

మొగలయ్య మరణించినా అమరుడే అయ్యాడు. అటువంటి త్యాగ మూర్తుల కృషి ఊరికేపోలేదు. మరి మూడు సంవత్సరాలలోనే నిజాం రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. నిజాం రాక్షస పాలన, రజాకార్ల దారుణాలు అంతమొందాయి. ఖాసింషెరీఫ్ వంటి దుర్మార్గులు చరిత్రహీనులుగానే మిగిలిపోయారు.


ఓరుగల్లులో ఎగిరే ప్రతి జాతీయ పతాకమూ, మొగలయ్య త్యాగాన్ని మౌనంగా చాటుతూనే ఉంటుంది.








రాష్ట్రపతి డాక్టర్ నీలం సంజీవరెడ్డి
ఆగస్టు 17వ తేదీన
తిరుమల—తిరుపతి దేవస్థానం
సందర్శించిన దృశ్యాలు







ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు

ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 1977 ఆగస్టు 15వ తేదీ ఉదయాన ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా ప్రజలకు సందేశమిస్తూ దేశంఆర్థికంగా అభివృద్ధిని సాధించనిదే రాజకీయ స్వాతంత్ర్యం సమగ్రం, సంపూర్ణం కాదనే విషయం ప్రజలందరికీ తెలుసుననీ, అందుకే మన రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్య సోషలిజాన్ని లక్ష్యంగా నిర్దేశించిందనీ అన్నారు.

రేడియో ప్రసంగం పూర్తి పాఠం దిగువ ఇవ్వబడింది :—

జాతి జాగృతికీ ప్రజల నవచైతన్యానికీ ప్రతీకగా స్వాతంత్ర్య దినోత్సవం మనం జరుపుకుంటూ వుంటాము. ఉగాది, సంక్రాంతి మొదలైన పండుగల వలెకాక ఆగస్టు 15 రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సాంఘికంగానూ చైతన్యవంతమైన ప్రజల పండుగ. ఈ పండుగను ఏటేటా చేసుకుంటూ దేశమాతను దాస్యశృంఖలాల నుండి విముక్తం చేయడానికి తమ సర్వస్వాన్ని అర్పించిన త్యాగమూర్తులను యీ సందర్భంగా మనం ఏటేటా సంస్మరించుకొంటూ వుంటాం. దేశస్వాతంత్ర్య సమరంలో ఎందరో మహానుభావులు కష్టాలను చిరునవ్వులతో అనుభవిస్తూ ప్రాణత్యాగానికి సైతం వెనుదీయలేదు. అష్టకష్టాలు అనుభవించి, శతాబ్దాల తరబడి నిరంతరం పోరాటంజరిపి సాధించుకున్న స్వాతంత్ర్యం విలువ వెలకట్టరానిది.

దేశం ఆర్థికంగా అభివృద్ధిని సాధించనిదే రాజకీయ స్వాతంత్ర్యం సమగ్రం, సంపూర్ణం కాదనే విషయం అందరికీ తెలుసు. అందుకే మన రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్య సోషలిజాన్ని లక్ష్యంగా నిర్దేశించింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే పరిపాలకులు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని మనం కంకణం కట్టుకున్నాం.

సాంకేతిక రంగంలో ముందడుగు

స్వాతంత్ర్యం లభించిన తర్వాత గత 30 సంవత్సరాలలో దేశం అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఆధునిక యుగంలో మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యంగా సాంకేతిక రంగంలో ముందడుగు వేయాల్సిన



ఫిల్మ్ అయిపోయే వరకూ ఫోటోలు తీస్తుంది. అది కూడా ఆన్ చేసింది.

దగ్గిర దగ్గిర అరగంట వరకూ అక్కడే ఉన్నాడు సాంబశివం. ఆ తరువాత ప్రసూనతో కలిసి బయలు దేరాడు.

దారిలో అన్నాడు:

"నేను ఇవ్వాళ నిన్ను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చానో తెలుసా ?"

"నామాట కాదనలేక ...."

"అదొక్కటే కాదు. తలుచుకుంటే ఎలాగో నిన్ను మరిపించ గలను. నా తరువాత ఈ వ్యాపారానికి నిన్ను వారసురాలిని చెయ్యాలనుకుంటున్నాను. ఇదంతా నువ్వు నెమ్మది నెమ్మదిగా నేర్చుకోవాలి!"

గతుక్కుమంది ప్రసూన. ఈ సంఘ ద్రోహాన్ని ఇతడు తర తరాలకు కొనసాగించా లనుకుంటున్నాడు. తన తరువాత వారసులను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాడు.

కానీ.... సాంబశివం తనకు సమస్తమూ ఇయ్యాలనుకుంటున్నాడు. తను అతనిని సర్వనాశనం చెయ్యబోతోంది.

సంఘర్షణతో దహించుకుపోతూ జాలిగా సాంబశివం చేతిమీద చేయివేసింది. సాంబశివం ముఖంలో కోటి వెలుగులు కనిపించాయి.

"సూనా! నీకు తెలుసా! స్పర్శ సంభాషిస్తుంది. నీ స్పర్శలో నాకు నీ మనస్సులో అభిమానం అర్థమవుతోంది." అన్నాడు.

ప్రసూన సిగ్గు పడి ముఖం తిప్పుకుంది.

ఇద్దరూ ఇంటికి చేరుకునే సరికి హరి ఎదురు చూస్తూ కూచుని ఉన్నాడు.

అతడిని చూడగానే సాంబశివం ముఖం కఠినంగా మారి పోయింది.

"ఎందుకొచ్చావ్ ?"

"ఎందుకేమిటీ ? నా కూతుర్ని నేను తీసుకు పోదామని వచ్చాను!"

"వీల్లేదు!"

"నువ్వెవడివి వీల్లేదనడానికి ? పెళ్ళికాని పిల్లని పరాయి ఇంటో ఎంత కాలం ఉంచను? నాకు పరువు నష్టం కాదూ?"

"నోర్ముయ్! వాగకు"

"ప్రసూనను తీసుకుపోతాను."

"తీసుకపోనివ్వను."

"అయితే కోర్టులో కేసు పెడతాను. అక్కడే అన్ని సమాధానాలు చెప్పుదువుగాని."

పొగరుగా లేచారు హరి.

"కూచో ఎంత కావాలి?"

కోపాన్ని శాయ శక్తులా అణుచుకుంటూ అడిగాడు సాంబశివం.

హరి నవ్వాడు, వెక్కిరిస్తున్నట్లు.

"ఎంతోనా? అయిదువేలు చాలు!"

వెంటనే చెక్ రాసి ఇచ్చాడు.

"జాగ్రత్త నీవత్తిడి శృతిమించి రాగాన పడితే నేను మరో మార్గం ఆలోచించ వలసి వస్తుంది."

హరి ముఖంలో బెదురుకనిపించింది.

"నా ఇబ్బంది నువ్వు కనిపెట్టి చూస్తే నేనెందుకొస్తాను? నువ్వు నన్ను మరచిపోతే గుర్తు చెయ్య వలసి వచ్చింది."

"అంటే! నాకు మాత్రం మంచి, మర్యాదా తెలియవా?"

నవ్వుతూనే వెళ్ళిపోయాడు హరి.

హరి అలా వెళ్ళగానే కూలిపోయాడు సాంబశివం. అతని ముఖంలో ఎక్కడలేని దైన్యమూ కనిపించింది. చూడలేకపోయింది ప్రసూన. ఎప్పటి నుండో అడగాలనుకుంటున్నది అడిగేసింది.

"మీరు మానాన్న కెందుకింతగా భయపడటం.? మీరు నన్ను పంపనంటే, నేను వెళ్ళనంటే, ఆయన ఏం చెయ్యగలరు."

ప్రసూన మాట్లాడుతున్నది ఏమిటో అర్థం కానట్లు అయోమయంగా చూశాడు సాంబశివం. త్వరలోనే కోలుకున్నాడు.

"ఇడియట్! వాడికి నేను భయపడతానా? కాని ఛండాలుడు. కసితో నిన్ను ఎంచేస్తాడోనని.... దేనికైనా వెనుకాడని దరిద్రుడు."

ఎవరికీ భయపడని సాంబశివం తన తండ్రికి భయపడటం కేవలం తన కోసమేనా ?

(సశేషం)



మన కొత్తమంత్రులు



శ్రీ ఆర్. నారపరెడ్డి

శ్రీ రొండా నారపరెడ్డి, 1922 ఆగస్టు 28న గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని వందిళ్ళపల్లిలో జన్మించారు. 1936 నుండి 1941 వరకు విద్యార్థి ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగానూ, రాష్ట్ర ఫెడరేషన్ కార్యనిర్వాహక సభ్యులుగానూ పనిచేశారు.


1942 నుండి కిసాన్‌సభ సభ్యులుగానూ, బాపట్ల తాలూకా యువజన లీగ్ అధ్యక్షులుగానూ వ్యవహరించారు. 1946 నుండి గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘం సభ్యులుగా ఉన్నారు. పి.సి.సి. ఉపాధ్యక్షులుగానూ, కార్యదర్శిగానూ వ్యవహరించారు.

శ్రీ నారపరెడ్డి, 1957 నుండి 1962 వరకు పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. 19·7 నుండి కేంద్ర పొగాకు సంఘం సభ్యులుగా పనిచేశారు. 1964 నుండి 1967 వరకు గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘం అధ్యక్షులుగా పనిచేశారు.

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగానూ గుంటూరు జిల్లాపరిషత్ సభ్యులుగానూ వ్యవహరించారు. గుంటూరు జిల్లా పొగాకు ప్రోసెసింగ్, మార్కెటింగ్ సంఘం అధ్యక్షులుగానూ గుంటూరు సహకార మార్కెటింగ్ సంఘం డైరెక్టర్‌గానూ వ్యవహరించారు.

ఆయన ప్రదేశ్ కాంగ్రెస్ సంఘం సభ్యులుగానూ, ఆంధ్ర ప్రదేశ్ లఘు పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టరుగానూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు.

శ్రీ రెడ్డి 1960లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. జాతీయ లఘు పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టరుగా కూడా వ్యవహరించారు. 1969లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.



శ్రీ ఎమ్. మానిక్‌రావు

శ్రీ ఎమ్. మానిక్‌రావు, 1931 సెప్టెంబరు 6వ తేదీన గుల్బర్గా జిల్లాలోని మాల్ఖేడ్ గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. యువజనోద్యమంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామస్థాయిలోనూ తాలూకాస్థాయిలోనూ యువక సమితులను విజయవంతంగా నిర్వహించి యువక సామ్రాట్ బిరుదు పొందారు. హైదరాబాద్‌లోని వివేకవర్ధని ఉన్నతపాఠశాలలో విద్యనభ్యసించారు. విద్యార్థిదశ తొలిరోజులలో విద్యార్థి నాయకునిగా చురుకుగా పనిచేశారు. స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో రెండుసార్లు అరెస్టు అయినారు. 1946—47లో విద్యాభ్యాసం విడిచిపెట్టారు.

1959లో తాండూరు పంచాయతీసమితి అధ్యక్షులుగా శ్రీ మానిక్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. 1962లో హైదరాబాదు



జిల్లాపరిషత్ ఉపాధ్యక్షులుగా ఉన్నారు. 1959లో హైదరాబాదు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి శాసనమండలికి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. తాండూరు నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో శాసన సభకు ఎన్నికైనారు. 1972 సాధారణ ఎన్నికలో అదే నియోజకవర్గంనుండి పోటీలేకుండా ఎన్నికైనారు.

శ్రీ మానిక్‌రావు రాష్ట్రగనుల కార్పొరేషన్ డైరెక్టరుగా వ్యవహరించారు. చేతిపనుల మండలి, యితర అనేక సహకార సంఘాలు, సంస్థలతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉంది.

1971లో శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గంలో మునిసిపల్ పరిపాలనా శాఖను నిర్వహించారు. 1972 సాధారణ ఎన్నికల తర్వాత పునర్నిర్మించబడిన మంత్రివర్గంలో ఆయన అదే శాఖను కొనసాగించారు.



శ్రీ కొమ్మూరి అప్పడు దొర

శ్రీ కొమ్మూరి అప్పడు దొర, 1910లో విశాఖపట్టణం జిల్లా భోగాపురంలో జన్మించారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజులలో 1931లో కాంగ్రెసులో చేరారు.

ఆ సంస్థలో ఎన్నో పదవులను ఆయన నిర్వహించారు. ఆయన జిల్లా కాంగ్రెసు సంఘం అధ్యక్షులుగానూ, ప్రదేశ్ కాంగ్రెసు సంఘం సభ్యులుగానూ వ్యవహరించారు. శ్రీ దొర 1958 నుండి 1962 వరకు శాసనమండలి సభ్యులుగా ఉన్నారు. శ్రీ దొర ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ సహకారోద్యమ వాది. ఆయన విశాఖజిల్లా భూమి తనఖా బ్యాంకు డైరెక్టరుగా వ్యవహరించారు. ముఖ్యంగా వ్యవసాయదారులకు ఉపయోగపడే అనేక సహకార సంఘాల అభివృద్ధికి ఆయన కృషి చేశారు.

శ్రీ అప్పడు దొర 1972లో జరిగిన సాధారణ ఎన్నికలలో విశాఖ పట్టణం జిల్లా భోగాపురం నియోజకవర్గంనుండి కాంగ్రెసు టిక్కెటుపై శాసనసభకు ఎన్నికైనారు.




శ్రీ కె. రాంరెడ్డి

శ్రీ కె. రాంరెడ్డి 1940 జూన్ 20వ తేదీన హైదరాబాదు జిల్లా పర్గి తాలూకాలోని మహ్మదాబాదులో జన్మించారు. 1961లో న్యాయశాస్త్రపట్టా తీసుకున్నారు. ఆయన కళాశాలలో చదివే రోజులలో విద్యార్థి కార్యక్రమాలలోనూ, క్రీడలలోనూ చురుకుగా పాల్గొన్నారు. యువజన కాంగ్రెసు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి, జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. జాతీయవాది అయిన శ్రీ రెడ్డి ఈ ప్రాంతంలో కాంగ్రెసు నిర్వహించిన వివిధ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు.

శ్రీ రెడ్డి, 1967లో ప్రప్రథమంగా కాంగ్రెసు టిక్కెట్టుపై శాసనసభకు ఎన్నికైనారు. 1972 మార్చి వరకు చీఫ్‌విప్‌గా వ్యవహరించారు.

1972 సాధారణ ఎన్నికలలో హైదరాబాదు జిల్లా పర్గి నియోజకవర్గం నుండి కాంగ్రెసు టిక్కెట్టుపై ఎన్నికైనారు.



శ్రీ పళ్ల వెంకటరావు

శ్రీ పి. వెంకటరావు, 1916 డిసెంబరు 16న తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం తాలూకాలోని తానేలంకలో జన్మించారు. ఆయన ప్రముఖ జాతీయవాది. స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా జరిగిన సమయంలో 1930 ప్రాంతంలో ఆయన కాంగ్రెసుతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు.

శ్రీ రావు ప్రసిద్ధ సహకారవాది. రాష్ట్రంలోని అనేక సహకార సంస్థల అభివృద్ధికి కృషిచేశారు. సహకార శిక్షణ సంస్థ సభ్యునిగా, ఢిల్లీలోని జాతీయ సహకార సంఘం డైరెక్టరుగా ఈ రాష్ట్రంలో సహకార ఉద్యమ పెంపుదలకు ప్రశంసార్హమైన, ప్రతిభావంతమైన కృషి చేశారు.

ఆయన అమలాపురంలోని కేంద్రబ్యాంకుకు డైరెక్టర్‌గా వ్యవహరించారు జాతీయ కొబ్బరి అభివృద్ధి మండలితోనూ, మత్స్య పరిశ్రమ కేంద్ర మండలితోనూ సన్నిహిత సంబంధం కలిగి వున్నారు.

శ్రీరావు 1972 ఎన్నికలలో కాంగ్రెసు టిక్కెటుపై చెయ్యేరు నియోజక వర్గం నుండి అసెంబ్లీకి ఎన్నికైనారు.



శ్రీ లక్ష్మీనారాయణ యాదవ్

37 సంవత్సరాల యువకులైన శ్రీ లక్ష్మీనారాయణ యాదవ్ హెంజర్లలో జన్మించారు, నర్సాపూర్ తాలూకా శివనగర్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. ఆ తర్వాత సికింద్రాబాదులోని మహబూబ్ కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. హైదరాబాదులోని నిజాం కళాశాల నుండి పట్టభద్రులైనారు.

ఆయన కళాశాలలో చదివే రోజులలో విద్యార్థి కార్యక్రమాలలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. జాతీయవాది అయిన శ్రీ యాదవ్ కార్మిక సంఘాల ఉద్యమాన్ని నిర్వహించి వాటిలో ప్రముఖ పాత్ర వహించారు. హమాల్ సంఘాలకు ఆయన అధ్యక్షులుగా వ్యవహరించారు. యాల్విన్స్, ఎస్సెస్టాన్స్, బయోకెమికల్స్ మొదలైన వాటిలో ఐ.ఎన్.టి.యుసి.లను నిర్వహించారు. ఆయన కృషి ఫలితంగా కార్మిక సంఘాల ఉద్యమం ఆరోగ్యప్రదమైన మార్గాలలో పయనిస్తూ ఈ ప్రాంతంలో కార్మిక సంక్షేమానికి దారితీసింది.

శ్రీ లక్ష్మీనారాయణ యాదవ్ 1972 జూలైలో శాసనసభ నుంచి శాసనమండలికి ఎన్నికైనారు.

మరి కొందరు 'రానీయండి. నీళ్లులేక పోతే ఏం చేస్తారు!' అన్నారు.

ఎక్కడ నలుగురు కనిపించినా ఇదే చర్చ. చౌదరి, రమేశ్ మాత్రం మౌనం వహించారు. ముందు చౌదరి అభిప్రాయం తెలుసుకొని దానికి వ్యతిరేకంగా చేదామని రమేశ్ అనుకున్నాడు. కాని చౌదరి రాజకీయాలలో దిట్ట కాబట్టి ముందు బయటపడలేదు.

ప్రత్యక్షంగా హరిజనులతో తగాదా ఎవరికీ ఇష్టం లేదు ఇద్దరిలో. చట్టం తమకు వ్యతిరేకమని తెలుసు.

అయినా నీటి ఎద్దడి ఎన్నాళ్లు ఉంటుంది. ఒక నెల గడిస్తే వానలు పడతాయి. అప్పుడు వాళ్లు ఎలాగూ ఇంత దూరంరారు! సమస్య అదే సమసిపోతుంది. చౌదరి! రమేశ్ ఇద్దరూ మౌనంగా వుండటమే క్షేమమనే నిర్ణయానికి వచ్చారు, విచిత్రంగా!.

కాని మరునాడు అనుకోని సంఘటన జరిగింది. మంగి, రత్తి, సుబ్బి నీళ్లకు వెళ్లే సరికి కావమ్మగారు బావి దగ్గర స్నానంచేస్తున్నారు. మడి బట్టలతోనే నీళ్లు చేదుకుంటున్నారు.

ఇంతలో మంగీ, సుబ్బి, రత్తి వెళ్లారు. తాగాడికి ఇవతల అంగవేసి తోడుకోబోయింది రత్తి

కావమ్మ గారికి కోపం వచ్చింది 'ఆగండే, ఆగండి! ఏమిటా తొందర? మడినీళ్లు తోడుకోనివ్వరా ఏమిటి?' అన్నది.

రత్తికి కూడ తొందర ఎక్కువ. 'మేము ఇటు నుంచి తోడుకుంటుంటే ఏంపోయిందమ్మా! మావీ, మడి నీళ్లే' అంది.

'కళ్లు నెత్తికెక్కి నాయేమే ముండా! ఆగమంటే ఆగరేం?' అరిచింది కావమ్మగారు.

'దాని మాటలకేంటి అమ్మగారూ తోడుకోండి నీళ్లు! మాకు మాత్రం తెలియదా ఏంది?' అంటూ రత్తిని మందలించి, తాగాటి మీదనుంచి వెనక్కు లాగింది మంగి.

ఇంతలో కోటయ్య బుంగ-తాడు తీసికొని నీళ్లకు వచ్చాడు.

వస్తూనే 'ఏందే, ముండల్లారా! తగాదాలాడుతున్నారు?' అన్నాడు. 'ముండాగిండా అని తిడతా వెందుకయ్యా! మేమేం చేశామని ఇప్పుడు?' అన్నది మంగి.

'మేమేం చేశామంటావేమీ! ఇప్పుడేగా నేను మడి నీళ్లు తోడుకొనే దాక ఆగమంటే, ఆగకుండా ఎగబడ్డది!, అన్నది కావమ్మగారు.

'అదేదో పిల్లదాని మాటల కేందమ్మగారూ!' సర్ది చెప్పటానికి ప్రయత్నిస్తూ అన్నది మంగి.

'ఎంత పొగరే మీకు! మాలాంటి వాళ్ళం కూడ అమ్మగారు మడి నీళ్ళు తోడుకుంటుంటే దూరంగా నిలబడుతాం! అటువంటిది బావి మీదకి ఎగబడుతావుటే, ముండా!' అంటూ చేతిలోని చేంతాడు మంగి మీదకు కసిగా విసిరి గుంజాడు.

మంగి బావి అంచున నిలబడ్డదేమో అదాటున తగిలిన చేంతాడు చుట్టుకొని ముందుకు తూలి బావిలో పడ్డది.

ఎత్తు మీదనించి పడటంలో రాతికి తలతగిలి రక్తం నీళ్ళ నిండా కావటం మొదలయింది!

నిజానికి కోటయ్య ఎప్పుడూ మడి నీళ్లు తోడుకొనే టప్పుడు దూరంగా నిలబడలేదు. అయినా ఈ రోజు హరిజనులను చూసే సరికి వొళ్లుమండి తాడు విసిరాడు. మంగిని బావిలోకి తోయటం, కోటయ్య ఉద్దేశ్యం కాదు. కాని మంగి మాత్రం పడిపోయింది!

అనుకోని ఈ సంఘటనకు కోటయ్య అదిరిపోయాడు! కోటయ్యకు ఈత రాదు. భయం పుట్టింది! కావమ్మగారు, సుబ్బి, రత్తి పెద్దగా కేకలు వేయసాగారు. కోటయ్య పారిపోయాడు!

అరుపులు విని జనం వచ్చేసరికే మంగి ప్రాణాలు పోయాయి.

—21—

మంగి మరణవార్త హరిజనవాడలోనూ, ఊళ్లోనూ పెద్ద సంచలనం కలిగించింది.

హరిజనులు కర్రలు తీసికొని బయలుదేరారు. దెబ్బకు దెబ్బ తీస్తాము అని పరిగెత్తారు. ప్రకాశం వాళ్ళని ఎంతో కష్టం మీద ఆపగలిగాడు.

ప్రకాశం గనుక అడ్డుకోకపోయినట్లయితే అందరూ కోటయ్య ఇంటి మీద పడేవారే!

* * * *

కోటయ్య వెళ్లి రమేశ్ కాళ్లమీద పడ్డాడు!

'ఎలాగయినా ఈ కష్టం గట్టెక్కించండి బాబూ!' ప్రాధేయపడ్డాడు!

రమేశ్‌కి కోటయ్యను చూస్తే జాలివేసింది! హరిజనులు అట్లా బరితెగించి నీళ్లకు రావటం సవర్ణులకు మనసులో ఇష్టం లేదు! మనసులో అందరూ 'కోటయ్య మంచిపని చేశాడు' అనే అనుకున్నారు. కాని పైకి మాత్రం బాహాటంగా అందరు కోటయ్య చేసిన పనిని ఖండించారు!

'నా వొక్కడివల్లా ఏంలేదు కోటయ్యా! అవతలి పార్టీని కూడ కూడగట్టుక రావాలి' అన్నాడు రమేశ్.

'ఆ పని నాకు వొదిలెయ్యండి బాబూ! మీరు మాత్రం సహాయం చేయాలి!' బతిమాలాడు కోటయ్య.

రమేశ్ దగ్గర హామీ పుచ్చుకొని, చౌదరి దగ్గరకు వెళ్ళాడు కోటయ్య.

'బాబూ! దాన్ని కావాలని బావిలోకి తొయ్యలేదు! తొందరపాటులో చేయిజారింది. మనం వూరుకుంటే మరీ వూరిమీదకి ఎగబడతారని కోపం పట్టలేక తొందరపడ్డాను. మీకు తెలియనిది ఏమున్నది. మీకూ తప్పలేదు గదా కష్టాలు! రక్షించండి!' అని మొరపెట్టుకున్నాడు కోటయ్య.

చౌదరికి కోటయ్య చేసిన పనికి సంతోషంగానే వుంది. ఈ వేళ వూరుకుంటే రేపు ఇంకా ఎగబడతారు. ఆ దాసుని చేర దీసినందుకు తను తగిన శిక్ష అనుభవిస్తూనే వున్నాడు : కాని బాహాటంగా హరిజనులను ఏమిచెయ్యటానికి వీలులేకుండ పోతున్నది. కోటయ్యను కాపాడవలసిన బాధ్యత నైతికంగా తన మీద ఉన్నదని భావించాడు చౌదరి.

'ముందు రమేష్‌నూ, కూడగిట్టుకో కోటయ్యా! నాకు చేతనయినది నేను చేస్తాను :' హామీ ఇచ్చాడు చౌదరి.

'రమేష్ బాబుకూడ సహాయం చేస్తామన్నారండీ !' అన్నాడు కోటయ్య.

మున్సబు పోలీసులకు రిపోర్టు ఇచ్చాడు. నాలుగు రాళ్లు కళ్ళ చూడటానికి మంచి అవకాశం చిక్కింది పోలీసులకు. స్వరాజ్యం వచ్చినా పోలీసులలో కొందరి మనస్తత్వం మారలేదు.

మంగి మొగుడు గంగుల్ని పిలిపించారు.

ఇలాంటప్పుడు వేదాంతం బాగా పనిచేస్తుంది.

'మంగికి భూమి మీద నూకలు తీరిపోయాయి గంగులూ ! పుణ్యాత్మురాలు కాబట్టే దేవుడి బావిలో ప్రాణం పోయింది' అన్నాడు చౌదరి.

'ఇప్పుడు కోటయ్యను శిక్షించినా, చచ్చిన మంగి బ్రతికిరాదు కదా : ఏదో ఇంత తీసికొని గ్రామంలోనే సరిపుచ్చుకోవటం మంచిది గంగులూ.' సలహా ఇచ్చాడు రమేష్.

'పెద్దలు చెప్పినట్టు వినకపోతే శవాన్ని బస్తీకి తీసికొని పోయి శవ పరీక్ష జరిపించాలిసివస్తుంది'. బెదిరింపుగా అన్నాడు పోలీసు ఇనస్పెక్టరు.

శవాన్ని కోయించటానికి గంగులు తరపున మనుష్యులు వొప్పుకోలేదు :

'పోయిన ప్రాణం రాదు గదా బాబూ! తమరే ఏదో సెటిలు చేయించండి' అన్నాడు గంగులు ఇనస్పెక్టరు వైపు చూసి.

ప్రకాశానికి ఈ బేరాలు అసలు ఇష్టంలేదు : గంగుల్ని వశపరచుకొని ఏదో కేసులేకుండా చేయటానికి ప్రయత్నం చేస్తున్నారు అందరూ : కోటయ్య ఇటు రమేష్‌ను, చౌదరినీ, మున్సబునీ అందర్నీ కట్టుకున్నాడు.

గంగులు శవపరీక్షకు ససేమిరా ఒప్పుకోలేదు : ప్రకాశం కూడ రాజీకి తప్పనిసరిగా ఒప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడది !

గ్రామీణ ప్రజలకు శవ పరీక్ష అంటే వుండే భయాన్ని ఇనస్పెక్టర్ చక్కగా వినియోగించుకున్నాడు.

ప్రకాశానికి అసలు సమస్యకు పరిష్కారం కుదిరినట్లు అనిపించలేదు.

అసలు ప్రధాన సమస్య హరిజనులకు బావిలో నీళ్లు తోడుకునే హక్కుకావాలి. చట్టరీత్యా వాళ్ళకు హక్కువున్నా గ్రామస్థులు వాళ్లను దూరంగానే వుంచుతున్నారు. మంగి చావుకూడ అందులో భాగమే :

అంతకంటే ముఖ్యమైనది హరిజన వాడకు బావిలేదు. బావి త్రవ్వించే ప్రయత్నం జరగాలి.

ఈ రెండూ సాధించితే మంగి త్యాగం ఫలించినట్టే:

ఇనస్పెక్టర్ చౌదరిని, రమేష్‌ను, మున్సబునూ, ప్రకాశాన్ని, కోటయ్యనూ, గంగునూ సమావేశపరిచాడు.

ప్రకాశం తన అభిప్రాయాలు వివరించాడు.

చౌదరి, రమేష్‌లు హరిజనులకు బావినీళ్లు తీసుకునే హక్కు వున్నదని ఒప్పుకున్నారు.

చివరకు రమేష్ అన్నాడు.

'ఇకముందు ఇలాంటి ఘర్షణలు జరగకుండా కొన్ని టైమింగ్స్ పెట్టుకుంటే మంచిది :'

'ఉదయం సాయంత్రం గ్రామస్థులు నీళ్ళకు వస్తారు కాబట్టి మధ్యాహ్నం హరిజనులకు వదలిపెడదాం.' అన్నాడు చౌదరి.

చౌదరి, రమేష్ ఆ ఇద్దరూ ఒకటే అనిపించింది ప్రకాశానికి: ఇద్దరి లక్ష్యం ఒక్కటే, హరిజనులను దూరంగా వుంచటమే : లేకపోతే హక్కు వున్నదని ఒప్పుకుంటూ హరిజనులకు విడిగా 'టైమ్' కేటాయించటంలో అర్థం ఏమిటి ? ప్రకాశం వ్యతిరేకించాడుగాని, చివరకు ఒప్పుకోక తప్పలేదు :

హరిజనులకు మధ్యాహ్నం పన్నెండు గంటలనుండి మూడు గంటల దాకా టైము ఇచ్చారు, ఆ సమయంలో నీటికి రావటం ఎంత కష్టమో ప్రకాశానికి తెలుసు. అయినా తప్పలేదు. ప్రజల హృదయాలలో పరివర్తన రావాలికాని ఎన్ని చట్టాలువున్నా ఫలితంశూన్యం:

గంగులుకి అయిదు వందలు ఇచ్చేట్టు కోటయ్యచేత వొప్పించారు.

శవాన్ని వూరేగింపు చేసికోవచ్చును.

హరిజనవాడలో బావి త్రవ్వితే సమస్యకు శాశ్వతంగా పరిష్కారం కుదురుతుంది. కాని దానికి ఎవరూ సుముఖంగాలేరు.

ప్రకాశం బావికోసం పట్టుబట్టాడు.

'గవర్నమెంటునుంచి సహాయానికి ప్రయత్నం చేస్తాను' అన్నాడు రమేష్.

'ఇంకేం అప్పుడు చూసుకోండి!' అన్నాడు ఇనస్పెక్టర్.

'కాదు : ఇప్పుడే కొంత సహాయంచేస్తే బావి నిర్మాణం పూర్తి అవుతుంది : అంతగా ప్రభుత్వ సహాయం వస్తే మరొక బావి త్రవ్వించవచ్చును' అన్నాడు ప్రకాశం.

(సశేషం)

అఖిలభారత

చిత్రకళా ప్రదర్శన

—శ్రీ రావినూతల శ్రీరాములు

బాలలలో చిత్రకళాభిరుచిని పెంపొందచేస్తున్న సంస్థలలో తెనాలి సమీపంలోని వెల్లటూరు నవరంగ్ చిత్రకళా నికేతన్ ప్రధానమైనది.

ప్రతి సంవత్సరం మే నెలలో చిత్రకళా ప్రదర్శనలు వీరు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 7వ అఖిల భారత బాలల చిత్రకళా పోటీల్లో 18 రాష్ట్రాలకు చెందిన 2,009 మంది బాలలు పాల్గొన్నారు. 2,400 చిత్రాలు పోటీకి వచ్చినవి.


చిత్రణకు ఇతివృత్త విషయంలో రెండు సీరీసులు నిర్ణయించారు. 'ఎ' సీరీసులో స్వేచ్ఛగా వేనిని గూర్చి అయినా చిత్రాలు రచించ వచ్చు. "బి" సీరీసులో మాత్రం బుద్ధుని జాతక కథలను గూర్చిన చిత్రాలే పంపాల్సి వుంది.

వయస్సును బట్టి బాలలను ఆరు నుండి పదిహేడు సంవత్సరాల వరకు వర్గీకరించి బహుమతులను ఇచ్చారు.

"దేవుని ఊరేగింపు" చిత్రం అత్యుత్తమమైనదిగా ఎంపిక అయినది. దీనిని చిత్రించిన బరోడా హైస్కూలు విద్యార్థి ముఖేశ్ ఎస్. పాంచాల్(16)కు స్వర్ణపతకం లభించింది.



"కుండల బేరం"
చిత్రం : శ్రీ పి. భాస్కర్, భీమవరం



"వినాయకుని ఊరేగింపు"
(చిత్రం : చిరంజీవి ఎం.ఎస్. పాంచాల్, బరోడా)

"ఎ" సీరీస్‌లో అయిదు రజిత పతకాలను క్రింద తెలిపిన వారికి బహూకరించారు.

అనకాపల్లికి చెందిన యం. రోజా 'బుర్ర కథ', బరోడాకు చెందిన హీనానాగా "ప్రిమిటివ్స్", గుంటూరుకు చెందిన కవితా చవాన్ "బార్‌గెయిన్", మద్రాసుకు చెందిన కుమారి అనూరాధ "పుష్పాలు," రాజమండ్రికి చెందిన ఎ. వి. యస్. యల్. మూర్తి 'సర్కస్'లకు.

ప్రతివయస్సు గ్రూపులోను మూడు స్థానాలు చొప్పున అన్ని గ్రూపులలోని ఉత్తమ చిత్రాలకు నగదు బహుమతులు ఇవ్వబడినవి.

బాలల చిత్రకళా పోటీతో పాటుగా నాల్గు సంవత్సరాలుగా ఔత్సాహికులకు పోటీ నికేతన్ నిర్వహిస్తున్నది.

ఈ సంవత్సరపు 4వ అఖిల భారత పోటీకి 140 కళాఖండాలు వచ్చినవి. రాజమండ్రి చిత్రకారిణి చిత్రించిన 'వివాహం' అత్యుత్తమంగా ఎన్నికై బంగారు పతకం లభ్యమైనది.

కామెల్ ఆర్టువారి ప్రత్యేక బహుమతులు భీమవరం చిత్రకారుడు భాస్కర్ "కుండలబేరా"నికి, అనకాపల్లికి చెందిన అప్పారావు "పెయింటింగ్ నెం. 2"కు లభించినవి.

ఇవిగాక రజిత పతకాలు ప్రత్యేక బహుమతులు యిచ్చి ఔత్సాహిక చిత్రకారులను ఈ సంస్థ ప్రోత్సహించింది.

మే 29 నుండి 31 వరకు వెల్లటూరులోను, జూన్ మొదటి వారంలో తెనాలి, గుంటూరు పట్టణాలలోను ఈ ప్రదర్శనలను పలువురు సహృదయులు తిలకించారు.

ఈ సంస్థకు ప్రభుత్వం వారు మూడు వేల రూపాయలు గ్రాంటు నిచ్చి ఆదరించినారు. అధిక భాగం ప్రజల విరాళాలపై సభ్యుల చందాలపైన ఆధారపడింది. లలితకళా సంస్థకు అనుబంధింపబడిన నవరంగ్ చిత్రకళా నికేతన్‌ను నూతనంగా ఏర్పాటైన బాలల అకాడమీ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా వున్నది.



స్వర్ణయోగి

పులిచెర్ల సాంబశివరావు

—ఏకాదశ యోగము—

నారాయణ నారాయణ – జయగోవింద హరే
నారాయణ నారాయణ – జయగోపాల హరే
కరుణా పారావార – వరుణాలయ గంభీర
నవ నీరద సంకాశ – కృతకలి కల్మశనాశ ॥నా॥
యమునాతీర విహార – ధృతకౌస్తుభమణిహార
పీతాంబర పరిధాన–సురకల్యాణ విధాన ॥నా॥

నారాయణ స్తోత్రాన్ని చదువుతూ కొందరు భక్తులు నడచి వస్తున్నారు. వాళ్లు పట్టెనామాలు పెట్టుకొని ఉన్నారు. చిన్న అంగ వస్త్రాలు కట్టుకొని ఉన్నారు. వేషం చూడగానే వైష్ణవులని స్పష్టమవుతోంది. భక్తితో పెద్దగా పాడుతున్నారు. అర్ధ నిమీలిత నేత్రాలతో భక్తి పారవశ్యంతో చిందులు తొక్కుతున్నారు.

ఇంతలో వేరొక పక్కనుండి మరి కొందరు భక్తులు వస్తున్నారు. ఈ భక్తులకూ, ఆ భక్తులకూ భేదం ఉంది. వీళ్ళ ఒళ్ళంతా విబూదితో తెల్లగా మెరసిపోతూంది. శివస్తోత్రాలు చేస్తున్నారు. శంఖాలు ఊదుతున్నారు.

ఇరు పక్షాలు ఎదురు పడ్డాయి. ఒకళ్లని చూచి ఒకళ్లకి కోపం వచ్చింది. ఎవళ్ల తప్పూ లేకుండానే కలహం ప్రారంభమైంది.

"ఒరేయ్! బూడిద పూసుకున్న మీ మొహాలు చూస్తేచాలు. పంచమహా పాతకాలు చుట్టుకుంటాయి. ఆ భయంతోనే విసన కఱ్ఱల్ని అడ్డం పెట్టుకుంటున్నాం మాకు దారివ్వండి. ముందు మేం పోవాలి!"

"ఒరేరేయ్! పట్టెనామాలు పెట్టుకున్న మీ మొహాలు చూస్తుంటే బొల్లిగద్దలు గుర్తువస్తున్నాయి. మీకు దారి కావాలట్రా మీ యింట కోడిగాల్చ! మీరే తొలిగిపొండి! తిరుపు పెద్దుల్లాగా ఊరక తిరుగు తున్నారెందుకు? తిరుపణ్యారం దింటూ ఇంటపడి ఉండ గూడదూ? తిరుప గూడ తగిలించుకొని పుచ్చుకుక్కల్లా తిరుపులు గడుతున్నారెందుకూ?"

"ఒరేయ్ పిచ్చి జంగం! ప్రేలకు! మీ దేవునికే గతిలేదు. నీవా మాకు చెప్పేది! అర్ధనారీశ్వరుల్లా ఎక్కడైనా గుట్టు చప్పుడు గాకుండ తినిపడి ఉండక మీకెందుకీ తిప్పలు! మీ తిక్క శంకరయ్య మొనగాడా ఏంటి?"

"కాదు! మీ కన్నయ్యే మొనగాడు!" అని ఆ శైవుడు వ్యంగ్యంగా పలికాడు. దాంతో ఆ వైష్ణవుడు గరుత్మంతునిలాగా విజృంభించాడు.

"ఇంకా వాగావంటె ఈ విసన కఱ్ఱతో నీ ఒళ్లువాయగొడతా. మీ శివుడికే తిండిలేక బిచ్చమెత్తుకొంటూంటే, మీకెందుకీ ఆర్భాటం?"

"మీ దేవుడు తక్కువా? బలి చక్రవర్తి దగ్గర అడుక్కోలేదా! బుద్ధి లేదంట్రా?"

"ఎవడికిరా బుద్ధిలేంది? బుద్ధిలేకే మీ శంకరుడు జింకను చంకలో పెట్టుకోవడం!"

"మా శంకరుడు శంకలేక జింక కోసం వనవాసం పోలేదుగా!"

"మీవాడు సగం ఆడు రూపం!"
"మీవాడు మోహినీ రూపం ఎత్తలా!"
"మీ దేవుడు బ్రహ్మ తల తుంచాడు! పాపి!!"
"పాపం మీవాడు రావణ బ్రహ్మను చంపలా?"
"మీ ఎద్దునెక్కే స్వామి వళ్లంతా పాములే!"
"మీ గద్దనెక్కే స్వామి ఉండేది పాము మీదేగదా!"

"పిచ్చిగా వాగవద్దు! మీ ఆరోగ్యానికది మంచిది కాదు! మీ శివుడు పిచ్చి ఎక్కే ముసలి ఎద్దునెక్కి తిరుగుతాడు!"

"మీ పిచ్చి ప్రభువు ఆపుల కాపరి:"

దీంతో వైష్ణవులకు కోపం వచ్చింది. శైవులకు శివమెత్తింది. తమ వీరత్వాన్ని ప్రదర్శిస్తూ చేతుల్లోని గంటలను ఎత్తి వైష్ణవుల నున్నని తలమీద మోదారు. వైష్ణవులు విసనకర్రలను కవచాలు జేసికొనిన శైవులను చిత్తం వచ్చిన రీతిని బాదారు.

ఇంతలో వేమన్న శిష్య సమేతుడై అక్కడకు వచ్చాడు.

ఆ అద్భుత దివ్యమూర్తిని తిలకించి ఇరుమతాల వాళ్లు పరవశులై, కలహం మాని కన్నులప్పగించి చూడటం మొదలు పెట్టారు. ఆ మహాత్మునిలో వైష్ణవులకు విష్ణుమూర్తి కనిపించాడు. ఆ దివ్యమూర్తిలో శైవులు శంకరుని చూశారు.

"విశ్వదాభి రామా! ఏమి ఈ జనసమూహం! ఈ వైష్ణవులనూ, శైవులనూ ఒక్కచోట చూడటం ఆశ్చర్యకరమే! ఎప్పుడూ వీరిలాగే ఉంటే ఎంత బాగుండును!"

"స్వామీ! మత దురభిమానంతో ఒకరి నొకరి నిందించు కొంటూ కొట్టుకుంటున్నారు. ఇట్టి మూర్ఖులకు బుద్ధి ఎలా వస్తుంది? మతకలహాలెలా మానుతారు?"

వేమన్న వారివైపు చూశాడు. ఆ చూపులలోని అద్భుత శక్తికి చకితులవుతూ అందరూ మోకరిలారు. వేమన్న పెదవులు కదిలాయి. వాగమృతం కురిసింది.

"విష్ణు భక్తులెల్ల వెలిబూది పాలైరి
వాదమేల మత విభేద మేల?
తెలియ లింగ ధరులు తిరుమణిపాలైరి!
విశ్వదాభి రామ వినుర వేమ!"

వేమన్న హితబోధ విని జనులందరూ సాష్టాంగపడి, లెంపలు వేసుకున్నారు. తాము చేసిన తప్పులకు పశ్చాత్తాప పడ్డారు. వైష్ణవులూ శైవులూకలసి వేమన చెంత కూర్చున్నారు.

"స్వామీ! మీపాద తీర్థమును ప్రసాదిస్తే దానిని స్వీకరించి మా జన్మలను సార్థకం చేసుకుంటాం!"

"ఊరి నడిమి బావి యుదకంబుగొని తెచ్చి
పాదతీర్థ మనుచు భ్రమయజేయ
పాదతీర్థమన్న ఫలమేమి కద్దురా?
విశ్వదాభి రామ వినుర వేమ!"

ఈ పలుకులు విని ఆ భక్తులు సిగ్గుపడి తమ మూఢత్వాన్ని వదిలారు.

దినదినానికీ వేమన కీర్తి చంద్రికలు దేశమంతా విస్తరిస్తున్నయి. నానా దేశాలనుండి ప్రజలు వచ్చి ఆ మహానుభావుని వాగమృతాన్ని స్వీకరించి ధన్యులవుతున్నారు. ఆయన ఒకచోట ఉండేవాడు కాడనీ, దేశసంచారం చేస్తుంటాడనీ తెలిసికొని ఆయన రాకకై మరికొందరు ఎదురు చూస్తున్నారు.

ఇలా ఎదురుతెన్నులు చూస్తున్న వారిలో నరసాంబ ఒక్కతె!

రాచవేముని మరణానంతరం కొండవీడు శత్రువుల చేతిలో పడింది. ఉత్తరదిక్కునుండి గజపతులు దండెత్తారు. దక్షిణ దిశనుండి విజయనగరరాజులు విక్రమించారు. కొండవీటి సామ్రాజ్యం ముక్కచెక్కలయింది. రెడ్డిరాజ్య ప్రాభవం అంతరించింది.

మామగారి మరణం, పతిదేవుని హత్యా నరసాంబను క్రుంగ దీశాయి. కొండవీడు దిక్కులేనిదై నందుకామె విచారింపలేదు. కన్నకుమారుని కంటె ఎక్కువ ప్రేమతో పెంచిన వేమారెడ్డి యోగియై దేశాలుపట్టి పోయినందుకామె పుట్టెడు దుఃఖంలో మునిగింది. కన్న ప్రేమ కంటె పెంచిన ప్రేమ ఎక్కువ గదా!

ఇప్పుడామె గతిలేనిదై, కొండవీటిలోనే ఊరిచివర జీవిస్తూంది. వేమన్న రాకకై దిన మొక యుగంగా కన్నుల్లో వత్తులు వేసికొని ఎదురు చూస్తూంది.

వేమన్న రానే వచ్చాడు!

ఎన్నాళ్లనుండో ఎదురుచూస్తున్న ఘడియ రానే వచ్చింది! అశ్రుపూరములైన నయనాలతో నరసాంబ వేమన్న కెదురు పోయింది.

"బిడ్డా! ఇలా అయిపోయావేమిటి? నా అనే వాళ్లు లేక నేనిలా అనాథనై ఉండగా నీవు దేశాలు పట్టి పోవటం ఏమిన్యాయం? ఇన్నాళ్లకు కనికరం పుట్టిందా బాబూ, ఇకనుండి అయినా ఇంటి పట్టున ఉండు. చూడు! మిస మిస లాడుతుండే నీ శరీరం ఎలా చిక్కి శల్యమైందో! పాలుగారెడి నీ బుగ్గలెలా పీక్కొని పోయాయో! ఆ గుబురు గడ్డం, ఆ కౌపీనం, ఏమిటి తండ్రీ! సకలైశ్వర్యాలతో తులతూగవలసిన వయసున ఈ వైరాగ్యం ఏమిటి నాయనా? ఇప్పటికైనా మించిపోయింది లేదు. కొండవీటి ప్రజలు శత్రువుల పాలనలో విసిగి పోయారు. మరల మన పూర్వప్రాభవం నిలబెట్టు."

"అమ్మా! ఇంకా ఆ యాశతో ఉన్నావా? ఆశయేనమ్మా. దుఃఖానికి మూలము! ఆశలేనినాడు జగమంతా ఆనందమయ మవుతుందమ్మా!"

"వేమా! నువ్వువచ్చి నాదుఃఖాన్ని పోగొడతావని, నాకొక మార్గం ఏర్పడుతుందని పుట్టెడాశతో ఉన్నాను!"

"నీ కొక మార్గం చూపటానికే నమ్మా నేను వచ్చాను!"

"నాయనా! నీపై నేను పెంచుకున్న ఆశలన్నీ అడియాశలు కావలసిందేనా?"

"తల్లీ! గాలిలేని దీప కళిక చందాన, అలలు లేని జలధి వలె, నిశ్చలాత్మతో, నిర్వికారంగా కాలం గడుపు!"

"అవన్నీ నాకేం తెలుసు నాయనా!"

"అమ్మా! నీరు ముత్యమవుతుంది! ముత్యం నీరుగా మారదు! దీనిని బట్టి జీవాత్మ భేదం తెలుసుకో! నిర్మల భావం ఉంటే బ్రహ్మ భావం పొందవచ్చు. తిరిగి జీవత్వం రాదు.

ముందుగా తప్పొప్పులను తెలిసికోవాలి. తరువాత భగవంతుని కీర్తించాలి. ఇతరులను నిందింపకూడదు. నీతిగా ప్రవర్తించాలి తత్వాన్ని తెలిసికోవాలి. ఇతరులు తిట్టినా కొట్టినా తిరిగి మాటాడక, బెదరక తనను కానియట్లుగా ఉండాలి. పాలలో పులుసు కలిపితే పాలు విరిగి పోతాయి. ఇలాగే ఆశవలన తెలివి చెడిపోతుంది. అమ్మా! ఈ ఆశను వదులు. నా కర్తవ్యమింకా ఉంది. నన్ను గూర్చి దిగులు మాను. తల్లీ! అటు చూడు! నీవంటి అనాథలీ లోకంలో ఎందరు ఉన్నారో! వారికెవరు దిక్కు? నీకు నాపై గల ప్రేమను వారికి ప్రసాదించు!"

ఈ పలుకులు విని నరసాంబ నివ్వెర పోయింది. వేమన్న మాటలామె మనసును మార్చాయి. ఆమె నిశ్చయం సడలింది.

"వేమన్నా! ఇప్పుడు తెలిసింది! నీవు సామాన్యుడవుకావు. పతనమవుతున్న ప్రపంచాన్ని ఉద్ధరించటానికి ఉద్భవించిన అవతార మూర్తివి నువ్వు! అన్నా! నువ్వు చెప్పినట్లే ప్రవర్తిస్తాను. ఈ అథో జగత్సహోదరులను రక్షిస్తూ ఇక్కడే ఉంటాను! నీ లోక యాత్రను నీవు సాగింపు నాయనా!"

వేమన వదిన గారిని వీడి కొండ వీటిలో అలాగే సంచరిస్తున్నాడు.

మిట్ట మధ్యాహ్నమైంది.

ఒకచోట——

ఆ యెండలో ఒక వృద్ధుడున్నాడు పండిపోయిన ఆయన మొగము, తీక్షణమైన చూపులు చూస్తే ఒక మహావ్యక్తి వలె అని పిస్తున్నాడు ఆయన భుజంమీద పెద్ద రాతిగుండు ఉంది. కర చరణములు శృంఖలాబద్ధములై ఉన్నాయి. చుట్టూ కొందరు భటులున్నారు. ఈ శిక్ష చూచి విశ్వదాభిరామయ్య ఆశ్చర్య పోయాడు.

"స్వామీ! ఆ వృద్ధుడెవడో గొప్పవానిలాగా ఉన్నాడు. మహాకవిలాగా ఉన్నాడు. ఇంత మహాత్మున కింతటి దురవస్థ ఏమిటి?"

"విశ్వదాభిరామా! ఆయన శ్రీనాథమహాకవి!"

శ్రీనాథమహాకవా! అయ్యో! అమృతోపమానమైన తన కవితాధారచే ఆంధ్రులను ఉర్రూత లూగించిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు!"

శ్రీనాథుని మొగమున విచారంలేదు. ఆయన ఏదో మధుర స్మృతులలో ఉన్నాడు. ఏమో ఊహించుకొని తల ఊపుతున్నాడు. పెదవుల వెంట ఆశువుగా పద్యం వెలువడుతూంది!

"కవిరాజు కంఠంబు కౌగలించెనుగదా
పురవీధి నెదురెండ పొగడ దండ
ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మంబున
దగిలి యుండెను గదా నిగళ యుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురు గొడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు
కృష్ణ వేణమ్మ గొనిపోయె నింతఫలము
బిల బిలాక్షులు తినిపోయె దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డెరి మోసపోతి
నెట్టు చెల్లింతు టంకంబు లేదు నూర్లు!"

శ్రీనాథ మహాకవి ఆ కఠిన శిక్షను భరింపలేక కూలబడి పోయాడు. నిర్దయతో ఆ యమకింకరుల్లాగా ఉన్న రాజభటులు కొరడాలతో కొడుతున్నారు. కవి సార్వభౌముడు నిలుచున్నాడు.

మరల మధుర స్మృతులు!

ఆయన మస్తిష్కంలో పూర్వ వైభవం మెరిసింది. ఇప్పుడో...తానొక సామాన్యుని కంటె హీనంగా కఠిన శిక్షలను అనుభవిస్తున్నాడు!

"కాశికా విశ్వేశు కలిసె వీరారెడ్డి
రత్నాంబరంబులే రాయడిచ్చు?
రంభ గూడె దెనుంగు రాయరాహుత్తుండు
కస్తూరికే రాజు ప్రస్తుతింతు?
స్వర్గస్థుడయ్యె విస్సన మంత్రి మరి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తి గలదు?
కైలాస గిరి బండె మైలారు విభుడేగి
దిన వెచ్చమే రాజు తీర్పగలడు?
భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె
కలియుగంబున నికనుండ కష్టమనుచు
దివిజ కవివరు గుండెయల్ డిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీ నాథు డమరపురికి!"

శ్రీనాథుడు నేల కూలాడు.

ఆ దృశ్యాన్ని చూచి విశ్వదాభిరాముడు కలవరమంది వేమన్న వైపు చూశాడు.

"విశ్వదాభిరామా! దిగులు పడవద్దు ఆయన కాలం చెల్లింది. ఆంధ్రభాషకు ఆయన చేయవలసినదంతా చేశాడు. పని పూర్తి అయింది. వెళ్ళిపోయాడు! బ్రతికి ఉన్నంతకాలం సుఖంగా గడపటానికి తీవ్ర ప్రయత్నాలు గావించాడీ కవి! కేవలం మానవ ప్రయత్నాలే సుఖదుఃఖాలకు కారణాలు కావని ఈయన చరిత్రం మనకు స్పష్టం చేస్తూంది గదా! ఆ మహాకవి అమరజీవి!"

వేమన్న కొండవీటి నుండి కదిలి 'కదిరి' వైపుకు పోయాడు.

(సశేషం)

గ్రంథసమీక్ష

క్షేత్రయ్య పదసాహిత్యం

(రచయిత . డా. ఎస్. గంగప్ప. ఎం. ఏ., పి. హెచ్. డీ. ప్రకాశకులు : శశీప్రచురణలు, హైద్రాబాద్. వెల : సాదాప్రతి రూ 10-00. మేలు ప్రతి రూ. 12-00. 1/8 డెమ్మీ పుటలు XXVi + 224).

క్షేత్రయ్య పదసాహిత్యమును గూర్చి లోగడ కొన్ని గ్రంథములు వెలువడ్డాయి. వాని నాధారంగా చేసుకొనిన్నీ, విశేష పరిశ్రమ చేసిన్నీ, దానికి తమ ఉపజ్ఞా బలాన్ని జోడించిన్నీ శ్రీ గంగప్పగారు ఈ సిద్ధాంత వ్యాసమును వ్రాసినారు. ఇది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారి బహుమతి నందుకొన్నది. ఈ గ్రంథము ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మాత్యులు మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి అంకిత మీయబడినది. దీనిలో డా. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు వ్రాసిన 'ప్రవేశిక' మకుటాయ మానముగనున్నది. ఉపయుక్త గ్రంథముల పట్టికను చేర్చినారు. అందులో వీరు 132 గ్రంథములను పరిశీలించి ఉపయోగించు కొనినట్లు తెలిపినారు.

అవతారికలో రచయిత ఇతః పూర్వం ప్రచురితములైన గ్రంథములలో లేని యనేక నూతనాంశములపై చర్చించటం, సిద్ధాంతీకరించటం జరిగిందని తెలిపినారు. క్షేత్రయ్య జీవితం రక్తి భక్తులనడుమ ద్విధా విభక్తమైన విషయాన్ని రచయిత చక్కగా వివరించినారు. వీరిచ్చిన యుదాహరణలు యుక్తస్థాన నియతములై పరనా వ్యాసంగము చేయు వారికి చాల సహాయకారులుగ నున్నవి

ఇందలి 6 ప్రకరణములను వేరు వేరు అంశములపై విభజించటం జరిగింది. మొదటిది క్షేత్రయ్య జీవితం మీద, రెండోది పదకవిత యొక్క పుట్టు పూర్వోత్తరాల మీద, మూడోది క్షేత్రయ్య యొక్క పదకవితా వైశిష్ట్యం మీద, నాలుగోది 'శృంగారం-మధుర భక్తి' అనే అంశంపైన, అయిదోది 'సంగీతం-అభినయం' అనే విషయంపైన, ఆరోది 'క్షేత్రయ్య సేవ' మీదా ఉద్దిష్టములయాయి. వీనిలో పదకవితా వైశిష్ట్యంమీది భాగం సుదీర్ఘమైనది క్షేత్రయ్య నివాస స్థలాన్ని నిర్ణయించటంలో వీరు నిశితవిమర్శనా దృష్టి కనపరిచారు, చారిత్రికా ధారాలను సాక్ష్యంగా తీసుకొని భిన్నభిన్న రచయితల అభిప్రాయాలను తిరస్కరించకుండా, సోపపత్తికంగా తమ వాదానికి బలం చేకూర్చుకోవటం సొగసుగా నున్నది.

'పదం' అనే దానికి సంగీత శాస్త్రపరిభాషలో ఉన్న నిర్వచనంతో పాటు అందలి ప్రభేదములు, పల్లవి, అనుపల్లవి అనువాని నడక, వాగ్గేయకారుడనే మాటకర్థం, పదము, కృతి, కీర్తన, జావళీ అనుప్రభేదములు, వీని క్రమ వికాసం మున్నగు అంశములపై సాధికారికమైన వివరణం వ్రాశారు శ్రీ గంగప్పగారు. ఉత్తమ సాహితీ వివేచనంతో పాటు సంగీత శాస్త్రపరిచయం కూడా రచయితకు కద్దని ఒప్పుకోక తప్పదు. అంతేకాదు. క్షేత్రయ్య పదాలలోని భావాన్ని వెలికి తీయటంలోను, అందలి మనోజ్ఞతను పరితల కందియ్యటంలోనూ రచయిత సఫలులయ్యారని నిస్సందేహముగా చెప్పవచ్చును సాధారణంగా ఈ పదాలు గేయాలు మనము గాయకుని నోట విన్నప్పుడే హృదయాహ్లాదాన్ని కలిగిస్తూ ఉంటాయి. కాని యీ గ్రంథకర్త చాలా లోతుసకుపోయి క్షేత్రయ్య పదములలోని యెంత ప్రౌఢభావాన్నైనా స్పష్టరీతిని వివరించటం వల్ల వానికొక క్రొత్త చైతన్యం వచ్చినట్లవుతోంది.

ఈ పదకవితా వైశిష్ట్యం అన్న ప్రకరణంలో అయిదవ ఉపశీర్షిక 'పదకవితా శిల్పం'. ఈ శిల్ప వివరణాన్ని 17 భాగములుచేసి సోదాహరణంగా విమర్శ నాత్మకంగా సులభశైలిలో వ్రాశారు రచయిత. క్షేత్రయ్యకు మహాకవుల సరసన స్థానం కల్పించారు క్షేత్రయ్య యొక్క కవితా వైభవాన్ని ప్రదర్శించే ఉదాహరణ లనేకంగా ఇచ్చారు. మచ్చుకొక్క పదం.

పల్లవి: ఎంత చక్కని వాడే! నాసామి వీ-డెంత చక్కనివాడే
అ. ప. ఇంతి మువ్వ గోపాలుడు-సంతతము నామనికి
సంతోషము చేసునే ||ఎంత||

చికుత ప్రాయమువాడె-చెలువందు విదియ చం
ద్రు రు గేరు నొసలచే-మెరయువాడే

చెరుకు విల్తునిగన్న-దొరవలెనున్నాడే
మెరుగు చామనచాయ-మేనువాడే ||ఎంత||

పొదలు కెందామరల-పెంపొదవు పదములవాడే
కొదమ సింగపు నడుము-కొమరమరువాడే

మదకరికరముల-మరుచేతులవాడే
సుదతి! మువ్వ గోపాలుడెంత-సొగసులవాడే ||ఎంత||

సంగీత శాస్త్రానభిజ్ఞులకు గూడ ఈ గ్రంథం చదివిన మీదట క్షేత్రయ్య పదాలను కొన్నిటినైనా విని, చదివి, తరించాలనే కోరిక కలగటం తథ్యం.

—రెం. ల

అర్ధరాత్రి సూర్యుడు

(కవి : జక్కని వెంకటరాజం ; ప్రతులకు : జక్కని వెంకట రాజం, 5-2-103, సుభాస్‌నగర్, సిరిసిల్ల-505301, 72 పేజీలు; వెల : రూ. 4)

కవితా వేశంతో కలం పట్టిన యువకులెక్కువగా యీనాడు వచన కవితా మార్గమే తమ భావ ప్రకటన కనువైన సాధనంగా ఎంచుకుంటున్నారు. ఏ సందర్భంలో రాసినా, ఏ పాటి కవితా వేశంతో రాసినా వాటిని వీలైనంత తొందరలో కావ్య సంపుటిగా వెలువరించాలని ఉబలాట పడుతున్నారు. చదువరులీ వచన కవిత్వంలో వచనం పాలెక్కువ కాగానే పెదవి విరిచెయ్యటం సహజంగా జరుగుతున్నది. కావ్య సంపుటం అచ్చు వెయ్య దలచుకొన్నప్పుడు కవి తనకు తానే నిశిత పరిశీలన చేసుకొని, రాసింది ప్రతిదీ కావ్య సంపుటిలోకి రావాలనే ఉబలాటాన్ని ప్రక్కకు నెట్టి కొంతైనా కవితా పదార్థం ఉన్నట్లు తేల్చుకున్న వాటినే సంపుటులలోకి తేవటం మంచిది. శ్రీ జక్కని వెంకట రాజం రచించిన "అర్ధరాత్రి సూర్యుడు" కావ్య సంపుటిలో శీర్షికతో ఉన్న గీతం కాక కెరటాలు; మనిషి–నీడ; శ్రమ–ఫలితం; మరో రిపబ్లిక్ డే; నవ జీవన వాహిని; నీడలు వంటి రసవంతమైన గీతాలూ, ఉషోదయం; సాగుతున్న పోరాటం; శ్రీమతి–సినిమా; మధురస్మృతి; అందం–ఛందస్సువంటి కడు చప్పని గీతాలతో రుచి, అరుచుల సమ్మి తంగా ఉన్నది.

"అర్ధరాత్రి సూర్యుడుదయించినాడు/అఖిల లోకానికి వెలుగు నందించాడు/అందరూ కళ్ళు తెరవండి! /మన కోసం/మన చీకటి బ్రతుకుల్ని వెలిగించడం కోసం/చీకటిలో సూర్యు డుదయించినాడు/చేతనా కేతనాన్ని ప్రతిష్ఠించాడు/ మనల్ని దోచుకు తింటున్న/ దళారీ, దగుల్బాజీ వర్గాల/పని పట్టడానికి, మన వీపు తట్టడానికి/ అర్ధరాత్రి సూర్యుడుదయించినాడు" అని రాసిన గీతంలో పాఠకులకు సులువుగా అర్థమయ్యే విధంగా కవి నేర్పుగా కవితా కళకు భంగం లేకుండా చెప్పటం కన్పిస్తుంది. కెరటాల పయనం నిత్య నూతన చైతన్య పోరాటమనీ, కెరటమంటే వేసారి పోయే బాటసారి కాదనీ, ఒడ్డుకు తగిలి ముక్కలైనా వెనుకనే వచ్చే కెరటంతో కలిసి మళ్ళీ బలాన్ని పుంజుకుంటుందని "కవి కెరటాలు" అనే గీతములో చక్కగా చెప్పారు. మానవు డెంత అభివృద్ధిని సాధించినా "నీడ" అతన్ని వెంబడిస్తూనే ఉన్నదంటాడీ కవి. "నీడకు అతనిలో కలిసిపోవాలనుంది/మనిషిలో ఘనీభవించిన/ మరిదేన్నో తరిమి వేయాలనుంది." అని చెప్పి అసలు రహస్యం "మనిషిలో రాక్షసత్వముంది/ నీడలో మానవత్వముంది" అని కవి తాను దర్శించిన సత్యాన్ని చక్కగా ఆవిష్కరించారు. మనిషి 'నీడ' అనే రచనలో 'శ్రమ–ఫలితం' అనే గీతంలో "రాత్రింబవళ్ళు పరిశ్రమలో/ హవిస్సులా/ నా ఆయుః ప్రమాణాన్ని ధార పోస్తున్నాను/ తర తరాలుగా వస్తున్న/నా పూరి గుడిసె మారలేదు/ అదే నాకు అంతు చిక్కడం లేదు/శ్రమ ఫలితం లేకుండా ఉంటుందా/ కానీ అంతా నాకు దక్కడం లేదు/అదే నాకు అంతు చిక్కడం లేదు/ ఇవి శ్రమజీవి ఆలోచనలు. "మరో రిపబ్లిక్‌డే మళ్ళీ దండెత్తి వచ్చింది/స్వతంత్రంతో పాటు పుట్టిన నాకు ఈ దేశంలో జనాభాకంటే వేగంగా/ వయస్సు పెరిగి పోతున్నది" అనేది కవి భావన. ఇన్నేళ్ళ 'ఇండిపెండెన్సు' లో ఏంసాధించావని రిపబ్లిక్‌డే "నిన్నూ నన్నూ" ప్రశ్నిస్తున్నదంటారు. 'నవజీవన వాహిని' చక్కగా సాగిన రచన.

"నవజీవన వాహిని యిది
యువ చైతన్య లహరి యిది
ఉత్సాహం ఉరకలు వేస్తున్న వాళ్ళకే
పిడికిళ్ళలో బలం సడలని వాళ్ళకే
ఇక్కడ స్థానం....

రక్త ప్రవాహంలో ఈదులాడా లన్న ఇచ్ఛ
కత్తులతో కుత్తుకలు కోయాలన్న తృష్ణ
మానవత్వానికి గొడ్డలిపెట్టు
అమానుషత్వానికి అది ఒక మెట్టు

ఒక చెంపమీద కొడితే
వేరొక చెంప చూపకు
కొట్టినవాడి పళ్ళు విరగ్గొట్టే
పిడికిలి పైకెత్తు."

కవి భావన స్పష్టంగా తెలుస్తూ చదువరుల మనస్సులలో హత్తుకొనే రచన ఇది. ఆకలి బాధితులంతా ఒక్కసారిగా కేకవేస్తే సోఫాలు, హంసతూలికా తల్పాలు "అదిరిపడ్డ శబ్దం" "నీడలు" అనే గీతంలో శ్రీ వెంకటరాజం వినిపించారు.

ఇక "ఉషోదయం" అనే రచన కుటుంబ నియంత్రణ ప్రచారానికి సంబంధించిన కేవల ప్రచార గీతం. "పరిమితిలేని కుటుంబం/దరిద్రానికి మూలం/పరిమితి పాటించిననాడే బ్రతుకులకు ఉషోదయం" అన్నంత పేలవంగా సాగింది యీ రచన. పైగా "నేను చూశాను నిజంగా" అంటూ దీనుల జీవిత దృశ్యాలను ప్రదర్శించిన తీరు కీ. శే. బాలగంగాధర తిలక్ రచనకు పచ్చికాపీ. ఇటువంటి రచనను స్వీయకావ్య సంపుటిలో చేర్చుకోవటం ఘోరం. 'సాగుతున్న పోరాటం' అత్యవసర పరిస్థితిని మెచ్చుకుంటూ రాసినది. "దొంగవ్యాపారుల చేతులకు సంకెళ్ళు/నల్లడబ్బుకు చెరవిడుపు/ అత్యవసర పరిస్థితి పిలుపు/ఆపైన ఇరవై సూత్రాల అభ్యుదయం పథం వైపు మన మలుపు"—ఇటువంటి రచన చదవగానే యీకవి రచనపై ఏమైనా సదభిప్రాయం ఏర్పడితే అది కాస్తా తుడిచిపెట్టుకుపోతుంది. ఈ కవికి సొంత అభిప్రాయములు లేవనీ ఉన్నవన్నీ గాలికోడి వాటమేననీ ఒక దురభిప్రాయం ఏర్పడుతుంది. కీర్తి కండూతిలో రాసిందంతా అచ్చువేసిన దానిఫలితమిది.

"రచన కవితలో టేక్ ఆఫ్ దశ వచ్చింది" అని శ్రీ కుందుర్తి యీ సంపుటికి విపులమైన పీఠిక రచించారు.


శ్రీ జక్కని వెంకటరాజం దృష్టిలో కవిత అంటే "వెన్నెలను వన్నెలతో చూపించడం". ఈ కవి–తగినంత లోక పరిశీలనంతో పూర్వకావ్య పరిజ్ఞానంతో ముమ్ముందు రసవత్కావ్యాలు రచింప గలరని ఆశించవచ్చు.

—రామమోహనరాయ్


జిల్లాల్లో



నల్గొండ జిల్లా పెద్ద పూర గ్రామంలో జూలై 15 న గవర్నరు శ్రీమతి శారదా ముఖర్జీ బలహీన వర్గాలకు ఉపాధి రుణాలు పంపిణీచేశారు.



తాడేపల్లి గూడెం తాలూకా కేశవరం గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన హరిజనులకు స్థానిక రోటరీక్లబ్ రూ. 1500 లు విలువచేసే వంటపాత్రలు విరాళం యిచ్చారు. కలెక్టరు శ్రీ జె. రాంబాబు జూలై 20 న విరాళాన్ని స్వీకరించారు.



జూలై 17 న ముఖ్యమంత్రి నాగార్జనసాగర్ కుడి కాల్వ బ్లాకు 14 నకు 78-3 మైలు వద్ద నాగార్జున సాగర్ జలాలను విడుదలచేశారు.


వార్తాచిత్రాలు




ఆర్థిక. సమాచార శాఖ మంత్రి శ్రీ పిడతల రంగా రెడ్డి మే 3 వ తేదీన విజయనగరంలో శ్రీ వెంకటేశ్వర కళా కేంద్రానికి శంకుస్థాపన చేశారు.




1976లో కార్పొషన్ బ్యాంకు పథకం రే క్రింద లక్షరూపాయల నగదు సర్టిఫికెట్ బహుమతి గెలుపొందిన శ్రీమతి జమునన్నిసాబేగంకు జిల్లా కలెక్టరు సతీమణి మే 10న సర్టిఫికెట్ అందజేస్తున్నదృశ్యం.




ఇటీవల రత్నాకరం రాఘవరాజుగారి ఆధ్వర్యంలో కాళహస్తి తాలూకా కురుజిలం గ్రామంలో గిరిజనులు మరికొందరు రైతులు కలిసి 40 యిండ్లతో మహాత్మా నగర్ కాలని నిర్మించుకొన్నారు.



ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు జూలై 23న మల్లాపురం దక్షిణకాల్వకు పోచంపాడు జలాన్ని విడుదల చేశారు. వ్యవసాయశాఖా మంత్రి శ్రీ జువ్వాది చొక్కారావు, నీటి పారుదల శాఖామంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు యీ కార్యక్రమంలో పాల్గొన్నారు.




గుంటూరు జిల్లా వినుకొండలో జూలై 17 న ముఖ్యమంత్రిగారు సాంఘిక సంక్షేమ వసతి గృహానికి శంకుస్థాపన చేశారు.



భారత్ హెవీ ఎలక్ట్రికల్స్‌వారు తయారు చేసిన ఆయిల్‌రిగ్. దేశంలో మొట్టమొదటగా డీసెల్ విద్యుచ్ఛక్తితో నడిచే యీరిగ్ 142 అ. ఎత్తు వుండి, సుమారు 10వేల అడుగుల లోతువరకు డ్రిల్ చేయగలిగే శక్తి కలిగివుంది.



గవర్నరు శ్రీమతి శారదాముఖర్జీ జూలై 13న సికిందరాబాద్ "కల్పలత" సూపర్ బజార్‌లో స్వయంసేవా విభాగానికి ప్రారంభోత్సవం చేశారు.




ఆర్థిక, సమాచార శాఖామంత్రులు శ్రీ పి. రంగారెడ్డి యిటీవల విజయనగరంలో షెడ్యూల్డు కులాల వారి బాలికల వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమ, సాంకేతిక విద్యాశాఖా మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు.

కుంతల జలపాతం




ఈ ప్రవాహం 46 మీటర్ల ఎత్తునుంచి పడుతుంది.

పొచ్చర జలపాతం




ఆదిలాబాద్ జిల్లాలో...

యాత్రికులకు కన్నుల పండువ!
30 మీటర్ల ఎత్తు నుండి
నిరంతర ప్రవాహం.



పొచ్చర జలపాతం వద్ద వసతి గృహం



సోమగుండంలో యాత్రికుల స్నానఘట్టం

(ఫొటోలు : శ్రీమతి జి. లక్ష్మి, హన్మకొండ)

మన జిల్లాల్లో ఏం జరుగుతోంది?

— సమాచార లేఖావళి

భూగర్భ జలసంపద

తెలంగాణా ప్రాంతంలో చెరువులు, కుంటలు, బావులు, వ్యవసాయానికి ముఖ్యమైన నీటి వసతులు. వీటివలన సాగుబడి క్రింద ఉన్న భూమి చాలా తక్కువ. నీటి వసతులు లేని కారణంగా లక్షల యకరాలు బీళ్లుగా, అడవిగా వదలి వేయబడింది. కాని గత మూడు సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలలో నీటి వనరులను అధికం చేసే నిమిత్తం ప్రభుత్వం పెక్కు పథకాలను కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టింది. వాటిలో భూగర్భ జల వినియోగ కార్యక్రమం ముఖ్యమైనది.

గత పది సంవత్సరముల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ గావించిన పరిశోధనలలో గోదావరి పరీవాహక ప్రాంతమైన, బూర్గంపాడు, కొత్తగూడెం, సత్తుపల్లి, పాక్షికంగా ఇల్లందు తాలూకాలలో అత్యంత భూగర్భ జల సంపద కలదని సర్వే వల్ల తేలింది. ఈ సంస్థ 1976 జనవరి నెల నుండి గొట్టపు బావుల ద్వారా భూగర్భ జలాన్ని వినియోగానికి తెచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమము, ముఖ్యంగా గిరిజన, హరిజన, సన్నకారు రైతుల అభ్యున్నతికి ఉపయుక్తమైన విధంగా రూపొందింపబడింది.

గిరిజనులు, హరిజనులు, వెనుకబడిన వర్గాల సన్నకారు రైతులు ఎక్కువగా గల సత్తుపల్లి తాలూకాలో భూగర్భ జలాన్ని వినియోగంలోకి తెచ్చుటలో నీటి పారుదల అభివృద్ధి సంస్థ చాలా ప్రగతిని సాధించింది. ఇంతవరకు ఈ తాలూకాలో ఈ సంస్థ ఆధ్వర్యంలో 15 గొట్టపు బావులు పూర్తి చేసి 2,38.4 యకరాలు సేద్యంలోనికి తేబడింది. దీని వలన 435 మంది రైతులకు లాభం చేకూరుతుంది. ఇందులో 151 మంది గిరిజనులు, 173 మంది హరిజనులు. త్రవ్వకం పూర్తి గావింపబడి, విద్యుచ్ఛక్తి సరఫరా ఏర్పాట్లు గావించ బడుచున్న బావులు 7, ప్రస్తుతం త్రవ్వకంలో వున్న బావులు 7. ఈ బావులు పూర్తి అయిన పిమ్మట అదనగా 2000 యకరాలు సాగులోకి వస్తాయి. ఇందుకగు ఆర్థిక సహకారం అగ్రికల్చరల్ రీఫైనాన్స్ కార్పొరేషన్ వారి వలన వాణిజ్య బ్యాంకుల ద్వారా లభిస్తున్నది.

—శ్రీ డి. వి. యస్. అప్పారావు

కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాల

ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాలల సంఘం ద్వారా రాష్ట్రంలో నెలకొల్పబడిన ఐదు ఉన్నత పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలలో ఖమ్మం జిల్లా, కొత్తగూడెం తాలూకాలో కిన్నెరసాని వద్ద స్థాపింపబడినది ఒకటి. ఇది రాష్ట్రంలో ప్రత్యేకంగా గిరిజన బాలుర కొరకు నెలకొల్పబడిన ఏకైక సంస్థ అయినప్పటికీ 30 శాతం ఇతరులకు, అనగా హరిజనులకు 10 శాతం, వెనుకబడిన జాతులకు 5 శాతం, ఇతరులకు 5 శాతం ప్రవేశార్హత వుంది. ఈ పాఠశాలను 1975 డిసెంబరు నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు ప్రారంభించారు.

కిన్నెరసాని ఆనకట్టకు అతి సమీపంలోనే, నదీసుందరి రూపంలోని ప్రకృతికాంత ఒడిలో, విద్యావ్యాసాంగానికి అత్యుత్తమమైన ప్రదేశంలో గురుకులం స్థాపించారు. ఈ సంస్థకు మంచి భవిష్యత్తు వుంది.

ఆనకట్ట నిర్మాణ సమయంలో అక్కడి ఉద్యోగుల కొరకై నిర్మింపబడి అప్పటికి నిరుపయోగంగా వున్న భవనాలను, తరగతి గదులు, భోజన వసతి గృహాలు, కార్యాలయం, ఉపాధ్యాయుల నివాసం మొదలగువానికి అనుగుణంగా మార్పులు చేయుటకై రూ. 2.25 లక్షలు ఖర్చు చేయబడినవి. ఈ పాఠశాలకు కొత్త భవనాల నిర్మాణం కొరకు కొద్దికాలము క్రితమే స్థల సేకరణ జరిగి పునాది కూడా వెయబడినది.

5వ తరగతితో ప్రారంభించబడిన ఈ పాఠశాల ఇప్పుడు 7వ తరగతి వరకు పెరిగింది. పాఠశాలలో ఏ విద్యార్థినైనా ప్రత్యేకంగా పరిచయం చేస్తే తప్ప అతడు గిరిజనుడు లేక హరిజనుడని తెలుసుకోలేనంత మార్పు వీరిలో వచ్చింది.

బోధనా భాష తెలుగే అయినప్పటికీ విద్యార్థులందరూ చక్కని ఉచ్ఛారణతో సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఈ పాఠశాల 100 మంది విద్యార్థుల అవసరాలను 10వ తరగతి వరకు తీరుస్తుంది. విద్యార్థుల, ఉపాధ్యాయుల నివాసం ఒకటే కాబట్టి అన్నివేళలా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన పర్యవేక్షణ లభిస్తున్నది.

స్కౌటింగు, శరీర దార్ఢ్య శిక్షణ, ఆటలు ప్రతి విద్యార్థికి తప్పనిసరియైన విషయాలు. ఇవిగాక ప్రతి ఆదివారం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడుతాయి. ఇదేవిధంగా గ్రంథాలయానికి, ప్రయోగశాలకు ప్రతి రోజు నిర్ణీత వేళలలో కేటాయింపులు వున్నవి.

ఇచ్చటి విద్యార్థులకు ఉచిత భోజన, వసతి విద్యలతో పాటు సంవత్సరానికి నాలుగు జతల యూనిఫారాలు, ఒక జత స్కౌటు యూనిఫారం, ఒక జత భోజన సమయపు యూనిఫారం, తరగతి పుస్తకాలు ఇవ్వబడుతాయి. ఇవిగాక ఒక స్టీలు కంచం, గ్లాసు, మంచము, దుప్పట్లు కూడ యిస్తారు.

అటువంటి వాతావరణంలో పెరిగి, విద్యాభ్యాసం చేస్తున్న ఈ గిరిజన గురుకుల విద్యార్థులకు చక్కని భవిష్యత్తు కలదనుటలో సందేహము లేదు.

— శ్రీ టి. ఆనందరావు

అధికోత్పత్తి సాధనకు ఉరవకొండ పంచాయతీ సమితి కృషి

అనంతపురం జిల్లాలోని ఉరవకొండ పంచాయతీ సమితి విద్యారంగంలోను, రాజకీయ రంగంలోను, అధికోత్పత్తి సాధనలోను ముందంజం వేసింది. ఉరవకొండ సబ్ తాలూకా, పంచాయతీ సమితి ఒకే భౌగోళిక వైశాల్యం కలిగివున్నవి.

ప్రత్తి, వేరుశెనగ, జొన్న, ధనియాలు పండించడంలో అనంతపురం జిల్లాలోని ముఖ్య కేంద్రాలలో ఉరవకొండ ప్రాంతము ఒకటి.

ఈ ప్రాంతంలో సాగుదలకు చెరువులు, ఊట కాలువలు, బావులు, తుంగభద్ర ఎగువకాల్వ, గుంతకల్లు బ్రాంచి కాల్వ చెప్పుకోదగ్గవి.

అప్పుడప్పుడు ప్రకృతిలో విపరీత పరిస్థితులు ఏర్పడుచున్నప్పటికిని, రైతులు నిరుత్సాహం చెందక వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు చెందుతున్న తరుణంలో వ్యవసాయ శాఖాధికార్ల సాంకేతిక సహాయ సలహాల మేరకు సంకరజాతి, అధిక దిగుబడినిచ్చే పంటలను వేశారు.

ఇంతకు మునుపు సమితి ప్రాంతంలోని రైతులు నల్లరేగడి భూములలో ధనియాలు ఒకే పంట మాత్రం పండించేవారు. వ్యవసాయశాఖ సలహాల మేరకు ఈ సంవత్సరం మే, జూన్ మాసాలలో 240 మి. మీటర్ల వర్షము పడినందువల్ల జొన్నరకములను సుమారు 2,500 ఎకరములలోను సజ్జ రకములను 1,250 ఎకరములలో వేయడానికి తగిన అనుకూల వాతావరణం ఏర్పడింది.

గత సంవత్సరం దెబ్బతిన్న కారణంగా రైతులు ఈ సంవత్సరం మేలురకం పంట పద్ధతులను అవలంబించినందువల్ల మరల సెప్టెంబరు నెలలో ధనియాల పంట వేసి రెండు పంటలు తీసికొనవచ్చు.

—శ్రీ జె. యన్. గోపాలకృష్ణ

గిరిజనుల పండుగలు

ఖమ్మం జిల్లా నూగూరు తాలూకాలోని గిరిజనులు ప్రత్యేకమైన పండుగలు చేస్తారు. వీరి పండుగలు మనకు వింతగా కనిపిస్తాయి. కాని వాళ్లకు మాత్రం ప్రతి పండుగకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యం వున్నది. గిరిజనులు చేసే ముఖ్యమైన పండుగలు (1) విత్తనం పండుగ (2) పంచ పండుగ (3) బొట్ట పండుగ (4) కొత్తల పండుగ (5) చిక్కుడు గింజల పండుగ.

విత్తనం పండుగ— : ఈ పండుగను మనం ఏరువాక సాగడం అనవచ్చు. ఊరిలో పెద్దలు, పూజారి ఒక పందిని కొని దానిని కర్రకు వేలాడ కట్టి ఊరు చుట్టూ త్రిప్పి వూరిలోని బొడ్డురాయి దగ్గర దానిని కోసి అచ్చటనే వూరి వారందరు వంటలు చేసి ఆ రోజు అందరు ఆ బొడ్డురాయి వద్దనే తిని ఆ రాత్రికి అచ్చటనే నిద్రిస్తారు. ఇది ఊరిలోని దేవరలను వూరు బయటకి పారదోలడం. అనగా వర్షకాలంలో వచ్చే కలరా జ్వరాలు మొదలైన జబ్బులు రావని వాళ్ల నమ్మకం. ముఖ్యంగా ఈ పండుగ చేసిన తరువాతనే వ్యవసాయ పనులు ప్రారంభించి విత్తనాలు చల్లుతారు. విత్తనాలు చల్లుటకు ముందు చేసే పండుగ కొట్టి విత్తనం పండుగంటారు.

పంచ పండుగ—: గ్రామంలోని పెద్దలు, పూజారి గ్రామంలో బియ్యం వసూలు చేసి కొండ వేల్పుల దేవర వద్ద వంట చేసి, తరువాత గ్రామంలోని అన్నిరకాల ఆకు కూరలను తీసుక వచ్చి దేవర వద్ద వండి, దేవరకు పెడితారు. ప్రతి యింటి వారు ఒక కోడ్డిని కూడా తీసుక వచ్చి దేవర వద్ద బలియిచ్చి వంట చేసుకొని వూరి వారందరు అచ్చటనే తింటారు. ముఖ్యంగా ఈ పండుగ చేయనంత వరకు వూరిలో ఎవ్వరు కూడా ఆకు కూరలు తినరు. పచ్చ ఆకు కూరలు తినేముందు చేసే పండుగ కనుక పంచ పండుగంటారు.

బొట్ట పండుగ— : సంవత్సరంలో మొదటి సారి వచ్చిన పంటలను తినేముందు చేసే పండుగ. అనగా ఆ సంవత్సరంలో మొదట పంటలు, మొక్కజొన్న, ధాన్యం మొదలైన పంటలను ముందుగా వూరి వారందరు కొండవేల్పుల దేవర దగ్గర కొత్త పంటతో వంట చేసి దేవరకు పెట్టి అందరు అచ్చటనే తింటారు. ఈ పండుగ చేయనంత వరకు వూరిలో ఎవ్వరూ కూడా కనీసం ఒక్క మొక్కజొన్న పొత్తును కూడా తినరు. కొత్త సంవత్సరంలో వచ్చిన మొదటి పంట బొట్టలోనికి పోతుంది కనుక దీనిని బొట్ట పండుగంటారు.

కొత్తల పండుగ—: ఈ పండుగను పెద్దల పండుగనవచ్చును. ఊరి వారందరు ఒక్క రోజున ప్రతి యింటి వారు మూడు కోళ్లను దీసుకొని అందులో ఒకటి కొండ వేల్పుల దేవర వద్ద, ఒకటి పోతురాజు వద్ద, మరి యొకటి వాళ్లవాళ్ల చనిపోయిన పెద్దల పేరట కోస్తారు. అనగా గ్రామంలోని పెద్దలైన కొండ వేల్పుల దేవర పోతురాజుకు చనిపోయిన పెద్దల పేరున చేసే పండుగను కొత్తల పండుగంటారు.

చిక్కుడు గింజల పండుగ— : గిరిజనులలో ప్రతి ఇంటి వాళ్లు తప్పని సరిగా చిక్కుడు కాయల పంటను పండిస్తారు. ముఖ్యంగా చిక్కుడు గింజలే వాళ్లకు పంపి వండుటకు ఉపయోగిస్తారు. చిక్కుడు పంట వచ్చిన తరువాత వూరి వారందరు కలసి చిక్కుడు కాయలను పూజారి సహాయంతో ముందుగా కొండ వేల్పుల దేవర వద్ద వండి దేవరకు పెట్టి అందరు అచ్చటనే తింటారు. చిక్కుడు గింజలను తినేముందు చేసే పండుగను చిక్కుడు గింజల పండుగంటారు. ఈ పండుగ చేసిన తరువాతనే వాళ్లు అడవిలోని గడ్డిని

చీపురు గడ్డిని కోస్తారు. ఈ పండుగ చేయనంత వరకు ఏ విధమైన గడ్డి కోయరు.

—శ్రీ బి. బాలయ్య

దగ్గుబాడు బహుళార్థక సహకార సంఘం

ప్రకాశం జిల్లా చీరాల తాలూకా దగ్గుబాడు గ్రామం గుంటూరు. ఇంకొల్లు, రాష్ట్రరహదారిలో ఇంకొల్లుకు 4 మైళ్ళ దూరములో వున్నది. ఈ గ్రామములో 1938 వ సంవత్సరములో బహుళార్థక సహకార సంఘం స్థాపించబడింది. నాటి నుండి నేటి వరకు సహకార పద్ధతిలో రైతులకు స్వల్పవ్యవధి ఋణాలను, యిస్తున్నారు. స్థాపించినపుడు ఈ సంఘము యొక్క షేరు ధనము రూ. 1000 లు కాగా ఇపుడు అది. 5,4000-00 వరకు పెరిగింది. దీనిలో 577 మందికి సభ్యత్వం వుంది. ఈ సహకార సంఘం దగ్గుబాడు, నాయుడువారిపాలెం, పోతినవారిపాలెం, పూసపాడు గ్రామములకు విస్తరించింది. 1976-77 సం॥ లో కేంద్ర సహకార బ్యాంక్ నుండి రూ. 4.95, లక్షలు ఋణం తెచ్చి రైతులకు స్వల్ప వ్యవధి ఋణాలు ఇచ్చి తిరిగి వసూలు చేయడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్‌సీజనుకు రూ. 8.50 లక్షలు ఋణం మంజూరు అయింది. దీనిలో ఇప్పటి వరకు సుమారు రూ. 6 లక్షలు రైతులకు, స్వల్పవ్యయ పంటల ఋణములు మంజూరుచేసి రైతులకు యివ్వడము జరిగినది.

ఈ సంఘం అధ్యక్షుడు శ్రీ షేక్ హసన్ సాహెబ్ ఉత్సాహవంతుడు, వీరి నేతృత్వంలో సంఘం రైతులకు ఋణసౌకర్యములు కల్గించుటలో జరిగిన కృషి ప్రశంసనీయం.

—శ్రీ ఎన్. శాస్త్రి

ఉలవపాడు సమితిలో దళిత వర్గాల ప్రగతి

ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకాలో ఉలవపాడు పంచాయతీ సమితి ఒంగోలుకు దక్షిణ దిశగా సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉలవపాడు, సుల్లూరు, లింగసముద్రం, శింగరాయకొండ ఫిర్కాలలోని 63 గ్రామములతో 1,29,276 జనాభా గలిగివున్నది.

పంచాయతీ సమితిలో జనాభా వ్యవసాయము. వ్యవసాయ కూలీపై అధికంగా ఆధారపడి వున్నారు. దళిత జాతుల జనాభా హెచ్చుగా వున్న ప్రాంతమిది. దళిత జాతుల సముద్ధరణకై యీ క్రింది కార్యక్రమాలు నిర్వహించి యున్నారు.

గరిష్ఠ భూపరిమితి చట్టం క్రింద 9.30 సెంట్ల భూమి మాగాణి రూ. 170 లు మెట్టభూమి. భూమిలేని పేదలకు పంచిపెట్టబడినది. ఇదిగాక 7050 మందికి 19.841 ఎకరముల బంజరు భూమి పంచి పెట్టారు.

వాటి వివరాలు :

1.	షెడ్యూలు కులాల వారు	3747 మంది	11453 మంది
2.	షెడ్యూలు తెగల వారు	829 ,,	2189 ,,
3.	వెనుకబడిన తరగతుల వారు	729 మంది	2729 ,,
4.	ఇతరులకు	1745 ,,	4070 ,,
		7050	19841

ఇండ్లులేని పేదలకు 2014 మందికి రూ. 98.87 సెంట్ల భూమి ఇండ్ల స్థలాలపై క్రింది విధంగా పంచి పెట్టబడినది.

		మందికి	ఎకరములు
1.	షెడ్యూలు కులముల వారు	966	47.51
2.	షెడ్యూలు తెగల వారు	753	37.14
3.	వెనుకబడిన తరగతుల వారు	194	8.70
4.	ఇతరులకు	101	5,52
		2014	98.87

అట్లే 394 మంది షెడ్యూలు కులములవారికి, 65 మంది షెడ్యూలు తెగలవారికి, 66 మంది వెనుకబడిన తరగతులవారికి రూ. 34.02 సెంట్ల భూమిని ప్రభుత్వ ఖర్చుతో కొని, ఇండ్ల స్థలములు కేటాయించిరి.

హరిజనులు, మిగతా బలహీన వర్గాలవారికి పంచిన భూములలో కమ్యూనిటీ బావులను సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ, షెడ్యూలు కులముల, వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ సహకారముతో త్రవ్వడమైనది.

సమితిలోని రామాయపట్నం, సుబ్బరాయుడు సత్రం, ఉలవపాడు గ్రామాలలోని బలహీన వర్గాలవారు చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. వీరి ఆర్థిక స్థితి మెరుగుపరచుటకుగాను బ్యాంకుల ద్వారానూ, ఆర్థిక సహకార సంఘముల ద్వారానూ ఋణాలు మంజూరుచేసి. నాణ్యమైన గుడ్డ తయారీకి దోహదం చేయడమే గాక వారి ఆర్థిక స్థితి మెరుగుపరచడమైనది.

—శ్రీ బి. ఆర్. నాయుడు

గండిపాళెం జలాశయం

నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలుకా చాలా వెనుకబడిన ప్రాంతం. ఈ చీలేటి కోనకు గండిపాళెం ప్రాజెక్టు ఒక ఆశాజ్యోతి.

గండి పాళెం ప్రాజెక్టు 1965 సం॥ లో పరిశీలన జరిగింది. మొదట రూ. 2.25 కోట్ల అంచనా. ప్రస్తుత అంచనా రూ. 2.50 కోట్లు.

మట్టి కట్ట, రెగ్యులేటర్లు, కాలవలు ప్రధాన అంశాలు. వీటికి వరుసగా రూ. 85 లక్షలు., రూ. 88 లక్షలు, రూ. 40 లక్షలు ఖర్చవుతుంది. గృహవసతి, రోడ్లకు రూ. 15 లక్షలు, జలాశయంలో మునిగిపోవు భూములకు నష్టపరిహారము రూ. 22 లక్షలు. మొత్తం రూ. 2.50 కోట్లు.

మట్టి కట్ట పొడవు 1100 అడుగులు, ఎత్తు 68 అడుగులు. దాదాపు 35 అడుగుల ఎత్తువరకు పని పూర్తయింది, 40'×25' సైజుగల 4 తూములతో వరదనీరు పోవుటకు రెగ్యులేటర్లు నిర్మింపబడుతున్నాయి. దాదాపు 40% పని పూర్తయింది.

6½ మైళ్ళ పొడవుగల ఎడమ కాలువ, దాని ఉప కాలువలు 10.4 మైళ్ళ పొడవుగల కుడికాలువ దాని ఉపకాలువలు 7, కుడి ఎడమ కాలువలు దాదాపు పూర్తిగా త్రవ్వబడినాయి. ఉపకాలువలు త్రవ్వబడుతున్నాయి.

ఎడమ కాలువ క్రింద గండి పాళెం, గువ్వడి, గొల్లపల్లి, ఇసుక పల్లి, కాంచెరువు, మహమ్మదీపురం, విరూరు, కొండారు పాళెం, తూర్పు బోయ మడుగుల, అలవేలు మంగాపురం, జడదేవి గ్రామాలలో పదకొండు వేల ఎకరాలు, కుడి కాలువ క్రింద గువ్వడి, గుడినరవబోయ మడుగుల, తిరుమలాపురం, సున్నంవారి చింతల గ్రామాలలో ఐదు వేల ఎకరాలు — మొత్తం 16 వేల ఎకరాలకు నీటి సౌకర్యం ఏర్పడుతుంది. ఈ పదహారువేల ఎకరాలలో కొర్ర, సజ్జ, జొన్న, మిర్చి, వేరుశనగ, కూరగాయలు పండించుకొనవచ్చును. మొదటి పంట కాలంలో 16 వేల ఎకరాలకు నెలకు ఒక తడి, రెండో పంట కాలంలో అందులో 8 వేల ఎకరాలకు నెలకు రెండు తడులు యివ్వబడుతాయి.

ఈ ప్రాజెక్టు 1978 సం॥ మే నెలకు పూర్తి చేసి, జూన్ నెలలో నీరు వదలాలనే లక్ష్యంతో శరవేగంతో నిర్మాణ కార్యక్రమం జరుగుతూంది.

—టి. పి. ఆర్. ఓ. ఉదయగిరి

ఆదర్శగ్రామం

గుంటూరు జిల్లాలోనే ఆదర్శగ్రామంగా ఎన్నికయిన జగ్గాపురం నర్సరావుపేట తాలూకాలోని నాదెండ్ల పంచాయతీ సమితిలో ఉన్నది. ఈ గ్రామం అన్ని రంగాలలో అభివృద్ధి చెందటమే కాకుండా ప్రజోపయోగ కార్యక్రమాలనెన్నింటినో చేపట్టింది. గ్రామస్థులు విరివిగా విరాళం యిచ్చి యివ్వటం, ఉన్నత పాఠశాల, పశువుల ఆసుపత్రి, గ్రామపంచాయతీ భవనంలాంటి ఎన్నో సంస్థలకు భవనాలు ఏర్పాటు చేసుకోగలిగారు. రక్షిత మంచినీటి పథకం అమలు జరుగుతున్నది. అన్ని హంగులు కలిగిన ఈ గ్రామానికి ఇటీవల ప్రభుత్వం వారు గ్రామీణ వైద్యశాలను మంజూరు చేశారు. ఈ వైద్యశాలకు సమితి ప్రత్యేక అధికారి శ్రీ యం. వి. సుబ్బారావు ప్రారంభోత్సవం చేశారు. ఒక సంవత్సరం వరకు ఈ ఆసుపత్రి నిర్వహణ ఖర్చు ప్రజలే భరిస్తారు. తదుపరి ప్రభుత్వం వారు చేపడతారు. నర్సరావుపేట తాలూకాలో నాగార్జునసాగర్ జలాలవల్లసాగు అయ్యే భూమి చాలా ఉన్నది. సాగర్ జలాల విడుదల గురించి ఇటీవల నర్సరావుపేటలో ఒక గోష్ఠి జరిగింది. సాగర్ కాల్వల చీఫ్ ఇంజనీరు, కమాండ్ ఏరియా అడ్మినిస్ట్రేటరు, రెవిన్యూ, ప్రజాపనులు, విద్యుచ్ఛక్తిశాఖల అధికారులు, రైతులు ఇందులో పాల్గొన్నారు. ఇంతవరకు నీరులేని 1.50 లక్షల ఎకరాలలో ఈ సంవత్సరం నాట్లు వేసుకోవడానికి నీరు అందుతుంది. ఆయకట్టును క్రమబద్ధం చేయడం కోసము కాలువల చీఫ్ ఇంజనీరు అధ్వర్యాన కమిటీ వేయబడినట్లు తెలుసుకొని ప్రజలు సంతోషించి తమ చిరకాలవాంఛ తీరినట్లు భావిస్తున్నారు. మంగళగిరి పంచాయతీలోని బాలాజీనగర్ వాస్తవ్యులు గత 20 సంవత్సరములుగా కొంత స్థలం ఆక్రమించుకొని జీవనము గడుపుకొంటున్నారు. ఇటీవల గుంటూరు జిల్లా రెవిన్యూ డివిజనల్ ఆఫీసరుగారు తగు శ్రద్ధ తీసుకొని అక్కడ నివాసం వున్న వారందరికీ మొత్తం 83 మందికి అనాల్గు యకరముల స్థలమునకు పట్టాలు చ్చారు.

—టి.పి.ఆర్.ఓ., నరసరావుపేట

నీరస మంథనం

—శ్రీ మహమ్మద్ నవాజ్ అలీ ఖాన్

నీరసమును మథించి
నవరసాలు సాధించి
బ్రతుకును మధుర
కృతిగా మలచాను.

విలువలు లేని—ఆశల
వలువలు లేని
శిలా జీవితాన—మందా
రాలు తొలిచాను.

అణువుల నుండి
అమృతాన్ని పిండి
జనతకు పంచుతాను,
సమతను పెంచుతాను.

ఎడదలు విడివడకుండ
ముడిగట్టిగ రచించుతాను.

పృథ్వి చుట్టు
వితవలయమును విసరి
వృథా పోతున్న
సవితృడి రేడియేషన్ శక్తిని
కవితా జీవిత భీమా కార్పొరేషన్‌లో
మదుపు పెడతాను.

సమస్యల అమావాస్యలు తొలగి
సందేహాల సంధ్యలు తొలగి
కాంతి సుమాలు విరియును—అంతటా
శాంతి సోనలు కురియును.

ఎలుకలపై దండయాత్ర

—శ్రీ ఎం. సూర్యారావు



'రాచర్ల'లో సమితి అధికారి శ్రీ సి. కృష్ణారావు ఎలుకల నిర్మూలన మందు గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న దృశ్యం

అనాదినుండి ఎలుకకు రైతాంగమునకు ఎడతెరిపిలేని పోరాటము జరుగుతూ వుంది. గత పది, పదునైదు సంవత్సరములుగా వ్యవసాయ విజ్ఞాన సముపార్జనలో ఆంధ్ర రైతాంగము సాధించిన అభివృద్ధి వర్ణనాతీతము. వ్యవసాయాభివృద్ధికి మిక్కిలి హానికరమైన ఎలుకల ఉత్పత్తి నిర్మూలనకు తగిన శాస్త్రీయ పద్ధతులను కనుగొనలేని కారణముగా, రైతు పండించు పంటలో సుమారు మూడవ భాగము ఎలుకల పరమగుటచే, యిటు సమాజమునకు, అటు రైతునకు ఆర్థికముగా చెప్పలేని నష్టం వాటిల్లుతున్నది.

ఇంతటి హానికరమైన యీ ఎలుకల నిర్మూలనకు తాడేపల్లిగూడెం తాలూకా గణపవరం పంచాయతీ సమితివారు చేపట్టిన ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమము మిక్కిలి ప్రశంసనీయము. డెల్టా ప్రాంతమైన యీ సమితి ప్రాంతములో 1977 సార్వా కాలంలో 68 వేల ఎకరములలో వరి సాగు జరుగుతున్నది. వ్యవసాయ శాఖ నిపుణుల అంచనా ప్రకారం ఎకరమునకు 1–65 మెట్రిక్ టన్నుల ధాన్యం చొప్పున 1977లో సమితిలో ఒక లక్షపదివేల ఏడువందల ఏబది మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగల సూచనలు వున్నప్పటికీ, రైతాంగమునకు ఆగర్భ శత్రువులు అయిన ఎలుకలను నిర్మూలించనిచో, సమితి ప్రాంతములో రమారమి 41 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎలుకల పరమవుతుందనే సత్యాన్ని రైతాంగమునకు తెలియజేశారు. సమితిలో యావత్ రైతాంగము తమ తమ వరి పొలములలో ఎలుకల నిర్మూలన కార్యక్రమములను చేపట్టునట్టు చేశారు. దానికి నాందిగా, 730 ఎకరముల వరి సాగుచేసిన రాచర్ల గ్రామంలో యిటీవల జిల్లా గ్రెయిన్ పర్చేజింగ్ మరియు సమితి స్పెషల్ ఆఫీసర్ శ్రీ సి. కృష్ణారావు, ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమమునకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమ నిర్వహణ నిమిత్తం గ్రామాలలో సస్యరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, కార్యక్రమమును ఎనలేని ఉత్సాహముతో నిర్వహించుచున్న యీ రైతాంగము అభినందనీయులు.


పరిశోధన చేయగా ఎకరమునకు 1 నుండి 11 వరకు ఎలుక రంధ్రములు వుండవచ్చునని, ఈ రంధ్రములన్నిటిని ఎలుకల నిర్మూలనా ఔషధం (Fumigant Tablets) తో నింపుటకు ఎకరమునకు సుమారు రూ. 2–00లు ఖర్చు చేయుట వలన రైతునకు అరమెట్రిక్ టన్ను ధాన్యం మిగులును అనుటలో ఎట్టి సందేహము లేదని వ్యవసాయశాఖ నిపుణులు వక్కాణించి చెప్పుతున్నారు.

58 గ్రామపంచాయితీలు గల యీ సమితిలో యిప్పటికప్పుడే 27 గ్రామాలలోని ప్రజలు యీ కార్యక్రమమును పూర్తి చేశారు.



పొలంవద్ద సస్యరక్షణ సంఘం, సలహాలిస్తున్న శ్రీ సి. కృష్ణారావు

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS ANDHRA PRADESH, HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS, HYDERABAD.



అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో శిక్షణ శిబిరం


ఈ నిధిని గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించటానికి, ప్రోత్సహించటానికి ఖర్చు చేయటానికి నిర్ణయించింది.

రాష్ట్రాలలో కూడా ఏరాష్ట్రానికి-ఆరాష్ట్రం, కార్యకలాపాలు చూపటానికి గాను ఒక సంచాలకుడిని, వానితోపాటు ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఆంధ్రప్రదేశ్ అప్పట్లో రెండు రాష్ట్రాలుగా ఉన్న కారణంగా ఇద్దరు సంచాలకులు నియమించ బడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఒక సంచాలక్ నియమించ బడ్డారు. 1958 తర్వాత సలహా సంఘాలకు బదులు రాష్ట్ర సంఘాలు వచ్చాయి. అప్పట్లో సంచాలకులుగా పనిజేసిన వారిని ఆ రాష్ట్ర సంఘ కార్యదర్శిగా నియమించారు. మొదట్లో ఈ గాంధీస్మారక నిధికి ఆంధ్రప్రాంతానికి సంచాలక్‌గా అమరజీవి పొట్టి శ్రీరాములు గారు పనిచేశారు. హైదరాబాద్ విభాగానికి ప్రప్రథమ అధ్యక్షులుగా శ్రీరూత్ పని జేశారు. తర్వాత శ్రీ కె. శ్రీనివాసరావు, శ్రీ ఎస్. రామారావు పని జేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాంధీ స్మారక నిధికి సలహా మండలి ఏర్పాటు అయింది. ఆ సలహా మండలికి ప్రముఖ గాంధేయవాది శ్రీ కోదాటి నారాయణరావుగారు కార్యదర్శి. ఈ స్మారక నిధికి సలహా మండలి అధ్యక్షులుగా శ్రీ కె. కోదండ రామరెడ్డిగారూ, అధ్యక్షులుగా డాక్టర్ కె. ఎల్. రావు, డాక్టర్ వెంపటిసూర్యనారాయణ, శ్రీయుతులు సి. వి. చారి, సి. హెచ్. చంద్రమౌళేశ్వరరావు, టోకర్సీలాల్‌జీ కపాడియా, ఆర్. కె. రామ్. రాధాకృష్ణయ్య, మహమ్మద్ జయినుద్దీన్ బీన్, శ్రీమతి విద్యాదేవిగార్లు సభ్యులుగా నియమించ బడారు. ప్రస్తుతం రాష్ట్ర సంఘాలు స్వయంప్రతి పత్తి కలిగినవి. కేంద్ర గాంధీ స్మారకనిధి కేవలం సమన్వయసంస్థగా పని జేస్తున్నది. రాష్ట్ర సంఘాలకు సలహాలు ఇవ్వడం దాని ప్రధాన బాధ్యత.

రాష్ట్రం మొత్తం మీద 13,45,972 రూపాయలు ఈ నిధికి వసూలు అయ్యాయి. హైదరాబాద్‌కు ఇచ్చిన నిధులు 5,28,797 రూపాయలు. దానిలో 3,49,062 రూపాయలు కేంద్రనిధికి బదిలీ చేయగా, మిగతా 15,25,706 రూపాయలు రాష్ట్ర నిధి ఉంది.

గాంధీ స్మారక నిధి కార్యక్రమాల గురించి సుప్రసిద్ధ గాంధేయవాది శ్రీ కోదాటి నారాయణరావుగారిని అడిగినపుడు గాంధీ స్మారక కార్యక్రమాల గురించి వివరిస్తూ "ప్రారంభంలో గాంధీ స్మారకనిధి నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు ఆర్థిక సహాయం సాంకేతిక సలహాలు యిచ్చింది. తర్వాత కొన్ని ఎన్నిక చేసిన గ్రామాలలో గ్రామీణాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేసి గ్రామ సేవకులను నియమించింది. ఈ కార్యకర్తలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో సుశిక్షితులైనవారు. కొన్నాళ్ల అనుభవం సంపాదించిన తర్వాత ఒక్కొక్క కేంద్రంలో ముగ్గురు చొప్పున గ్రామసేవకులను నియమించి కేంద్రీకృత ప్రాతిపదికపై కార్యక్రమాలను నిర్వచించింది. తెలంగాణా ప్రాంతంలో శివరాంపలి, సార్‌కర్నూలు, రాయలసీమ ప్రాంతంలో చాగలమర్రు, వెంకటపతిరాజు ఖండ్రిక, ఆంధ్రప్రాంతంలోని పెనుమలూరు, తాడువాయి గ్రామాలలో గ్రామ సేవా కేంద్రాలు పనిచేస్తుండేవి. తర్వాత పొన్నాల, నరాపురం అగ్రహారం గ్రామాలలో సేవా కేంద్రాలను నెలకొల్పి





గాంధీ సాహిత్య ప్రచురణాలయం

పోలవరం, వాగళ్ళ గ్రామాలలోవున్న గాంధీజీ ఆశ్రమాల్ని గాంధీజీ స్మారక నిధి తీసుకొన్నది" అన్నారు.

శ్రీ నారాయణరావుగారు కార్యక్రమాలను వివరిస్తూ ఇలా అన్నారు :

నాగర్‌కర్నూలు కేంద్రం జపాను వరిసాగు వ్యవసాయ పద్ధతుల ప్రచారాన్ని చేపట్టింది. తర్వాత ఖాదీ పనిని కూడా నిర్వహించింది. శివరాంపల్లి కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని, నీళ్ళు ఇంకిపోయే గొయ్యిల తవ్వటం మొదలయిన కార్యక్రమాలను, పంటఎరువు తయారీని కూడా ఈ కేంద్రం చేపట్టింది. వాగులమర్రిలో కూడా ఖాదీపనిని నిర్వహించింది. "గాంధీ ఘర్" అనే భవనాన్ని నిర్మించింది. వెంకటపతిరాజు ఖండ్రిక కూడా వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతులకై చేపట్టేటట్లు కృషి చేసింది. పెనుమలూరులో కూడా ఖాదీపనిని నిర్వహించింది. హిందీ తరగతులుకూడా నిర్వహించింది. ఈ కేంద్రంలో ఒక భవనాన్ని కూడా నిర్మించింది.

"తాడువాయి" కేంద్రం భూదాన ఉద్యమంవల్ల మిగిలిన 80 ఎకరాలను హరిజనులకు పంపిణీ చేసింది. తర్వాత దంపుడుమిల్లు ఏర్పాటు చేసింది. పొన్నాలగ్రామంలో కేంద్రం పారిశుద్ధ్య విషయాల్లో కార్యకర్తలకు ప్రాంతీయ పారిశుద్ధ్య విద్యాలయం ఇచ్చింది. 1965 సంవత్సరం తర్వాత గాంధీ స్మారక నిధి కార్యకర్తలు 13 గ్రామాలలో గ్రామసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. 1965 సంవత్సరంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన నిర్మాణ కార్యకర్తల మహా సభలో 300 మంది పాల్గొనేటట్లు ప్రోత్సహించారు. ప్రాథమికోన్నత పాఠశాలకు ఖమ్మంజిల్లాలో కరకగూడెంలో ఏర్పాటు చేయడానికి దోహదం చేసింది గాంధీ స్మారక నిధి.

నల్లగొండజిల్లాలో 10 రోజులపాటు పాదయాత్రను సర్వోదయ ఆశ్రమం సహకారంతో ఈ నిధి నిర్వహించింది. 1969వ సంవత్సరంలోకూడా కొంతమంది కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించారు. ఈ పర్యటనల సందర్భంగా జాతీయ సమైక్యత గురించి ప్రజలకు ఉద్బోధించారు.

గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బాపూజీ నిర్మాణ కార్యక్రమాన్ని గౌరవ ప్రాతిపదికపై నిర్వహిస్తూ గ్రామీణ కేంద్రాలను నిర్వహించగలిగేవారికి ఈ కేంద్రాలను దత్తంచేసింది. నర్సాపురం అగ్రహారంలో కేంద్రం పొందూరు నాణ్యం ఖాదీ కార్మిక సంఘానికి వప్పజెప్పింది. వాగల్లు, వాగలమర్రి కేంద్రాలలో పాఠశాలలను నిర్వహించే బాధ్యత వప్పజెప్పబడింది. పెనుమలూరు, కార్వేటినగరం, పొన్నాల కేంద్రాలు వరుసగా శ్రీ బి.ఎస్. ఆర్. మూర్తిగారికి, శ్రీ సుబ్రహ్మణ్యంరెడ్డిగారికి, శ్రీ అరిగే సదానందం గారికి వప్పజెప్పబడ్డాయి. వారు ఈ కేంద్రాలను చూస్తూ గాంధీజీ



గాంధీ జ్ఞాన మందిరం



గాంధీ బుక్ హౌస్ విక్రయ కేంద్రం

నిర్మాణకార్యక్రమాలను అమలుజేస్తున్నారు. పెనుమలూరులో శ్రీ ఐ.ఎస్.ఆర్. మూర్తి ప్రకృతి ఆశ్రమాన్నికూడా నిర్వహిస్తున్నారు.

ఈ గాంధీ స్మారక నిధి కార్యాలయంలో పని చేస్తున్న శ్రీ రంగారావుగారు గాంధీజీ సిద్ధాంతాలను ఏ విధంగా ప్రచారం చేస్తున్నదో వివరిస్తూ ఇలా అన్నారు. "గాంధీజీ సిద్ధాంతాల ప్రచారం కోసం పుస్తకాల ప్రచురణకు నిశ్చయించి, ప్రఖ్యాత రచయితలతో కూడిన ఒక సంపాదకవర్గాన్ని ఏర్పాటు చేసింది. గాంధీజీ సాహిత్యాన్ని లాభనష్టాలులేని ప్రాతిపదికపై ప్రచురించడానికి లక్ష రూపాయల నిధిని ఏర్పాటు చేసింది. 1959 సంవత్సరంలో కాకినాడ కేంద్రంగా ఈ ప్రచురణాలయం ప్రారంభమయింది. మొదట్లో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఈ ప్రచురణలకు ఆధ్వర్యం వహించారు. తర్వాత శ్రీ ఎమ్. వి. కృష్ణారావుగారు ఈ ప్రచురణల సంఘానికి అధ్యక్షత వహించారు. 20 పుస్తకాల ప్రచురణ తర్వాత ఈ ప్రచురణల కేంద్రాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఇప్పటివరకు 111 పుస్తకాలను ప్రచురించింది. సుమారు రెండు లక్షల రూపాయల విలువగల గాంధీ సాహిత్యాన్ని ఇప్పటి వరకు అమ్మింది."

శ్రీ కోడాటి నారాయణరావుగారు గాంధీ సిద్ధాంతాల ప్రచారం కోసం జరిగిన కృషిని తెలుపుతూ "గాంధీ సాహిత్యాన్ని కలిగిన ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈనాడు 2979 పుస్తకాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాన్ని ప్రతిరోజు 70 మంది సందర్శిస్తున్నారు. 20 మందైనా కనీసం పుస్తకాలు చదివే విషయంలో సంప్రతిస్తూ ఉంటారు. గాంధీ దర్శనం అనే ఒక ప్రత్యేక ఫోటోల ప్రదర్శన కూడా ఏర్పాటుచేశాం. ఆ ఫోటోల ప్రదర్శనను ప్రతిరోజు 50 మందైనా సందర్శిస్తూఉంటారు. పుస్తకాల విక్రయశాలను కూడా ఏర్పాటు చేశాం".

ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున విజయవాడలో జాతిపిత గాంధీజీ స్మారక చిహ్నాన్ని నెలకొల్పాలని నిర్ణయించి గాంధీ పర్వతంపై 18 ఎకరాల స్థలాన్ని సేకరించి గాంధీజీ జీవితానికి సంబంధించిన పుస్తకాలను వివరించే పుస్తకాలను సేకరించి ఆ ప్రదేశంలో ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పింది. గ్రంథాలయ భవనాన్ని నిర్మించింది. గాంధీ స్థూపాన్ని నిర్మించింది. గాంధీ పర్వతంపై స్థూపం చుట్టూరా తిరగటానికి గాను ఒక పిల్లల రైలును ఏర్పాటు చేయడమయింది. ఈ గాంధీ పర్వతం విశేషంగా జనాన్ని ఆకర్షిస్తున్నది. ఈ గాంధీ స్థూపాన్ని నిర్మించటానికి గాంధీ స్మారక నిధి లక్ష రూపాయల విరాళం యిచ్చింది. విద్యాశాఖ సహకారంతో గాంధీ స్మారక నిధి స్వాధ్యాయ సమితిని స్థాపించి హిందీ విద్యావ్యాప్తికి దోహదం చేస్తున్నది. ప్రారంభిక, ప్రాథమిక పరీక్షలకు 500 మందిని పంపించింది. ఆంధ్ర ప్రదేశ్ గాంధీ స్మారక నిధి తీసుకున్న చొరవవల్ల హైదరాబాద్‌లో హరిజన మహాసభలను ప్రభుత్వం నిర్వహించి "హరిజన సమాచార్" అనే మాసపత్రికను నెలకొల్పిరి. ఈ విధంగా బలహీన వర్గాల ప్రజలకు సేవ చేస్తున్నది. మద్యనిషేధ కార్యక్రమం విస్తృత ప్రభావం కోసం తీవ్రంగా ఈ సంస్థ కృషి చేస్తున్నది.

గాంధీజీ తత్త్వ ప్రచారం కోసం విశాఖపట్టణం, హైదరాబాద్, తిరుపతి నగరాల్లో, వరంగల్, కాకినాడ పట్టణాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి, నిర్వహించింది. ఈ కేంద్రాలలో విద్యార్థుల, యువకుల సమావేశాలు గోష్ఠులు నిర్వహించి గాంధీజీ సందేశాలను, సిద్ధాంతాలను విశేషంగా ప్రచారం చేసింది. గాంధీజీ శతజయంతి ఉత్సవము గాంధీ స్మారక నిధి ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా నిర్వహించబడింది.



గాంధీ స్మారక నిధి గ్రంథాలయం

ప్రస్తుతం గాంధీ స్మారక నిధి కార్యకలాపాల గురించి శ్రీ కోదాటి నారాయణరావుగారు వివరిస్తూ నాగరి లిపి ప్రచార సంఘాన్ని నెలకొల్పి నాగరి లిపి ప్రచారం కోసం కృషి చేస్తున్నదన్నారు. దక్షిణ హిందీ ప్రచారసభ సహకారంతో అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో రెండు రోజులపాటు గాంధీ సిద్ధాంతాలపై శిక్షణ ఇచ్చింది అన్నారు.


సర్వోదయ విచార ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన గాంధీ జ్ఞాన మందిరంలో కార్యాలయం కలిగిన ఈ గాంధీస్మారకనిధి రాష్ట్ర స్థాయిలో నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొనే స్వచ్ఛంద సంస్థల సమన్వయ సంస్థగా పని చేస్తుంది. ఆంధ్ర ప్రదేశ్ సర్వోదయ మండలి, గాంధీ జ్ఞానమందిర్ సహయోగి సంఘం, ఆంధ్ర ప్రదేశ్ భూదాన బోర్డు, ఖాదీ కమిషన్, హైదరాబాదు జిల్లా గ్రంథాలయ సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణ కర్యాకర్తల సంఘం, గాంధీ కస్తూరిబా సేవా సంఘం మొదలైన సంస్థల కార్యకలాపాల నిర్వహణకు సహకారాన్ని అందజేస్తున్నది.

హైదరాబాద్‌లో గాంధీజీ సిద్ధాంతాలకు విశేష ప్రచారమిచ్చే మరొక గాంధీ శాంతి సంఘం. ఈ సంఘానికి గౌరవ కార్యదర్శిగా శ్రీ ఎమ్ ఎల్. నరసింహారావుగారు. గాంధీ సిద్ధాంతాలకు ప్రచార మిచ్చి అశాంతి, అల్లకల్లోలం లేకుండా సమాజాన్ని శాంతి యుత పంథాలో నడిపించటం, గాంధీ జీవన విధానాన్ని ప్రోత్సహించటం గాంధీ శాంతి యుత పంథాని అన్ని వేళలా సంఘంలో ఏర్పడిన అనుమానాలను, అపోహలను వైషమ్యాలను అనర్థాలను తొలగించటానికి ఉపయోగపడతాయనే విషయాన్ని నిరూపించటం ఈ సంఘ ఆదర్శాలని వివరించారు శ్రీ ఎమ్. ఎల్. నరసింహారావుగారు.

విద్యార్థులలో గాంధీ సిద్ధాంతాల అవగాహనకు గాంధీ పరిశీలన కేంద్రాలను ఏర్పాటుచేసి నిర్వహించింది. ఒక పఠనాలయాన్ని కూడా నిర్వహిస్తున్నది. ప్రజలలో రాజకీయ విజ్ఞానాన్ని కలిగించటం 'వోటు' అనే విషయంపై ఒక కరపత్రాన్ని ప్రచురించింది. ఈ గాంధీ శాంతి సంఘం కేంద్రాలు హైదరాబాద్, విజయవాడ, తిరుపతిలలో ఉన్నాయి. అవి సెమినార్లను నిర్వహిస్తూ ఉంటాయి. విద్యార్థులలో శ్రమ శక్తి పట్ల సేవాభావాన్ని కలిగించటానికిగాను విద్యార్థి శిబిరాలను తిరుపతి కేంద్రం నిర్వహించింది. హైదరాబాద్ కేంద్రముగా హైదరాబాద్‌కు 20మైళ్ళ దూరంలో ఉన్న కొహెడా గ్రామంలో 1972 మే ఏడవ తేదీ నుంచి 13వ తేదీవరకు ఒకయువజన కార్యక్రమ శాంతి శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో కొహెడా గ్రామం వరకు హరిజనులు విద్యార్థులు పాల్గొనిరి. ఒకరహదారిని కూడా వేశారు.

కరపత్రాలతో పాటు రెండు సావనీర్లను కూడా ప్రచురించిరి. ఎంతో సమాచారం ఉంది.

గాంధీస్మారకనిధి గాంధీ శాంతి సంఘం ప్రెస్ ఫౌండేషన్ కార్యక్రమాల గురించి తెలుసుకొని ఆంధ్రప్రదేశ్‌లో కనీసం సమితి స్థాయిలో బ్రాంచీలు ఏర్పాటు చేసి క్రమశిక్షణతో శ్రమించి పని చేసే అలవాటును విద్యార్థులలో కలిగించవలసిన అవసరం ఉంది.



గాంధీ మ్యూజియం

గాంధీస్మారకనిధి కార్యదర్శి శ్రీ నారాయణరావుగారికి అడిగినపుడు ఒక్కొక్క పుస్తకం ఇదివరలో రెండు వేల ప్రతులు వేసేవారని ఇప్పుడు వెయ్యి ప్రతులు వేస్తున్నారని అన్నారు.

ఈ నాడు సమాజంలో అలుముకున్న స్వార్థం సంకుచితత్వం, అసహనం, అశాంతి భావాల బెడద తొలగాలంటే గ్రామ స్థాయిన గాంధీజీ ఆదర్శాల విస్తృత ప్రచారంజరగాలి. అందుకు కార్యకర్తలను తయారుచేసి కార్యక్రమానికి గాంధీజీ స్మారక సంఘం దీక్ష వహించాలి. ఆనాడే గాంధీజీ ఆశించిన ప్రియమైన సమాజం వస్తుంది.

సచ్ఛీలం

మన విజ్ఞానం, వేద పఠన శక్తి, సంస్కృత భాషా పాండిత్యం, లాటిన్, గ్రీకు భాషల పరిజ్ఞానం .... ఒకటేమిటి, యిటువంటి వన్నీ వృథా, మన హృదయంలోని కల్మష నిర్మూలనకు దోహదం చేయకపోతే. విజ్ఞానార్జన పరమలక్ష్యం సచ్ఛీల సంపాదనమే.

శీలవంతుడు ఏ స్థానంలోనైనా రాణిస్తాడు.

—గాంధీజీ

